గురువారం
1•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 235
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
చంద్రప్రభ కనువిందు 11
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

వనమంతా జనమే.. తనువంతా తల్లులే..

గద్దెనెక్కిన సారక్క





సిగాలూగె మేడారం

బుధవారం రాత్రి మేడారం సమ్మక్క సారక్క గద్దెల వద్ద పెద్దసంఖ్యలో తల్లుల కోసం వేచిచూస్తున్న భక్తకోటి. (ఎడమ వైపు) సారక్కను గద్దెకు చేరుస్తున్న పూజారులు

- ఆదివాసీ సంప్రదాయాలతో సంబురంగా కన్నెపల్లి నుంచి తరలివచ్చిన సారక్క
- పొర్లుదండాలతో శివాలూగిన భక్తజనం
- పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు.. కొండాయి నుంచి గోవిందరాజులు చేరిక
- జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ మహేందర్‌రెడ్డి
- మేడారానికి నేడు ఛత్తీస్‌గఢ్ సీఎం
- రేపు ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం కేసీఆర్ రాక

(మేడారం నుంచి వరంగల్ ప్రధాన ప్రతినిధి, భూపాలపల్లి ప్రతినిధి-నమస్తే తెలంగాణ)

రెండేండ్ల ఎదురు చూపుల తర్వాత మేడారంలో జాతర సంబురాలు మిన్నంటాయి. జంపన్నవాగు జన సందోహంతో పరవళ్లు తొక్కింది. కన్నెపల్లినుంచి సారక్క మేడారం గద్దెకు చేరుకోవడంతో తొలిఘట్టం పూర్తయింది. మరోవైపు పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారక్కకు స్వాగతం పలికారు. ఈ ముగ్గురు దేవతల రాకతో మేడారం సంబురంలో మునిగింది. వనదేవతల దర్శనానికి జన ప్రవాహం తరలివచ్చింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భక్తకోటి సారక్క రాకతో ఒక్కసారిగా పులకించి పోయింది. తల్లీ సారక్క నీవే దిక్కని దిక్కులన్నీ పిక్కటిల్లేలా జాతరకొచ్చిన భక్తులు దారి పొడవునా పొర్లుదండాలు పెడుతూ ప్రణమిల్లారు. ఎటు చూస్తే అటు జనమై వనమంతా తల్లులకు వందనాలు సమర్పించింది. మేడారం మహా జాతరలో తొలిఘట్టం సారక్క రాకతో ముగిసింది. తల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి స్వాగతించేందుకు మేడారం ఒళ్లంతా కండ్లుగా ఎదురుచూస్తున్నది.

నేడు సమ్మక్క రాక

సారక్క గద్దెకు చేరిందిలా

తెల్లవారుజాము నుంచే కన్నెపల్లికి సారక్క కోసం భక్త జనం వరద మొదలైంది. సారక్కను తోడ్కొని వచ్చే ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఆయనను అనుసరించే ఇతర వడ్డెలు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఇదే సమయానికి ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, మహారాష్ట్రలోని సిరొంచ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ కోయ గిరిజనుల పూజా విన్యాసాలతో కన్నెపల్లి మారుమోగింది. ఇక్కడ పూజా కార్యక్రమాలు పూర్తయిన తరువాత ఆనవాయితీ ప్రకారం కన్నెపల్లి నుంచి 16 మంది ఆడబిడ్డలు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం డోలీ విన్యాసాలతో మేడారం వచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క సారక్కలు కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంకవనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం మూడు గంటలనుంచే కన్నెపల్లి గుడి దగ్గర డోలి విన్యాసాలు, తుడుం దెబ్బ, ఆదివాసీ టీచర్స్

మిగతా 5వ పేజీలో

కొత్త సీఎస్ ఎస్కే జోషి

- సీఎం కేసీఆర్ నిర్ణయం.. వెంటనే ఉత్తర్వులు
- ఎస్పీ సింగ్ నుంచి బాధ్యతల స్వీకరణ
- అప్పగించిన పనిని కష్టపడి పూర్తిచేస్తా
- టీంవర్క్‌తో ప్రజాసమస్యల పరిష్కారం
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు : జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా శైలేంద్రకుమార్ జోషి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తూ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అపారమైన అనుభవం గడించిన జోషిని రాష్ట్రానికి నాలుగో ప్రధాన కార్యదర్శిగా నియమించాలని సీఎం కేసీఆర్ బుధవారం నిర్ణయించిన వెంటనే ప్రభుత్వ సాధారణ

మిగతా 2వ పేజీలో



నేడే కేంద్ర బడ్జెట్

- సార్వత్రిక బడ్జెట్‌పై ఎన్నో ఆశలు
- పల్లె జనుల ఆకాంక్షలను నెరవేర్చాలా.. ద్రవ్యలోటు లక్ష్యాలకే పరిమితం కావాలా..
- డైలమాలో మోదీ ప్రభుత్వం



బడ్జెట్‌కు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తుదిమెరుగులు

సార్వత్రిక బడ్జెట్ 2018-19 ప్రతిపాదనకు సమయం ఆసన్నమైంది. దేశంలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడిదారీ వర్గాలు సహా కోట్ల మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షల నడుమ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్డీయే సర్కారు ప్రతిపాదించనున్న చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రజలకు, రైతులకు అర్థమయ్యేందుకు ఈసారి జైట్లీ హిందీలో ప్రసంగించనున్నారు. తద్వారా హిందీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తొలి ఆర్థికమంత్రిగా జైట్లీ చరిత్రకెక్కనున్నారు.

వివరాలు 13వ పేజీలో

హోంగార్డుల రోజువారీ భత్యం రూ.675

హోంశాఖ ఉత్తర్వులు
కానిస్టేబుళ్లతో సమానంగా సదుపాయాలు
ప్రతి ఏప్రిల్ 1న వెయ్యి రూపాయలు పెంపు 8

ఫిబ్రవరి 24 నుంచి టీఆర్టీ పరీక్షలు

19 నుంచి గురుకుల విద్యాలయాల జూనియర్ లెక్చరర్ పోస్టులకు పరీక్షలు 3

అమెరికాలో ప్రవేశానికి ప్రతిభే గీటురాయి

నూతన వలస విధానంలో ఇదే కీలకం
లాటరీ విధానాన్ని రద్దుచేసే సమయం వచ్చింది
అమెరికా అధ్యక్షుడు ట్రంప్
కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి తొలిసారి ప్రసంగం 11

టీఆర్‌ఎస్‌దే జైత్రయాత్ర

వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే.. లేదంటే రాజకీయ సన్యాసం తీసుకుంటా

కాంగ్రెస్ గెలువకుంటే ఉత్తమ్ రాజకీయ సన్యాసం తీసుకుంటారా?

గద్వాలలో మంత్రి కేటీఆర్ సవాల్

అప్పర్ కృష్ణను కాంగ్రెస్ నేతలు అడ్డుకొని పాలమూరును ముంచారని ఆరోపణ

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

2019 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో టీఆర్‌ఎస్ మళ్లీ ఘనవిజయం సాధించి తీరుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ఉద్ఘాటించారు. రాష్ట్రంలో నడిగడ్డ నుంచి ప్రారంభించిన టీఆర్‌ఎస్ జైత్రయాత్రను రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తామని, దీనిని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు, వాటిద్వారా లబ్ధి పొందిన ప్రజలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. మరో 20 ఏండ్లపాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండాలని ఆకాంక్షించారు. శాశ్వత అభివృద్ధి సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకోసం పాటుపడుతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తిరుగులేదన్నారు. ఒకవేళ టీఆర్‌ఎస్ అధికారంలోకి రాకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న కేటీఆర్.. కాంగ్రెస్ గెలువలేకపోతే టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని సవాలు విసిరారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఇందుకు ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బుధవారం గద్వాల జిల్లా కేంద్రంలో రూ.40కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమాల్లో

మిగతా 2వ పేజీలో



బుధవారం గద్వాల పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ వేదికపై కార్యకర్తలు ఇచ్చిన కత్తి, డాలును ప్రదర్శిస్తున్న మంత్రి కేటీఆర్

- దేశంలో కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలు
- దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ రాష్ట్రం
- మా పనితీరు, ప్రజలపై నాకు విశ్వాసం ఉంది
- ఇరవై ఏండ్లు కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉండాలి: మంత్రి కేటీఆర్

వెలిగిన కేటీపీఎస్ ఏడో దశ

- 800 మెగావాట్ల ప్లాంట్‌లో బాయిలర్ లైటప్
- విజయవంతంగా ట్రయల్‌రన్ మొదలు
- రికార్డు సమయంలో పూర్తవుతున్న ప్లాంటు
- తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించి, పూర్తిచేస్తున్న తొలి పవర్‌ప్లాంటుగా రికార్డు
- విద్యుత్ శాఖకు సీఎం కేసీఆర్ అభినందనలు

2

చనాక-కొర్టా, తమ్మిడిహట్టికి మహారాష్ట్ర వన్యప్రాణి మండలి సై

- ఈ రెండు బరాజ్‌లతో వన్యప్రాణులకు హాని లేదు
- అనుమతి కోసం జాతీయ వన్యప్రాణి మండలికి సిఫార్సు
- ఫలించిన నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కృషి

8



క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, సీ పార్థసారథి తదితరులు

వ్యవసాయ, సహకార సంఘాల పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ, సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలలో 456 సంఘాల పదవీకాలం బుధవారంతో ముగిసింది. మరో 427 సంఘాలకు చెందిన పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 3తో ముగుస్తుంది. వీటిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), జిల్లా కేంద్రం మార్కెటింగ్ సంఘాలు(డీసీఎంఎస్), రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్‌కాబ్) పాలకవర్గాలు ఉన్నాయి. మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రులు టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, ఏ ఇంద్రకరణ్‌రెడ్డిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో ఈ అంశంపై చర్చించింది. సమావేశంలో టీఎస్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి, వీరబ్రహ్మం, టీఎస్‌కాబ్ ఎండీ నేతి మురళి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ టౌన్‌ప్లానర్ల సదస్సు

సదస్సును ప్రారంభించనున్న సీఎం కేసీఆర్



టౌన్‌ప్లానర్ల సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న టౌన్‌ప్లానర్ల సంఘం చైర్మన్ ఎస్ దేవేందర్‌రెడ్డి , ఐటీపీఐ అధ్యక్షు డీఎస్ మేష్రామ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్ తాజ్‌కృష్ణహోటల్‌లో 66వ జాతీయ టౌన్‌ప్లానర్ల సదస్సును నిర్వహిస్తున్నామని తెలంగాణ టౌన్‌ప్లానర్ల సంఘం చైర్మన్ ఎస్ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. దాదాపు 20 రాష్ట్రాల నుంచి 400 మంది దాకా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారని వెల్లడించారు. నగరాలు, పట్టణాలు అకాల వర్షాలతో జలమయం అవుతున్నాయని ఇలాంటి సమస్యలపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. బుధవారం గోల్కొండ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ ఐఐటీ రూర్కీ, ఖరగ్‌పూర్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, కర్ణాటక, ముంబై, బెంగళూరులకు చెందిన అర్బన్ ప్లానర్లు, ప్రొఫెసర్లు నిపుణులు సదస్సులో పాల్గొని తమ విలువైన సూచనలు సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సదస్సును ప్రారంభిస్తారని.. పురపాలక, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సదస్సులో పాల్గొంటారన్నారు. మేయర్ బొంతు రామ్మోహన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఇండియన్‌టౌన్ ప్లానర్ల సంఘానికి ప్రప్రథమ అధ్యక్షుడిగా వ్యవహరించిన హైదరాబాద్‌కు చెందిన ఫయాజుద్దీన్ పేరిట ఈ సదస్సులో బెస్ట్ థీసిస్ అవార్డు ఇవ్వనున్నట్టు తెలిపారు.

మైనారిటీ యువతకు సర్కార్ 'చిరాగ్'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముస్లిం విద్యార్థులు, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం కోసం తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎఫ్‌సీ) పదిహేను రోజుల్లో ఆధునిక సౌకర్యాలతో ఆరు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించనున్నది. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రాల్లో వీటి ఏర్పాటుపూర్తికాగా, సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్‌లలో పనులు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే ఒక్కొక్క కేంద్రం నుంచి ప్రతిమూడు నెలలకు 250 మంది వరకు, ఏడాదికి వెయ్యి మంది ముస్లిం యువకులు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకునేందుకు వీలుంటుందని టీఎస్ఎంఎఫ్‌సీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ తెలిపారు. రాష్ట్రంలో 37 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ కేంద్రాలకు 'చిరాగ్' (దీపం) అని నామకరణం చేసింది.

26 నుంచి ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 విద్యా సంవత్సరం అఫిలియేషన్ కోసం ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 24 వరకు తనిఖీలను నిర్వహించాలని జేఎన్టీయూహెచ్ వీసీ వేణుగోపాలరెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ బుధవారం షెడ్యూల్‌ను విడుదలచేశారు. అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 నుంచి ఫిబ్రవరి 19 వరకు గడువు విధించినట్టు పేర్కొన్నారు. అఫిలియేషన్ దరఖాస్తులను www.jntuhaac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు. దరఖాస్తులతోపాటు అఫిలియేషన్ పొందడానికి అవసరమైన అన్నిరకాల ధ్రువపత్రాలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని సూచించారు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి 2150 కోట్ల బ్యాంకు రుణం

అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి విజయాబ్యాంకు కన్సార్టియం రూ.5980 కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు గతంలోనే అంగీకరించింది. తన వాటాగా విజయాబ్యాంకు రూ.2150 కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ రుణాన్ని తీసుకునేందుకుగాను కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్)కు అనుమతి ఇస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న లింక్-5 (ప్యాకేజీ-15,16) పనులకు ఈ రుణాన్ని వినియోగించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ లింకు పనుల ద్వారా మల్లన్నసాగర్ నుంచి గోదావరిజలాలను గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు తరలిస్తారు. ఇందుకుగాను కాల్వలు, సొరంగం, రిజర్వాయర్ల నిర్మాణపనులకు రూ.7480.79 కోట్ల వ్యయంకానున్నది. ఈ పనులకు విజయాబ్యాంకు ఇచ్చే రుణాన్ని వినియోగిస్తారు.

నెట్ నోటిఫికేషన్ నేడే

- 6 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు.. జూలై 8న పరీక్ష
- తగ్గిన పేపర్లు.. పెరిగిన వయోపరిమితి

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్లు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలకు అర్హత పరీక్ష అయిన 'జాతీయ అర్హత పరీక్ష' (నెట్) నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తులు ఫిబ్రవరి 6న ప్రారంభమై ఏప్రిల్ 5న ముగుస్తాయి. పరీక్షను జూలై 8న నిర్వహించనున్నారు. ఈసారి పలు నిబంధనలు మార్చారు. పరీక్షా పేపర్లు, వయోపరిమితి తదితర అంశాల్లో పలు మార్పులు చేశారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ కూడా ఇటీవలే విడుదలైంది. ఇప్పటినుంచి ప్రతి ఏటా రెండుసార్లు నెట్ నిర్వహించనున్నారు. సాధారణంగా జేఆర్‌ఎఫ్ అభ్యర్థులకు వయోపరిమితి 28 ఏండ్లుగా ఉండేది. దానిని ప్రస్తుతం 30 ఏండ్లకు పెంచారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లవారీగా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. లెక్చరర్‌షిప్‌కు ఎటువంటి వయోపరిమితి ఉండదు. గతంలో నెట్‌లో మూడు పేపర్లు.. మొత్తం 350 మార్కులు ఉండేవి. ఇప్పుడు రెండింటికి కుదించారు. మొత్తం మార్కులను 300కు తగ్గించారు. మొత్తం వంద సబ్జెక్టుల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ పాసైనవారు, చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నవారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

వెలిగిన కేటీపీఎస్ ఏడో దశ

:: వికసిస్తున్న విద్యుత్తేజం ::

- 800 మెగావాట్ల ప్లాంట్‌లో బాయిలర్ లైటప్
- విజయవంతంగా ట్రయల్‌రన్ మొదలు
- రికార్డు సమయంలో పూర్తవుతున్న ప్లాంటు
- తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించి, పూర్తిచేస్తున్న తొలి పవర్‌ప్లాంటుగా రికార్డు
- మార్చి 31 నాటికి గ్రిడ్‌తో అనుసంధానం
- జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు





కేటీపీఎస్ ఏడో దశ లైటప్ దృశ్యాన్ని పరిశీలిస్తున్న సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్లు రాధాకృష్ణ, సచ్చిదానందం, ఈడీలు అజయ్, లక్ష్మయ్య.. కేటీపీఎస్ ఏడో దశ చిమ్నీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి: వెలుగుల తెలంగాణ అప్రతిహతంగా ముందుకు సాగుతున్నది. తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సిగలో మరో మణిహారం చేరబోతున్నది. ప్రజాభిప్రాయ సేకరణతోపాటు అన్నిరకాల అనుమతులతో తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించి, పూర్తిచేస్తున్న తొలి విద్యుత్ ప్లాంటుగా కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్ (కేటీపీఎస్)లోని ఏడోదశ ప్లాంటు రికార్డు సృష్టించబోతున్నది. జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు బుధవారం ఉదయం 8.46 గంటలకు కేటీపీఎస్ ఏడో ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తికి అత్యంత కీలకమైన బాయిలర్‌ను వెలిగించి, ట్రయల్‌రన్ ప్రారంభించారు. మార్చి 31లోగా ఈ ప్లాంటును గ్రిడ్‌కు అనుసంధానం (సింక్రనైజ్) చేయనున్నట్టు ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు ప్రకటించారు.ఉత్తరాంచల్ రాష్ట్రం హరిద్వార్‌లోని బీహెచ్‌ఈఎల్‌లో తయారైన బాయిలర్‌ను ఇటీవలే కేటీపీఎస్‌కు తరలించారు. భారీ జనరేటర్ స్టేటర్‌తో బాయిలర్‌ను అనుసంధానంచేశారు. కార్యక్రమంలో జెన్‌కో డైరెక్టర్లు రాధాకృష్ణ, సచ్చిదానందం, ఈడీలు అజయ్, లక్ష్మయ్య, ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, సీఈ శ్రీనివాస్, కన్సల్టెంట్ గోపాలకృష్ణ, బీహెచ్‌ఈఎల్ ఈడీ ముఖోపాధ్యాయ, ఉన్నతాధికారులు మూర్మి, పీఎస్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చరిత్రలో కేటీపీఎస్ ఏడో ప్లాంటు

కేటీపీఎస్ 800 యూనిట్ల ఏడో ప్లాంటు నిర్మాణ పనులను రూ.5,700 కోట్ల వ్యయంతో 2015 జనవరి 1న ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి సరిగ్గా 39 నెలలు అవుతుంది. కొత్త విద్యుత్ కేంద్రం ప్రారంభించిన 48నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలని కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) నిబంధనలున్నాయి. అయితే కొత్తగూడెం ప్లాంటు అంతకన్నా తక్కువ వ్యవధిలోనే నిర్మాణం పూర్తిచేసుకుని కొత్త చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతున్నది కేటీపీఎస్ ఏడో దశ అందుబాటులోకి వచ్చిన తరువాత తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి 15 వేల మెగావాట్లు దాటుతుంది.

అదనపు వ్యయ భారం తగ్గించేలా..

ఇంట్రెస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్ (ఐడీసీ) భారం అధికంగా పడకుండా నిర్మించిన ప్రాజెక్టుగాకూడా కేటీపీఎస్ ఏడో ప్లాంటు నిలిచిపోనుంది. అగ్రిమెంట్‌లో పేర్కొన్నట్టుగా నిర్ణీత కాలవ్యవధిలోగా పనిపూర్తికాకపోతే ఐడీసీరూపంలో అదనపు వ్యయమవుతుంది. ఈ అదనపు వడ్డీభారాన్నికూడా విద్యుత్ సంస్థలు భరించి, కొనుగోలు చేయాల్సిఉంటుంది. నిర్దేశించిన సమయంకన్నా ముందుగానే నిర్మాణం పూర్తికావడం వల్ల కేటీపీఎస్ ఏడోప్లాంట్ నుంచి కొనుగోలు చేసే విద్యుత్‌కు ఐడీసీ భారం ఎక్కువగా పడదు. ఫలితంగా ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ చాలా తక్కువ ధరకు లభిస్తుంది.

ఈ ఏడాది చివరికి 17వేల మెగావాట్లు : సీఎండీ ప్రభాకర్‌రావు

28 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రణాళిక రచించి, తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యుత్ ఉత్పత్తిని పెంచుతున్నట్టు సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన కేటీపీఎస్ ఏడో దశ ప్లాంటును సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రానికి 17,000 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడేనాటికి 6,573 మెగావాట్ల విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండేదని, మూడున్నరేండ్లలో దానిని 14,972 మెగావాట్లకు చేర్చామని అన్నారు. ఇందులో 3వేల మెగావాట్ల సౌర విద్యుత్‌కూడా ఉందని తెలిపారు. మార్చి 31 నాటికి కేటీపీఎస్ నుంచి 800 మెగావాట్లుకూడా అందుబాటులోకి వస్తుందన్నారు. డిసెంబర్ 31 నాటికి 1080 మెగావాట్ల సామర్థ్యం ఉన్న భద్రాద్రి పవర్ ప్లాంటు నిర్మాణంకూడా పూర్తవుతుందని చెప్పారు.

లక్ష్యం నెరవేరుతున్నది

సీఎండీ ప్రభాకర్‌రావుకు సీఎం అభినందనలు



కేటీపీఎస్ ఏడో దశ నిర్మాణంలో భాగంగా బాయిలర్‌ను వెలిగించి, ట్రయల్‌రన్ ప్రారంభించడంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి బుధవారం జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకరరావుకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. పారదర్శకత, పనుల్లో వేగం సాధించాలనే లక్ష్యాలతో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రభుత్వరంగ సంస్థలకు అప్పగించామని, ఈ లక్ష్యం నెరవేరుతుండటం సంతోషకరమన్నారు. తక్కువ సమయంలో నిర్మిస్తున్న కేటీపీఎస్‌ను స్ఫూర్తిగా తీసుకుని, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.52 గంటలకు

సూర్యాస్తమయం: 6.08 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం పాడ్యమి మధ్యాహ్నం 3.45 వరకు తదుపరి విదియ, నక్షత్రం: ఆశ్లేష మధ్యాహ్నం 3.06 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.40 నుంచి 3.16 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.54 నుంచి 3.19 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి 4.37 వరకు, వర్జ్యం: తె. 5.04 నుంచి 6.40 వరకు.

లోకం పోకడ



గ్రహణానికి, భూకంపానికి, బడ్జెట్‌కు సంబంధం లేదయ్యా... నిశ్చింతగా ఉండు!





గద్వాల సభకు హాజరైన ప్రజలతో జై తెలంగాణ నినాదాలు చేయిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, జెడ్పీ చైర్మన్ భాస్కర్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ జగన్నాథం, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు. సభకు హాజరైన ప్రజలు



సభలో విజయసంకేతం చూపుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు జూపల్లి,లక్ష్మారెడ్డి

టీఆర్ఎస్‌దే జైత్రయాత్ర

మొదటిపేజీ తరువాయి...

మంత్రి వెంట పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గద్వాల పాత బస్టాండ్‌లో జరిగిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. అత్యంత వేగంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న ప్రాంతాల్లోను ఎలాంటి తేడాలు లేకుండా అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంతోపాటు గద్వాలలో రూ.40కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రైతులకు రూ.17వేలకోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. వ్యవసాయానికి 24గంటల కరంట్‌ను నిరంతరాయంగా అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. వ్యవసాయ పెట్టుబడి కింద ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలని నిర్ణయించిన తొలి సీఎం కూడా కేసీఆర్ ఒక్కరేనని అన్నారు.

అత్యంత దరిద్రంగా కాంగ్రెస్ పాత్ర

రాష్ట్రంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పాత్ర అత్యంత దరిద్రంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. దేశంలోనే ఇలాంటి ప్రతిపక్షపార్టీ ఏరాష్ట్రంలోనూ లేదని దుయ్యబట్టారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనను, మూడున్నరేండ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారని చెప్తూ.. మంచి, చెడులను ప్రజలు ఆలోచించాలని, సొంతఆస్తులను పెంచుకునే నాయకులను కాకుండా ప్రజల క్షేమంకోరి ప్రజలకోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్ట్‌లకు కాంగ్రెస్ అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నదని మండిపడ్డారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో దగా పడిన ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్ట్ అయిన పాలమూరు-రంగారెడ్డిని కాంగ్రెస్ నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమైక్య పాలనలో జిల్లాకు చెందిన జైపాల్‌రెడ్డి, డీకే అరుణ, చిన్నారెడ్డి తదితర నాయకులు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. తెలంగాణ నుంచి మంత్రులుగా ఉంటూ ఇతర ప్రాంతాల్లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి హారతులు పట్టారని మాజీ మంత్రి డీకే అరుణనుద్దేశించి వ్యాఖ్యానించారు.

అప్పర్ కృష్ణను ముంచేసిన కాంగ్రెస్

కృష్ణానదిపై అప్పర్‌కృష్ణ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేసి, 164 టీఎంసీలతో ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేయాలని నిజాంకాలంలోనే నిర్ణయించారని కేటీఆర్ గుర్తుచేశారు. 16.40లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా రూపకల్పనచేసిన ఈ ప్రాజెక్ట్‌ను సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువునా ముంచేసిందని ఆరోపించారు. దీని పర్యవసానంగా పాలమూరులో దశాబ్దాల తరబడి కరువు విలయతాండవం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. మూడున్నరేండ్లలోనే ఐదున్నర లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరందించిన చరిత్ర టీఆర్ఎస్‌దని కేటీఆర్ స్పష్టంచేశారు. 87వేల ఎకరాలకు సాగునీరందించిన ఆర్డీఎస్‌ను కూడా కాంగ్రెస్ పాలకులు నిర్వీర్యంచేసి నడిగడ్డకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఆర్డీఎస్ ఆయకట్టు కోసం నాటి ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ జోగుళాంబ నుంచి గద్వాల వరకు పాదయాత్ర చేసిన సంగతిని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఇటీవల నడిగడ్డను దృష్టిలో ఉంచుకొని ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. తుమ్మిళ్ల పనులను ఏడాదిలోపు పూర్తిచేసి నడిగడ్డలోని 50వేల ఎకరాలకు సాగునీరందించి తీరుతామని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఓడిపోతున్నా కాంగ్రెస్ నేతల ప్రగల్భాలు

జీహెచ్ఎంసీ ఎన్నికల్లోను, ఇతర అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ తోక ముడిచినప్పటికీ కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని కేటీఆర్ ఎద్దేవాచేశారు. 2019 ఎన్నికలకు ఇంకా 20 నెలల సమయం ఉందన్న మంత్రి.. గడిచిన మూడున్నరేండ్లుగా తాము చేపట్టిన అభివృద్ధి పనులపైన, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న ప్రజలపైన తమకు పూర్తివిశ్వాసం ఉందని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టంచేశారు. 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారం చేపట్టకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని చెప్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీ గెలువకుంటే రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉన్నారా? అని సవాలు విసిరారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన ప్రజల విశ్వాసం పొందలేరని ఎద్దేవాచేశారు. రాష్ట్రాన్ని, దేశాన్ని సర్వనాశనంచేసిన కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని ఆ పార్టీ నేతలు ఊహించుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

తుమ్మిళ్లతో నడిగడ్డ సస్యశ్యామలం

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నడిగడ్డను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఇప్పటికే నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తున్నట్టు చెప్పారు. జూరాల ప్రాజెక్ట్‌ను 30 ఏండ్లపాటు నిర్మించిన కాంగ్రెస్, నెట్టెంపాడును దశాబ్దకాలం కిందట మొదలుపెట్టి వదిలేసిందని విమర్శించారు. ఆనాడు కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టిన తర్వాతే తెలంగాణలో ప్రాజెక్టులకు నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ కొబ్బరికాయలు కొట్టారని గుర్తుచేశారు. టీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి, పార్టీ రాష్ట్రకార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్రకార్యదర్శి రాములు, మాజీ ఎంపీ జగన్నాథం, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఎస్ ఎస్కే జోషి

మొదటిపేజీ తరువాయి...

పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా జీవో విడుదల చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఎస్‌కే జోషి ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు ఐఏఎస్ అధికారులు జోషిని అభినందించారు.

కేసీఆర్ కలలు సాకారం చేస్తా: జోషి

తనపై నమ్మకంతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎస్కే జోషి అన్నారు. ప్రభుత్వం అప్పగించిన పనిని కష్టపడి పూర్తి చేస్తానని తెలిపారు. బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోషి మీడియాతో మాట్లాడుతూ అధికారయంత్రాంగమంతా అంకిత భావంతో ఒక టీమ్‌గా కలిసి పనిచేస్తూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ కలలన్నీ సాకారం చేయడానికి పాటుపడుతానని అన్నారు.

హైదరాబాద్‌ను చూడాలని తెలుగు నేర్చుకున్నా

హైదరాబాద్‌ను ఒక్కసారైనా చూడాలని చిన్నప్పుడు అనుకుంటే.. ఏకంగా 30ఏండ్లపాటు హైదరాబాద్‌లో, తెలుగు రాష్ట్రాల్లో పనిచేసే అవకాశం వచ్చిందని జోషి చెప్పారు. 'చిన్నప్పుడు హైదరాబాద్ చూడడం కోసం తెలుగు నేర్చుకున్నాను. ఆరో తరగతిలో తెలుగును మూడో భాషగా ఎంచుకున్నాను. కానీ ఐఏఎస్ అధికారిగా 30ఏండ్లుగా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో పనిచేసే అవకాశం లభించింది' అని తెలిపారు. బ్యూరోక్రాట్లకు డ్రీమ్ ప్రాజెక్టులుండవని, ముఖ్యమంత్రి, క్యాబినెట్ నిర్ణయాలను తూ.చ. తప్పకుండా అమలుచేయడమే తమ డ్రీమ్‌ప్రాజెక్టు అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న, చేపట్టబోతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వందశాతం అమలు చేయడమే తమ బాధ్యతన్నారు.

చూద్దామనుకుంటే.. పనిచేసే అవకాశం దక్కింది

ఉత్తరప్రదేశ్ బరేలిలో శంకర్‌లాల్ జోషి, శ్యామ జోషి దంపతులకు 1959 డిసెంబర్ 20న శైలేంద్రకుమార్ జోషి జన్మించారు. తల్లి గృహిణి. తండ్రి అలహాబాద్ బ్యాంక్‌లో ఉద్యోగి. ప్రాథమిక విద్యాభ్యాసం విష్ణుబాయి సదన్‌లో జరిగింది. 6 నుంచి 12వ తరగతి వరకు బరేలిలో చదువుకున్నారు. తనజీవితంలో అనేక సంఘటనలు కాకతాళీయంగానే జరిగాయని చెప్తుంటారు జోషి. తాను సివిల్ సర్వెంట్ అవుతానని అనుకోలేదు. కానీ, అనుకోకుండా సివిల్స్‌కు సిద్ధమై, చిన్ననాడు తాను ఊహించుకున్న హైదరాబాద్‌లోనే స్థిరపడడం విశేషం. జోషి భార్య అనురాధ ఎంఏ, ఎల్ఎల్బీ చదివినప్పటికి కుటుంబం కోసం గృహిణిగానే ఉన్నారు. జోషి కూతురు రియా ఐఆర్ఎస్ అధికారిణి.

అపార ప్రజ్ఞ.. సుదీర్ఘ అనుభవం

ఐఐటీ రూర్కీలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 1977 నుంచి 1981 వరకు ఇంజినీరింగ్ చదివిన జోషి.. ఐఐటీ ఢిల్లీలో 1981 నుంచి 1983 వరకు కమ్యూనికేషన్స్ అండ్ రాడార్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేశారు. అనంతరం ఇండియన్ రైల్వేస్ సర్వీస్ సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్‌గా ఎనిమిది నెలలు ఉద్యోగం చేసి, 1984లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. ఆ తరువాత తెనాలి, వికారాబాద్‌లకు సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఐటీ, సాగు నీటి పారుదలశాఖ, పురపాలక, ఇంధన, వైద్య ఆరోగ్య, రెవెన్యూశాఖలలో విధులు నిర్వర్తించారు. కేంద్ర పర్యావరణ శాఖలో వివిధ హోదాలలో తొమ్మిదేండ్లు పనిచేశారు. జర్మనీలో క్యోటో ప్రోటోకాల్ మెకానిజంలో వైస్ చైర్మన్ హోదాలో ఏడాదిపాటు బాధ్యతలు నిర్వర్తించారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో కేంద్ర ఇంధన, వ్యవసాయ మంత్రులకు పీఎస్‌గా పనిచేశారు. 'మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్ బౌండరీ వాటర్ రిసోర్సెస్' పుస్తకం రాశారు. ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే 2010లో 'టెరి స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఆన్ ఇంటర్ గవర్నమెంటల్ ఫిస్కల్ ట్రాన్స్‌ఫర్స్ అండ్ ది ఎన్విరాన్‌మెంట్-ఏ స్టడీఆఫ్‌ఇండియా'పై పీహెచ్‌డీ చేశారు.

బంగారు తెలంగాణ సాధ్యమే: సీఎస్ ఎస్పీసింగ్

ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో త్వరలో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని పదవీ విరమణచేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీసింగ్ చెప్పారు. బుధవారం పదవీ విరమణ చేసిన సీఎస్ ఎస్పీసింగ్‌కు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. జీఏడీ ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా అధ్యక్షతన బుధవారం సాయంత్రం వీడ్కోలు సభ నిర్వహించింది. సభలో ఎస్పీసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేయడం తనకు గర్వంగా ఉందన్నారు. అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. మర్యాద, ఆతిథ్య రంగంలో తెలంగాణను మించిన రాష్ట్రం లేదని చెప్పారు.



ఎస్కే జోషిని అభినందిస్తున్న అధర్ సిన్హా తదితరులు



మాజీ సీఎస్ ఎస్పీ సింగ్‌కు వీడ్కోలు పలుకుతున్న జోషి

అధికారం కాంగ్రెస్‌కు పగటి కలే

- రైతులకు కాంగ్రెస్ చేసిందేంది?
- ప్రాజెక్టులను అడ్డుకునే వారిని రైతులే తరిమికొడుతరు
- మా ప్రతి అడుగూ రైతు సంక్షేమానికే
- నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మల్లన్నసాగర్ కుడి కాల్వ పనులకు భూమిపూజ


సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో మల్లన్నసాగర్ కుడికాల్వ పనులు పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతు సంక్షేమం గురించి ఆలోచించలేదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో రైతు కోసం ఒక్క మంచి పనైనా చేశారా? అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. అధికారం కోసం కాంగ్రెస్ పగటి కలలు కంటున్నదని, ఆ పార్టీకి అధికారం కలగానే మిగిలిపోతుందని ఎద్దేవాచేశారు. బుధవారం సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం అక్కారం, కొడకండ్ల వద్ద కాల్వ నిర్మాణ పనులను, దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్, తొగుట మండలంలో మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణ పనులను శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డిలతో కలిసి పరిశీలించారు. దొమ్మాట బంజేరుపల్లి శివారులో కుడికాల్వ పనులకు భూమిపూజ చేశారు. అంతకు ముందు గొడుగుపల్లి, బంజేరుపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ బినామీ పేర్లతో, తప్పుడు సాక్ష్యాలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్ నేతలు కుటిల యత్నాలు చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునే వారిని రైతులే తరిమికొడుతారని హెచ్చరించారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని హరీశ్‌రావు ఉద్ఘాటించారు. అందుకోసం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు తెచ్చేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నామని చెప్పారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్‌తోపాటు కాల్వల పనులు కూడా ప్రారంభమయ్యాయని, భూసేకరణ అడ్డంకులు తొలిగిపోయాయని వివరించారు. జూలైలోగా కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్లు చేరుతాయని చెప్పారు. మల్లన్నసాగర్ కోసం 17వేల ఎకరాలు అవసరం కాగా ఇప్పటికే 16వేల ఎకరాల సేకరణ పూర్తయిందని తెలిపారు. గత వారం రోజులుగా మిగతా రైతులు కూడా తమ భూములను అప్పగించడానికి ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కొండపోచమ్మ సాగర్ పనులతోపాటు అక్కారం పంప్‌హౌస్ పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు రెండు పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి నీళ్లు చేరుతాయని, ఇందులో అక్కారం పంప్‌హౌస్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తొమ్మిది లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకుగాను 8.20లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. కొండపోచమ్మ రిజర్వాయర్‌ను 15టీఎంసీలతో నిర్మిస్తున్నామన్నారు. వీటితో పాటు గంధమల్ల, బస్వాపూర్ కాల్వల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయని, 50 కిలో మీటర్లకుగాను ఇప్పటికే 46 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి జిల్లా ఆలేరు, భువనగిరి, రామన్నపేట కాల్వ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతాంగానికి 24 గంటల కరెంట్ అందిస్తున్న ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని హరీశ్ అన్నారు. పదేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యాసంగి పంటలు చేతికొచ్చేలోపు కరెంట్ సమస్య ఉత్పన్నమై లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేవని గుర్తుచేశారు. దీంతో పంటలు చేతికందాల్సిన సమయంలో ఎండిపోయి, రైతుకు కన్నీళ్లే మిగిలేవని మంత్రి హరీశ్‌రావు చెప్పారు.

ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పరీక్ష ఫలితాలు విడుదల

612 పోస్టులకు 963 మంది అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పలు గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టుల భర్తీ కోసం గత ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి 963 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని టీఎస్‌పీఎస్సీ బుధవారం ప్రకటించింది. మొత్తం 612 పోస్టులకు 1:2 నిష్పత్తి ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులను ఎంపిక చేసినట్టు పేర్కొన్నది. మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో ఫిబ్రవరి ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు ఏ రోజు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలనే విషయాలు తర్వాత వెల్లడిస్తామన్నారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

వక్ఫ్‌బోర్డుపై దానకిశోర్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ఇంచార్జి కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం దానకిశోర్ బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు.

ఫిబ్రవరి 24 నుంచి టీఆర్టీ

19 నుంచి గురుకుల విద్యాలయాల జూనియర్ లెక్చరర్ పోస్టులకు పరీక్షలు

షెడ్యూల్ విడుదలచేసిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 24 నుంచి మార్చి మూడో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. టీఆర్టీకి సంబంధించిన షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ బుధవారం విడుదల చేశారు. అలాగే గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, లైబ్రేరియన్లు, ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షల షెడ్యూల్ కూడా ప్రకటించారు. వీటికి సంబంధించిన పరీక్షలు ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు జరుగనున్నాయి. పేపర్లు, మీడియం వారీగా పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీ ప్రసాద్ వెల్లడించారు.

గురుకుల విద్యాసంస్థల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్ల పోస్టులవారీగా రాత పరీక్షల తేదీలు

పరీక్ష పేరు	పరీక్ష తేదీ	పేపర్
జూనియర్ లెక్చరర్	ఫిబ్రవరి 19	పేపర్ 1- ఉ పేపర్ 2-మ
డిగ్రీ లెక్చరర్స్	ఫిబ్రవరి 20	ఉదయం
లైబ్రేరియన్లు	ఫిబ్రవరి 20	మధ్యాహ్నం
ప్రిన్సిపాల్స్ (గురుకుల స్కూల్స్)	ఫిబ్రవరి 21	పేపర్ 1-ఉ పేపర్ 2-మ
ప్రిన్సిపాల్స్ (గురుకుల జూ.కాలేజీలు)	ఫిబ్రవరి 22	పేపర్ 1-ఉ పేపర్ 2-మ
ఫిజికల్ డైరెక్టర్ (గురుకుల జూ. కాలేజీలు)	ఫిబ్రవరి 23	ఉదయం
ఫిజికల్ డైరెక్టర్స్ (గురుకుల డిగ్రీ కాలేజీలు)	ఫిబ్రవరి 23	మధ్యాహ్నం

టీఆర్టీ పోస్టుల రాత పరీక్షల తేదీల వివరాలు

పరీక్ష పేరు	సబ్జెక్టు	మీడియం	పరీక్ష తేది
భాషాపండితులు	తెలుగు	-	24/2 ఉ
స్కూల్ అసిస్టెంట్	తెలుగు	-	24/2 మ
సెకండరీ గ్రేడ్ టీచర్	-	తె.మీ	25/2 ఉ
సెకండరీ గ్రేడ్ టీచర్	-	ఇ.మీ	25/2మ
స్కూల్ అసిస్టెంట్	ఇంగ్లీష్	-	26/2 ఉ
స్కూల్ అసిస్టెంట్	గణితం	ఇ.మీ	26/2మ
స్కూల్ అసిస్టెంట్	సోషల్ స్టడీస్	ఇ.మీ	26/2 మ
స్కూల్ అసిస్టెంట్	ఫిజికల్ సైన్స్	తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, తమిళం	27/2 ఉ
భాషా పండితులు	ఉర్దూ, హిందీ, మరాఠీ	-	27/2 మ
పీఈటీ	-	తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ, హిందీ	28/2 ఉ
స్కూల్ అసిస్టెంట్	హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ	-	28/2 మ
సెకండరీగ్రేడ్ టీచర్	-	బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళం	02/3 ఉ
ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	-	తెలుగు	02/3 మ
స్కూల్ అసిస్టెంట్	బయాలజీ	ఉర్దూ, మరాఠీ, కన్నడ	03/3 ఉ.
స్కూల్ అసిస్టెంట్	గణితం	ఉర్దూ, కన్నడ, మరాఠీ, హిందీ, తమిళం	03/3 ఉ
స్కూల్ అసిస్టెంట్	సోషల్ స్టడీస్	మరాఠీ, ఉర్దూ, హిందీ, తమిళం	03/3 ఉ
స్కూల్ అసిస్టెంట్	ఫిజికల్‌సైన్స్	ఇ.మీ	03/3 మ
స్కూల్ అసిస్టెంట్	బయాలజీ, గణితం, సోషల్	తె.మీ	04/3 ఉ
పీఈటీ	-	ఇ.మీ	04/3 మ



ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో జరిగిన హింస దురదృష్టకరం. అక్కడ శాంతి నెలకొనాలని ఆశిస్తున్నా. నేను బీజేపీ మాదిరిగా కాదు, దేనినైనా విమర్శిస్తా. అక్కడి వివరాలు పూర్తిగా తెలువదు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుందని ఆశిస్తున్నా.

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

రాజ్యాంగం ఏ ప్రభుత్వానికి అయినా నిర్దిష్ట కాలపరిమితిని సూచించలేదు. రాజ్యాంగాన్ని మారిస్తే తప్పా జమిలి ఎన్నికలు సాధ్యం కాదు. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతే నాలుగేండ్ల పాటు కేంద్ర పాలన సాగిస్తారా? అది సాధ్యం కాదు.

పి.చిదంబరం, కేంద్రమాజీ ఆర్థిక మంత్రి



చరిత్రలో నేడు



1840

అమెరికాలో బాల్టీమోర్ డెంటల్ సర్జరీ కాలేజీ ప్రారంభం.

1884

ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ వాల్యూమ్-I ప్రచురణ.





1972

మొదటిసారి సైంటిఫిక్ క్యాలిక్‌లేటర్ తయారీ.

2017-18 ఆర్థిక సర్వే వివరాలు దేశవ్యాప్తంగా అన్నివర్గాల్లో చర్చనీయాంశమవుతున్నది. ముఖ్యంగా ఆర్థికవేత్తలు, మేధావులు సర్వేలో చెప్పిన గణాంకాల పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికార ఆర్థికవేత్తలకు మాత్రం అది పెద్ద మేత అయ్యింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ దేశ ప్రజలపై సర్జికల్ దాడులుగా అతలాకుతలం చేశాయి. ఇప్పటికీ ఆ దాడుల నుంచి ప్రజలు తేరుకోలేదు.ఈ పరిస్థితుల్లో ఆర్థిక సర్వే భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా, వృద్ధి దశలో ఉన్నదని చెప్పిన మాటలు సమ్మశక్యంగా లేవు.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

అఫ్ఘానిస్థాన్ టెర్రరిస్టు దాడులతో తల్లడిల్లుతున్నది. ఈ వారం, పది రోజుల్లోనే నాలుగు బాంబుదాడులు జరిగాయి. 158 మంది అమాయకులు చనిపోయారు. ఇప్పటికైనా అఫ్ఘాన్‌లో శాంతిస్థాపనకు తీసుకోవాల్సిన చర్యలపై అఫ్ఘాన్ ప్రభుత్వం దాని సమర్థకులు తగిన చర్యలు తీసుకోవాలి. ఐఎస్‌ను అంతం చేశామని జబ్బలు చరుస్తున్న అగ్రరాజ్యాలు జరుగుతున్న పరిణామాలకు జవాబులు వెతుకాలి. అంతర్జాతీయంగా ఐఎస్ దాడుల ప్రమాదాన్ని నివారించేందుకు రాజకీయ పరిష్కారాలను వెతుకాలి.

ది హిందూ

నాగా వివాదం

ఈశాన్య ప్రాంతంలో మళ్ళా నాగాలాండ్ వివాదం ముందుకురావడం ఆందోళన కలిగిస్తున్నది. నాగాలాండ్‌లోని పదకొండు పార్టీలు ఏకతాటిపైకి వచ్చి ఫిబ్రవరిలో జరిగే శాసనసభా ఎన్నికలలో తమ అభ్యర్థులను నిలబెట్టకూడదని నిర్ణయించాయి. ఈ నిర్ణయానికి వచ్చిన పదకొండు పార్టీల నాయకులలో స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నేతలు కూడా ఉన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తమ పార్టీకి చెందిన ఇద్దరు స్థానిక నాయకులను బీజేపీ కేంద్ర నాయకత్వం సస్పెండ్ చేయక తప్పలేదు. అయినప్పటికీ బీజేపీ స్థానిక నాయకులు ఇందుకు భిన్నమైన వైఖరి ప్రదర్శించే సూచనలు లేవు. ఇంతకు మించి రాష్ట్రంలో అధికార కూటమి డెమొక్రాటిక్ అలయెన్స్ ఆఫ్ నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, బీజేపీ భాగస్వామ్యపక్షాలుగా ఉన్నాయి. ఎన్నికల బహిష్కరణ నిర్ణయం తీసుకున్న కోర్ గ్రూప్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్‌ది కీలక పాత్ర. మార్చి 12వ తేదీతో నాగాలాండ్ శాసనసభ గడువు ముగుస్తున్నది. దీంతో ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు జరుగవలసి ఉన్నది. నాగాలాండ్‌లో ఎన్నికలు జరిపి తీరుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరెన్ రిజిజు ప్రకటించడంతో నాగా సంఘాలు ఫిబ్రవరి ఒకటవ తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చాయి. 'పరిష్కారం లేకపోతే ఎన్నికలు లేవు' (నో ఎలక్షన్ విథౌట్ సొల్యూషన్) నినాదంతో నాగాలాండ్ ఉద్రిక్తంగా మారింది. అనూహ్యరీతిలో నాగా సంఘాలన్నీ సంఘటితమై ఉద్యమానికి కేంద్రంపై ఒత్తిడి తేవడానికి సిద్ధపడ్డాయి. మరోవైపు బీజేపీ కేంద్ర నాయకత్వ ప్రతినిధులు మిత్రపక్షమైన నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్‌తో సీట్ల సర్దుబాటు చర్చలు రహస్యంగా సాగిస్తున్నారనే వార్తలు వెలువడ్డాయి. దీంతో బీజేపీ అనుసరిస్తున్న వైఖరిపై అయోమయం ఏర్పడ్డది.

నాగాలాండ్ గిరిజన తెగలలో, సాయుధ గ్రూపులలో, రాజకీయపార్టీలలో ఏనాడూ లేనంత ఐక్యత కనబడుతున్నది. నాగాలాండ్ సమస్యకు పరిష్కారం సాధించే సమయం వచ్చిందనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతున్నది. ఈ రాజకీయపక్షాలేవీ ఎన్నికలను వ్యతిరేకించడం లేదు. కాకపోతే నాగాలాండ్ సమస్య ఎట్లాగూ పరిష్కారానికి దగ్గరలో ఉన్నది కనుక, ఎన్నికలు వాయిదా వేసి, చర్చలు సాగించి, శాశ్వత పరిష్కారం సాధించాలనే పట్టుదల వారిలో కనిపిస్తున్నది. నాగా గ్రూపులలో సమస్య పరిష్కారం అవుతుందనే దృఢమైన విశ్వాసం కలుగడానికి కారణం కేంద్రం గతంలో కుదుర్చుకున్న ఒప్పందమే. ఆ ఒప్పందం ఏమిటనేదే అంతుచిక్కని రహస్యం! 2015 ఆగస్టు మూడవ తేదీన భారత ప్రభుత్వానికి, నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్-ఐజాక్ ముయివా వర్గం (ఎన్ఎస్‌సీఎన్-ఐఎం) నేతృత్వంలోని సాయుధ బృందాలకు మధ్య నాగా శాంతి ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్) కుదిరింది. ఇది 'సమస్యకు ముగింపు మాత్రమే కాదు, నూతన భవిష్యత్తుకు ఆరంభం' అని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. కానీ రెండు పక్షాలకు మధ్య కుదిరినది పూర్తిస్థాయి ఒప్పందం కాదు. ఒప్పందానికి ప్రాతిపదిక మాత్రమే. అయితే ఈ రెండు పక్షాలకు మధ్య కుదిరిన స్థూల అవగాహన ఏమిటి? అందులో ఏమైనా వివాదాస్పద అంశాలు ఉన్నాయా అనేది ఇప్పటివరకు బయటకు తెలువదు. కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదు. సుదీర్ఘకాలంగా నానుతున్న సమస్య కనుక, దీని పరిష్కారం కోసం తాత్కాలికంగా గోప్యత పాటించడంలో తప్పేమిటనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ కారణంగానే సమాచార కమిషన్ కూడా ఈ గోప్యతను సమర్థించింది. కానీ ఈ అవగాహనను అమలు చేయడం సాధ్యమా? అమలుచేసే క్రమంలో కొత్త సమస్యలు తలెత్తుతాయా? ఇందులోని అంశాలే సమస్య మళ్ళా తెరపైకి రావడానికి కారణమా అనే సందేహాలు తలెత్తున్నాయి.

నాగా పోరాట సంస్థలు పొరుగు రాష్ట్రాల్లోని నాగాలు ప్రబలంగా ఉండే ప్రాంతాలను నాగాలాండ్‌తో కలుపాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రంతో కుదిరిన రహస్య అవగాహనలో ఈ అంశం ఉన్న దా అనే ఆందోళన మణిపూర్, అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో వ్యక్తమవుతున్నది. నాగాలాండ్ ఉద్రిక్తమయ్యే కొద్దీ పొరుగున ఉన్న మణిపూర్, అసోం ప్రాంతాల్లో తీవ్ర అలజడి చెలరేగుతున్నది. బీజేపీ ప్రయోజనాల సంగతి ఎట్లా ఉన్నా, నాగాలాండ్‌తో పాటు పొరుగు రాష్ట్రాలలోని ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా సమస్యను పరిష్కరించవలసిన బాధ్యత కేంద్రంపై ఉన్నది.

కేంద్ర ప్రభుత్వంతో నాగా సంస్థలు కుదుర్చుకున్న అవగాహన అంశాలు మీడియాలో బయటకు వచ్చినప్పటికీ వాటిని ధ్రువీకరించడం సాధ్యం కాదు. 2018 జనవరి 31లోగా నాగా సమస్య పరిష్కరిస్తామని కేంద్రం ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్‌లో హామీ ఇచ్చిందని, ఇందులో విఫలమైనందు వల్లనే నాగా సంస్థలు తక్షణ ఒప్పందానికి పట్టుబడుతున్నాయని ఒక వాదన వినబడుతున్నది. గతంలో కాంగ్రెస్ మోసం చేసిందనీ, ఇప్పుడు బీజేపీ కూడా అదేవిధంగా వ్యవహరిస్తుందనే భయం నాగా గ్రూపుల్లో, అధికార పార్టీలో ఉన్నది. కేంద్రం సుముఖంగా ఉన్నదనీ, తాము గట్టిగా ఒత్తిడి చేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే భావన కూడా బలంగా ఉన్నది. నాగా పోరాట సంస్థలు పొరుగు రాష్ట్రాల్లోని నాగాలు ప్రబలంగా ఉండే ప్రాంతాల ను నాగాలాండ్‌తో కలుపాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రంతో కుదిరిన రహస్య అవగాహనలో ఈ అంశం ఉన్నదా అనే ఆందోళన మణిపూర్, అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో వ్యక్తమవుతున్నది. నాగాలాండ్ ఉద్రిక్తమయ్యే కొద్దీ పొరుగున ఉన్న మణిపూర్, అసోం ప్రాంతాల్లో తీవ్ర అలజడి చెలరేగుతున్నది. బీజేపీ ప్రయోజనాల సంగతి ఎట్లా ఉన్నా, నాగాలాండ్‌తో పాటు పొరుగు రాష్ట్రాలలోని ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా సమస్యను పరిష్కరించవలసిన బాధ్యత కేంద్రంపై ఉన్నది.

జనగళం

సమ్మక్క-సారక్క

సీ|| సమ్మక్క సారక్క సమరాంగణపు కోట
బడుగుజీవులు కొల్చు భద్రకాళి
కోరినవారికి కొంగు బంగారమై
గుండెలోదాచిన గూడెపమ్మ
కాకతీయుల తోడ కయ్యానికేతించి
కళ్ళెర్ర జేసిన కాళికాంబ
ఆదివాసులకెల్ల యన్నపూర్ణాంబయై
యాదుకోవచ్చిన నాదిలక్ష్మి
ఆ|| పట్ట మహిషియగును పగిడిద్ద ప్రభుకు సా
రక్క మేడరాజు ననుగుబిడ్డ
తనదు ప్రజలకై ప్రతాపరుద్రునెదిర్చి
వీర మరణమందె పోరులోన

సీ|| కుంకుమ భరణియై గూర్చుండె సమ్మక్క
కోయదొరలబిడ్డ గోరివచ్చి
చిలుకల గుట్టపై చీమల పుట్టలో
సేదతీరుచునుండె సెలవు కోరి
రెండేండ్ల కొకమారు రేరాజులావచ్చి
గద్దెపై కూర్చొని గాంచు ప్రజల
నిలువెత్తు బంగారు నిలువునర్పణచూసి
తీరొక్కమొక్కులు తీర్చుతల్లి
ఆ|| అమ్మయన్నవారి నవసరాలనుతీర్చి
ఆదుకొనగవచ్చినాదిశక్తి
కన్యపల్లి నుండి కదలివచ్చిన తల్లి
కంటిపాపవలెను గాచుచుండె.

- డాక్టర్ గుడేలి శీను
9959954848

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

జర్నలిజం 'బాహుబలి' ఎపుడు?

జర్నలిజం చేస్తున్న మంచి చాలానే ఉంది. అదే సమయంలో చెడు కూడా చేస్తున్నది. ఆ చెడు కింద మంచి కన్పించకుండాపోతున్నది. ఈ క్రమంలో, జర్నలిజం చెడుగా ఉందన్న స్థూలాభిప్రాయమే జర్నలిస్టులతో సహా అన్నివర్గాలకు ఏర్పడింది. జర్నలిజం బాగుపడితే ఆహ్వానించేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. కాని వర్తమానపు అరేంజ్‌మెంట్లలో మాత్రం అట్లా బాగుపడే అవకాశం లేదు. ఏదైనా కొత్త శక్తి యువతరం నుంచి 'బాహుబలి' వలె ఆవిర్భవించి కొత్త జర్నలిజానికి నాంది పలుకగలదా?

పైన అనుకున్నట్లు, జర్నలిజం చెడుగా ఉంటూ కూడా చేస్తున్న మంచి తగినంత ఉంది. పత్రికలు ప్రజల వద్దకు తీసుకుపోతున్న సమాచారాలు, కథనాలు, ఫీచర్లు, విశ్లేషణల వల్ల వారికి విషయాలు తెలియటం, ఆలోచనలతో చైతన్యాలు ఏర్పడటం గణనీయంగా జరుగుతున్నది. ఇదంతా వారికి సాధికారతను కల్పిస్తున్నది. ఇది ఒక వస్తువును మూటగట్టినట్లు కళ్లకు కన్పించేది కాదు. అది స్థూలంగా కాకా సూక్ష్మంగా వ్యక్తిగత స్థాయిలో, సమాజ స్థాయిలో పరుచుకునిపోయి ఉంటుంది. మనకు అర్థమవుతూనో కాకుండానో తన పాత్రను మౌనంగా పోషిస్తూ మేలు చేస్తుంటుంది. ఇది అధ్యయనాలకు అందనిది కాదు. కాని అటువంటి అధ్యయనాలు దురదృష్టవశాత్తు తెలుగు జర్నలిజంపై నామమాత్రంగానైనా లేవు.

పరిస్థితి ఒకవైపు ఈ విధంగా ఉండగా, తిరిగిపైన అనుకున్నట్లు, జర్నలిజం చెడుగానూ ఉంది. అది చేస్తున్న చెడు కూడా ఉంది. ఏ విధంగానో ప్రతి ఒక్క వర్గం వారూ చెప్తున్నారు. ఆ మాటలు కోకొల్లలుగా అంతులేకుండా వినవస్తున్నాయి. స్వయంగా జర్నలిస్టులకు సంబంధించి, వారు ప్రజలకు అందించే జర్నలిజం గురించి, పత్రికలను నడిపే యాజమాన్యాల గురించి, విధానాల గురించి, వెనుక గల శక్తుల గురించిన మాటలు ఈ రోజున గ్రామీణులు కూడా మాట్లాడుతున్నారు. ఇది కూడా ఆయా వర్గాలకు ఇతరత్రా కలుగుతున్న చైతన్యంతో పాటు, మీడియా ద్వారా లభిస్తున్న చైతన్యంతోనూ జరుగుతున్నది. ఆ చెడు ఏమిటో నిర్దిష్టంగా, వివరంగా చెప్పుకునేందుకు ఇక్కడ చోటుచాలదు. అదెట్లు న్నా, అవి అందరూ ప్రస్తావిస్తున్నవే అయినందున ఇక్కడ తిరిగి చెప్పుకోవలసిన అవసరం లేదు.

కాని ఒకటి మాట్లాడుకోవాలి. జర్నలిజం చెడుగా ఉందనే అభిప్రాయం స్వయంగా జర్నలిస్టులలోనూ ఉందని పైన చెప్పుకున్నాము. ఎవరైనా తమ లోపాలను తాము మరీ బాహాటంగా అంగీకరించరు గనుక, ఈ మాటను జర్నలిస్టులు అర్థోక్తులతో చెప్తారు. ఒకోసారి అందుకు మరేవో కారణాలు వెతుకుతారు లేదా యాజమాన్యాలపై తోస్తారు. ఇందులో నిజమేమీ లేదని కాదు. తప్పకుండా ఉంది. కాని అదే సమయంలో జర్నలిస్టులు జర్నలిజం బాగుపడేందుకు తమవైపు నుంచి చేయగలిగి కూడా చేయనివీ ఉన్నాయి. తాము చేయలేనివి అయితే ఇందుకు వారిని నిందించలేము. కాని చేయగలినవి కూడా చేయనపుడు, ఆ దిశలో ఆలోచించి ప్రయత్నించనపుడు, ఇతర కారణాలను, యాజమాన్యాలను వేలెత్తిచూపటం తమ లోపాలను కప్పిపుచ్చుకోవటం కోసమే అవుతుంది. జర్నలిజాన్ని బాగు చేసుకునే కృషి ద్విముఖంగా సాగాలి. ఒకవైపు తమ లోపాలను తొలిగించుకుంటూ మరొకవైపు ఆ చెడుకు కారణమవుతున్న బయటి పరిస్థితులను నిలువరించేందుకు ప్రయత్నించటం. అది జరిగితే జర్నలిజం ఇపుడున్న స్థితినుంచి మరింత పతనం కాకుండా ఉండటం, క్రమంగా బాగుపడటం సాధ్యమవుతుంది. కాని తెలుగు జర్నలిస్టులకు తమ వృత్తిరంగం ఈ విధంగా ఉండటం పట్ల విచారం, అది బాగుపడాలనే కోరిక అయితే ఉన్నాయి గాని, అందుకు కావలసిన సమగ్ర వ్యూహం, ఆచరణ లేవు. అవి గనుక ఏర్పడినట్లయితే వారు ఆ దిశలో పట్టుదలగా ప్రయత్నిస్తూ పోతారు తప్ప, ఆ చెడుకు ఇతర కారణాలను వెతకటం, కొంత యాజమాన్యాలపై తోయటం, మొత్తమ్మీద చేయగలిగింది కూడా చేయక నిస్సహాయతను ప్రకటించటం, ఒక్కోసారి ఆ నిస్సహాయ స్థితిని ఒక సాకుగా మార్చుకొని దాని వెనుక తమ చెడును తాము కొనసాగించటం వంటివి ఆగిపోతాయి. తమ వ్యూహం ప్రకారం తాము జర్నలిజాన్ని బాగు చేసుకోవటంపై దృష్టిని పెడుతారు.

ముఖ్యంగా యువతరం జర్నలిస్టులలో తమ వృత్తి బాగుపడాలని కోరుకుంటున్నవారు తగినంత మంది ఉన్నారు. ఇందులోని చెడు పోవాలని సమాజంలోని వివిధ వర్గాలు ఏ విధంగా ఆశిస్తున్నాయో వీరు కూడా అదే ఆలోచనలో ఉన్నారు. అందుకు కారణాలున్నాయి. యువకులైనందున ఆదర్శాలున్నాయి. జర్నలిజం రంగం గురించి ప్రత్యేకమైన అభిప్రాయాలున్నాయి. వారిలో అత్యధికులకు గల సామాజిక నేపథ్యాలు, అనుభవాలు తెలంగాణ పరిస్థితులను ప్రతిబింబింపజేస్తుంటాయి. కొందరి ఆలోచనలు స్పష్టంగా, కొందరివి అస్పష్టంగా కనిపిస్తాయి. అందరికందరూ ఈ విధంగా ఉన్నారని కాదు. కాని తగినంత మంది అని మొదటనే చెప్పుకున్నాము. వీరు వృత్తిలో ప్రవేశించిన ఒక దశ తర్వాత,

యువతరం జర్నలిస్టులలో తమ వృత్తి బాగుపడాలని కోరుకుంటున్నవారు తగినంత మంది ఉన్నారు. ఇందులోని చెడు పోవాలని సమాజంలోని వివిధ వర్గాలు ఏ విధంగా ఆశిస్తున్నాయో వీరు కూడా అదే ఆలోచనలో ఉన్నారు. అందుకు కారణాలున్నాయి. యువకులైనందున ఆదర్శాలున్నాయి. జర్నలిజం రంగం గురించి ప్రత్యేకమైన అభిప్రాయాలున్నాయి. వారిలో అత్యధికులకు గల సామాజిక నేపథ్యాలు, అనుభవాలు తెలంగాణ పరిస్థితులను ప్రతిబింబింపజేస్తుంటాయి.

పరిస్థితుల వలయంలో చిక్కుకొనిపోయి, నిస్సహాయులుగా మారుతున్నారు. ఇతరుల వలెనే తయారవుతున్నారు. ఇక ఈ కొద్దిపాటి స్పృహ అయినా లేనివారు, ఒకవేళ తగిన మార్గదర్శకత, ఆలంబన ఉన్న పక్షంలో మంచి జర్నలిజపు పరిధిలోకి ప్రవేశించగలరు, అందరూ కాకున్నా తగినంతమంది. కాని ప్రస్తుతం ఈ రెండురకాల యువ జర్నలిస్టులు కూడా పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఎక్కువకాలం గడువకుండానే చెడు జర్నలిజపు రొటీన్లో చిక్కుకుపోతున్నారు. ఇక్కడ మరొక మాట కూడా చెప్పుకోవాలి. జర్నలిజపు పరిస్థితులలోని చెడుకు గల ప్రాబల్యం ఎట్లా ఉందంటే, అది ముందుగానే తెలిసి అదే ఒక ఆకర్షణగా మారి ఈ వృత్తిలోకి వస్తున్నవారు తక్కువ కాదు. పత్రికలో జీతమివ్వకున్నా పరవాలేదు ఐడెంటిటీ కార్డు ఇస్తే చాలనే ధోరణి ఇందుకు ఒక రుజువు.

ఇవన్నీ ఇట్లా ఉండి కూడా తెలంగాణలో గల వేలాది మంది జర్నలిస్టులను గమనించినపుడు, ఇప్పటికే ఉద్యోగాలలో స్థిరపడిపోయిన వారిలో, అంతకన్న ఎక్కువ సంఖ్యలో కొత్తతరం వారిలో, జర్నలిజం బాగుపడాలని కోరుకుంటున్నవారు చాలామందే ఉన్నారు. బాగుపడటమనేది అన్నివిధాలుగా కూడా. ఒక వాక్యంలో చెప్పాలంటే, జర్నలిజం వృత్తి తీరు ఏదని ఆ వృత్తి నియమాలు చెప్తున్నాయో వాటిని అనుసరించటం, ప్రస్తుతం ఏయే లోపాలు ఉన్నాయని వివిధ వర్గాల ప్రజలు భావిస్తున్నారో వాటిని పోగొట్టుకోవటం, స్వయంగా తాము తమ మనస్సులలో ఏ లోపాలను గుర్తిస్తున్నారో వాటికి దూరం కావటం, మంచి జర్నలిజం కోసం ఏమేమి జరుగాలని తామంతా భావిస్తున్నారో అందుకు ప్రయత్నించటం అన్నమాట. ఇదంతా అసాధ్యంగా తోస్తున్నదా? ఎంత మాత్రం కానక్కరలేదు. మనిషి ఇంతకన్న పెద్ద పర్వతాలను మోసాడు.

ఈ చర్చలో చివరగా మిగిలిన ప్రశ్నలు రెండున్నాయి. మంచి జర్నలిజాన్ని కోరే జర్నలిస్టులు ఇప్పుడున్న పరిస్థితులలోనూ ఏమి చేయగలరన్నది మొదటిది. అటువంటి సాధ్యాసాధ్యాలు ఎట్లున్నా కొత్తతరం వారు 'బాహుబలి' వలె ఒక కొత్త జర్నలిజాన్ని ఏ విధంగా ఆవిష్కరించగలరన్నది రెండవది. మొదటి ప్రశ్నను ముందుగా చూస్తే, ప్రస్తుతం ఉన్న జర్నలిజం తీరుతెన్నులు, తమ సొంత లోపాలు, యాజమాన్యాలు విధించే పరిమితులు, ఇతరత్రా ఈ రంగాన్ని ప్రభావితం చేస్తున్న శక్తుల మధ్య పూర్తిగా చేతులెత్తేసి ఊరుకోవటం, రాజీ పడిపోవటం గాక, వాటిని వీలైనంత మేర మార్చగల పద్ధతులు లేనే లేవా? వాటిని కనుగొని ఆ ప్రకారం ప్రయత్నించే శక్తియుక్తులు జర్నలిస్టులకు లేవనగలమా? ఎంత మాత్రం కాదు. పద్ధతులున్నాయి, శక్తియుక్తులున్నాయి. మైదానాన్ని పూర్తిగా చెడు జర్నలిజానికి వదలివేయవలసిన అగత్యం ఏమీ లేదు. కావలసింది అవసరమైన ఆలోచనలు, ఆచరణలు. అవి వారి ఉమ్మడి ఆలోచనాశక్తికి అందగలవే.

పైన అన్నట్లు, ఒకవైపు ఇది జరుగుతూనే మరొకస్థాయిలో జర్నలిజపు బాహుబలి శక్తి అవతరణకు యువశక్తులు ప్రయత్నించాలి. వారికి ఉండగల అతిపెద్ద బలం సమాజంలోని అన్నివర్గాలు మంచి జర్నలిజాన్ని బలంగా కోరుకుంటుండటం. ఇపుడున్న జర్నలిజపు తీరుతెన్నుల పట్ల వారికి ఎప్పటినుంచో సదభిప్రాయం లేకపోవటం. మొదట చెప్పుకున్నట్లు, జర్నలిజం వల్ల ఈ వర్గాలకు కలుగుతున్న మేలు చాలానే ఉంది. అదే మేలును మరింత ముందుకుతేవటం, విస్తరింపజేయటం, ఆ క్రమంలో చెడు జర్నలిజాన్ని వెనుకకు నెట్టటం, స్వయంగా తమతో పాటు సమాజం కోరుకుంటున్న విధంగా మార్పును తెచ్చేందుకు ఆ ప్రజల సహకారంతో కొత్త ఆవిష్కరణలు చేయటమే బాహుబలి అన్న మాటకు అర్థం. అది వ్యక్తులు గాక సమూహాలుగా చేయవలసిన పని.

జనజాతరకు జాతీయహోదా ఇవ్వాలె

సందర్భం



ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్

నాచిన్నతనం నుంచి మేడారం జాతరకు వెళుతున్నాను. కాకతీయ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా భక్తులకు విద్యార్థులతో కలిసి సేవలందించాను. ప్రస్తుతం ఈ ప్రాంత లోక్‌సభ సభ్యునిగా నావంతు సహాయ సహకారాలు అందిస్తూ సీఎం కేసీఆర్ చొరవతో ఈ రాష్ట్రీయ పండుగను జాతీయ పండుగ చేయాలనేది నా ఆకాంక్ష. రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, పండుగలకు సీఎం పెద్దపీట వేస్తున్నారు. మేడారం జాత రకు రూ.300 కోట్లు వెచ్చించి భక్తులకు అన్నివసతులు కల్పిస్తూ దేశ నలుమూలలా జాతర గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ములుగు నియోజకవర్గం మేడారంలో నాలుగు రోజులు జరుపుకొనే ఈ ఆదివాసీ పండుగను ఈ ఉత్తర భారతంలోని వనజ్ జాతీయ పండుగ వలె గుర్తించాలని కోరుతున్నాం.

కరువు పీడీత ప్రజల నుంచి కప్పం వసూలుచేయడాన్ని, సమ్మక్క, సారలమ్మలు వ్యతిరేకించి, కాకతీయ సామ్రాజ్య పాలకులకు ఎదురు తిరిగి, ధిక్కార స్వరాన్ని వినిపించారు. తమ శౌర్య పరాక్రమాలు, పౌరుషాన్ని, ధీరత్వాన్ని ప్రదర్శించి వీర మరణం పొందారని చరిత్ర చెబుతున్నది. నాటినుంచి నేటికీ ప్రతి రెండేండ్లకోసారి గిరిజనుల ఇలవేల్పులైన సమ్మక్క సారలమ్మలకు మాఘశుద్ధ పౌర్ణమి రోజు ఈ జాతరను జరుపుతున్నారు. వరంగల్ కేంద్రానికి 110 కి.మీ. దూరంలో గల మేడారం గూడెంలో నాలుగు రోజులు వైభవంగా జరిగే పండుగే సమ్మక్క సారలమ్మ జాతర. ఈ జాతరను గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు, వీరత్వానికి, కట్టుబాట్లకు, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు. వీరవనితలై నిలిచిన సమ్మక్క సారలమ్మలను గిరిజనులు తమ మదిలో సజీవంగా నిలుపుకొని స్మరించుకుంటున్నారు.

దేశ నలుమూలల నుంచి ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి కోటికిపైగా భక్తులు ఈ జాతరకు వస్తారు. వన దేవతలు ఇష్టపడే కంక వనముల మధ్య నుంచి ప్రవహించే జంపన్న వాగు, కీకారణ్యం ప్రకృతికి నిలయం, పర్యావరణానికి చిహ్నం. తల్లీబిడ్డలుగా ఖ్యాతిచెందిన ఈ దేవతలు కేవలం గిరిజన తెగల్లోని కొన్ని గోత్రాలకు చెందిన కోయవారిచే సంప్రదాయాలకు అనుగుణంగా పూజించబడుతున్నారు. జాతర సమయంలో గద్దె నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోగల కన్నెపల్లి గ్రామం నుంచి సారలమ్మను వైభవంగా గద్దెకు చేర్చుతారు. గద్దె నుంచి కిలోమీటర్ దూరంలో గల చిలుకలగుట్ట నుంచి సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో గౌరవసూచకంగా పోలీసు అధికారులు గాల్లోకి కాల్పులు జరిపి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క దేవతను జన సముద్రం మధ్య నుంచి వైభవంగా గద్దెకు చేరుస్తారు. గోవిందరాజు, పగిడిద్ద రాజుల ను కొత్తగూడ మండలం పునుగొండ నుంచి గద్దెలకు తీసుకొస్తారు.

వన దేవతలైన సమ్మక్క సారలమ్మలకు విగ్రహాలు కాని, నడి గోపురాలు కాని, పూజలో వేదమంత్రాలు, ధూప, దీప నైవేద్యాలు, అర్చనలు చేసే అయ్యగార్లు అగుపించరు. పూజారులు స్త్రీ పురుషులుండటం పూర్వ సంస్కృతికి తార్కాణం. పూజలో కేవలం వన మూలికలు, బెల్లం పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బియ్యం ఉండటం విశేషం. గిరిజనులు ప్రకృతి ఉత్పత్తులను పూజిస్తారనడానికి ఇది నిదర్శనం. ఆదిమ జాతుల ఆత్మగౌరవ పండుగగా దక్షిణ భారతదేశంలో గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. గద్దెకు చేరిన దేవతలకు భక్తులు కానుకలను సమర్పిస్తారు. తాము సమర్పించే బెల్లాన్ని బంగారంతో సమానమైన విలువగలదిగా భావించి తమ ఎత్తు (బరువు) బెల్లాన్ని (బంగారాన్ని) దేవతలకు కానుకలుగా సమర్పిస్తారు. కొత్త పసుపురంగు గుడ్డలో కంకబియ్యం, రెండు కొబ్బరి కుడుకలు, రెండు రవిక ముక్కలు, రెండు వక్కలు, ఖర్జూరాలు వేసి భక్తులు నడుముకు కట్టుకుంటారు. అందులో నుంచి రెండు రవిక ముక్కలు కొద్దిబియ్యం సమర్పించి మిగిలినవి తమతో తీసుకువెళ్తూ, స్వయంగా దేవత సమ్మక్కే తమ ఇంటికి వచ్చినట్టుగా నమ్ముతారు. శనివారం దేవతలు తిరిగి వనప్రవేశం చేయడంతో ఈ జాతర ముగిసినట్టు ప్రకటిస్తారు.

మేడారం జాతరపై అనేక కథనాలున్నాయి. కాని ఆదివాసీ గిరిజన పూజారుల మౌఖికాధారాల ప్రకారం అధిక ప్రాచుర్యంలో ఉన్న కథ. క్రీ.శ.1083 నుంచి 1323 వరకు ఓరుగల్లు కేంద్రంగా కాకతీయులు పాలించినట్టు చరిత్ర చెబుతుంది. ఆ కాలంలో మేడారం ప్రాంతాన్ని పగిడిద్దరాజు పాలించేవారు. ఇతను కరీంనగరాన్ని పాలించిన మేడరాజుకు మేనల్లుడు. కోట్లాది ప్రజలచే పూజింపబడుతున్న సమ్మక్క సారలమ్మ దేవతకు చరిత్ర లేకపోలేదు. మేడారం గూడెంకు చెం దిన కోయలు ఆ ప్రాంతంలో గోదావరి తీరాన వేటకు వెళ్లినప్పుడు ఓ పసి పాప కోయదొరల కంటపడింది. పాపను తమ వెంట తెచ్చుకొని మార్గశిర పౌర్ణమినాడు సమ్మక్కగా నామకరణం చేశారు, పాప పెరిగిన కొద్ది ఆ గూడెంలో శుభ పరిణామాలతోపాటు కోరిన కోర్కెలు తీరడంతో ఆమెను దేవతగా పూజించారు. యుక్తవయస్సు రాగానే మేడారం ప్రాంతాన్ని పాలిస్తున్న పగిడిద్దరాజుతో వివాహం జరిగింది. ఈ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు జన్మించారు. కాక తీయ సామ్రాజ్యంలో తీవ్ర మైన కరువు ఏర్పడింది. అయి నా కప్పం కట్టవలసిందిగా చక్రవర్తి ప్రతాపరుద్రుడు, పగిడిద్ద రాజును ఆజ్ఞాపించాడు. కప్పం కట్టడానికి పగిడిద్దరాజు నిరాకరించడంతో కోపో ద్రిక్తుడైన ప్రతాపరుద్రుని మంత్రి నేతృత్వంలో పగిడిద్దరాజుపై యుద్ధం ప్రకటించారు. అది గమనించిన పగిడిద్దరాజు, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు, జంపన్నలతో కలిసి కాకతీయుల సైన్యాన్ని మేడారం సరిహద్దులోని సంపెంగవాగు వద్ద నిలువరించి, విరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. మరణవార్త తెలిసిన సమ్మక్క సారలమ్మలు యుద్ధ రంగంలో దిగి కాకతీయుల సైన్యాన్ని ఊచకోత కోశారు. ఓటమి తప్పదని భావించిన ఒక సైనికుడు దొంగచాటున సమ్మక్కను వెనుక నుంచి బల్లెం తో పొడువగా, ఆమె యుద్ధభూమి నుంచి వైదొలిగి చిలుకల గుట్ట వైపు వెళ్లింది. అది గమనించిన కోయలు కొంతదూరం సమ్మక్కను అనుసరించగా మలుపుతిరిగి అదృశ్యమైనట్టు కథ చెబుతుంది.

సమ్మక్క రాక కోసం నిద్రాహారాలు మాని, చూస్తూ వెతుకుతున్న తరుణంలో ఒక నమిలినార చెట్టు కిందపుట్ట దగ్గర ఒక కుంకుమ భరిణె దొరికింది. ఆ సందర్భంలో ఆకాశవాణి నుంచి.. నేను మీకు అండగా, రక్షణగా ఉంటానని వినిపించిట్టుగా ఆదివాసులు చెప్పుకుంటారు. ఆ కుంకుమ భరిణెనే సమ్మక్కగా పూజిస్తున్నారు. ఇదే యుద్ధంలో సారలమ్మ కూడా వీర మరణం పొందింది. అప్పటినుంచి నేటిదాకా ఆదివాసులు సమ్మక్క, సారలమ్మలను వీర వనితలుగా కొలుస్తూ పూజించే పండుగే మేడారం జాతర.

సమ్మక్క రాక కోసం నిద్రాహారాలు మాని, చూస్తూ వెతుకుతున్న తరుణంలో ఒక నమిలినార చెట్టు కింద పుట్ట దగ్గర ఒక కుంకుమ భరిణె దొరికింది. ఆ సందర్భంలో ఆకాశవాణి నుంచి.. నేను మీకు అండగా, రక్షణగా ఉంటానని వినిపించిట్టుగా ఆదివాసులు చెప్పుకుంటారు. ఆ కుంకు మ భరిణెనే సమ్మక్కగా పూజిస్తున్నారు. ఇదే యుద్ధంలో సారలమ్మ కూడా వీర మరణం పొందింది. అప్పటినుంచి నేటిదాకా ఆదివాసులు సమ్మక్క, సారలమ్మలను వీర వనితలుగా కొలుస్తూ పూజించే పండుగే మేడారం జాతర..

(వ్యాసకర్త: మహబూబాబాద్ లోక్‌సభ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

రేపు మధ్యాహ్నం మేడారానికి సీఎం

- ఖరారైన పర్యటన షెడ్యూల్
- నేడు ఛత్తీస్‌గఢ్ సీఎం రాక



జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మేడారం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సమ్మక్క సారక్క దర్శనం కోసం శుక్రవారం రానున్న ఆయన మధ్యాహ్నం 3గంటల వరకు మేడారంలో ఉంటారు. ఉద్యమనేతగా కేసీఆర్ చివరిసారి 2012లో సమ్మక్క సారక్కలను దర్శించుకున్నారు. ఇప్పుడు సీఎం హోదాలో వస్తున్నారు. మహాజాతరకు జాతీయహోదా సాధనదిశగా ముందుకెళ్తున్న కేసీఆర్.. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 1.15 గంటలకు మేడారం చేరుకొని, 1.25 గంటలకు గద్దెల ప్రాంగణానికి వస్తారు. ఇరువై నిమిషాలపాటు అక్కడే ఉండి, తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అదే రోజు ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ నరసింహన్, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఓరం కూడా మేడారం వస్తారు. గురువారం ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ రానున్నారు. ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రి రాక నేపథ్యంలో గద్దెల ప్రాంగణం సమీపంలో తాత్కాలిక హెలిప్యాడ్‌లు నిర్మిస్తున్నారు. మంగళవారం మేడారంను సందర్శించిన డీజీపీ మహేందర్‌రెడ్డి హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సీతారాంనాయక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఉపరాష్ట్రపతికి మేడారం ప్రత్యేక బహుమతి

వెండి కుంకుమ భరిణె, జ్ఞాపిక సిద్ధం • కేంద్ర, రాష్ట్ర మంత్రులకూ కానుకలు

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మేడారం మహాజాతర ఈసారి మరింత విశిష్టతను సంతరించుకోబోతున్నది. తొలిసారి ఉపరాష్ట్రపతి జాతరకు వస్తుండటం విశేషం. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు ఘన స్వాగతం పలుకడంతోపాటు అపురూపమైన కానుకను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మేడారం జాతర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా హైదరాబాద్‌లో రూపొందించిన కానుకలను ఉప రాష్ట్రపతికి అందజేయనున్నారు. సమ్మక్క- సారలమ్మలకు ప్రతిరూపమైన కుంకుమ భరిణె, మేడారం జాతర గద్దెలు అచ్చు వేసిన జ్ఞాపికను రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నది. జాతరకు ఈసారి కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాలకు చెందిన ముఖ్యులు రానున్న నేపథ్యంలో వారందరికీ ఈ ప్రత్యేక కానుకలను అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో 50కి పైగా ప్రత్యేక కానుకలను మేడారానికి తెప్పించారు.



ప్రముఖులకు అందించే బాక్సులో జ్ఞాపిక, వెండి కుంకుమ భరిణె

ప్రత్యేక అలంకరణ..: మేడారం జాతరలో ఆదివాసీ, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలన్నీ ఎరుపు రంగులోనే కనిపిస్తుంటాయి. వారు ఉపయోగించే సారెతోపాటు వారి వస్త్రాలంకరణ తదితరాలన్నీ ఎరుపుతోనే మొదలవుతాయి. వారి విశిష్టతలకు ప్రాధాన్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎరుపు రంగులో ఆకట్టుకునేలా కానుకల బాక్సును రూపొందించింది.



మేడారంలోని జంపన్న వాగుకు జనప్రవాహం పోటెత్తింది. జాతరకు తరలివచ్చే జనాలు వాగు వెంబటి కిలోమీటర్ల మేర బారులు తీరారు.ఎగువ నుంచి ప్రవాహం కొనసాగుతుండటంతో పిల్లా, పెద్దలంతా జలకాలటలతో మునిగి తేలారు. సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునే ముందు భక్తులంతా ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి గద్దెల వద్దకు కదిలి వెళ్లారు. **-మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

మేడారం సంబురం



బుధవారం రాత్రి కన్నెపల్లి నుంచి సారక్కను జంపన్న వాగు మీదుగా తోడ్కొని వస్తున్న ఆదివాసీ పూజారులు



బుధవారం రాత్రి కన్నెపల్లిలోని గుడినుంచి సారక్కను మేడారానికి తీసుకెళ్తున్న ఆదివాసీ పూజారులు

సిగాలూగె మేడారం

మొదటిపేజీ తరువాయి...

యూనియన్, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారక్క యువజన సంఘం బృందాల సారథ్యంలో కళాబృందాల ధూంధాం దాదాపు నాలుగు గంటలకు పైగా కొనసాగింది. అదే సమయంలో సారక్క ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఇతర పూజారులు సారక్క గుడిలో పూజలు జరిపారు. భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ అమోయ్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ పవార్, ఐటీడీవో పీవో చక్రధర్‌రావు, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, ఏఎస్పీ దక్షిణామూర్తి, ములుగు డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతక్క సహా పలువురు ప్రముఖులు సారక్కను గుడి నుంచి మేడారానికి తోడ్కొని బయలుదేరారు. మునుపెన్నడూ లేనివిధంగా సారక్క మేడారం పయనం ఈసారి చాలా పొద్దుపోయాక మొదలైంది. రాత్రి 8.12 గంటలకు కన్నెపల్లి గుడి నుంచి సారక్క మేడారం బయల్దేరింది. 8.45 గంటలకు కన్నెపల్లి వాడవాడలా సారక్కకు మంగళహారతులు పట్టారు. 9.20కి కన్నెపల్లి ఊరు సారక్కను సాగనంపింది. 9.35 గంటలకు సారక్క జంపన్నవాగుకు చేరుకుంది. 9.40గంటలకు వాగునుంచి బయటికి వచ్చిన సారక్కకు స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మొక్కులు చెల్లించుకున్నారు. 10.05 గంటలకు మేడారం గుడికి సారక్క చేరుకుంది.

ఆలయాలు మూసినవేళ మేల్కొన్న మేడారం!

(మేడారం నుంచి నూర శ్రీనివాస్-వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు మూసేసిన సమయంలోనే మేడారం జాతర మేల్కోవడం చర్చనీయాంశమైంది. మాఘశుద్ధ పౌర్ణమి మేడారం జాతరకు కొండగుర్తులాంటిది. కానీ బుధవారం రాత్రి 8 గంటల నుంచి 8-42 నిమిషాలవరకు సంపూర్ణ చంద్రగ్రహణం యాదృచ్ఛికమే అయినప్పటికీ భక్తుల విశ్వాసాలు, వారి వారి నమ్మకాల కోణంలో పరిశీలించినప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈసారి జాతరకు చంద్రగ్రహణం అడ్డంకిగా మారొచ్చన్న కొంతమంది ఆధ్యాత్మికవాదుల చర్చలను పటాపంచలు చేస్తూ తమది ప్రకృతి సంస్కృతిని అని చాటుకున్నారు గిరిజనం. సరిగ్గా సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించిన సమయంలోనే బిడ్డ సారక్కకు తోడు పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకున్నారు. వాస్తవానికి సమ్మక్క అంటే పున్నమ అనే నమ్మకం విస్తృత ప్రచారంలో ఉంది. పున్నమ గడియల కోసం, తల్లుల రాకకోసం కోట్లాది మంది భక్తులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తూ ఉంటారు. ఆ పున్నమి వెన్నెలకు గ్రహణం పట్టిందనే పట్టింపులేకుండానే మేడారంలో లక్షలమంది భక్తులు గుమిగూడారు. చంద్రగ్రహణం తమ పూజలకు అడ్డంకే కాదని చాటిచెప్పారు గిరిజనులు. ప్రకృతిని ఆరాధించి ప్రకృతినే దైవంగా భావించే గిరిజన వనదేవతల పూజలకు ఏ గ్రహణం అడ్డుకాదు అని నిరూపించారు ఆదివాసీ గిరిజన పూజారులు.

తొవ్వపొడుగునా జనసందోహం

సారక్క మేడారానికి బయల్దేరిందన్న సమాచారం తెలియగానే మేడారం జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోపతండాలుగా కన్నెపల్లికి పరుగులు తీశారు. గుడి నుంచి బయటికి రాగానే సారక్క కన్నెపల్లి వాడవాడ తిరుగుతూ తన బిడ్డలకు దీవెనలిచ్చింది. ఇల్లిల్లు సారక్కకు చీరెసారె పోసి కాళ్లు కడిగి నెత్తిన చల్లుకుంది. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అత్యంత నియమనిష్ఠలతో ఉదయం నుంచి ఉపవాసం ఉన్న ప్రధాన వడ్డె సారయ్య ఆధ్వర్యంలో సారక్క మేడారం గద్దెకు పయనమైంది. కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవున దారికిరువైపులా జనసందోహం పోటెత్తింది. సిగాలూగె సివసత్తుల పూనకాలతో జాతర మారుమోగింది. ఎదుర్కోళ్లు సమర్పిస్తూ ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సారక్కకు నీరాజనం పలికారు. తుడుందెబ్బ సహా పలు ఆదివాసీ సంఘాలు త్రివలయ విధానంలో సారక్కకు రక్షణగా నిలిచారు. భక్తులతో ఈ కార్యక్రమానికి విఘాతం కలుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన రక్షణ కల్పించారు. పోలీసులు సైతం రెండు రోప్‌పార్టీలను ఏర్పాటు చేశారు. కన్నెపల్లి నుంచి జంపన్నవాగు దాకా ఒక దృశ్యం.. జంపన్నవాగు నుంచి మేడారం దాకా మరో దృశ్యం. ఈ రెండు దృశ్యాల నడుమ జంపన్నవాగు ఒక్కసారిగా కో.. కో.. రాగాలాలపించింది. అక్క సారక్క తన చెంతకు వచ్చిందని ఉప్పొంగిన జంపన్న అక్క కాళ్లు కడిగి నెత్తిన చల్లుకున్నాడా అన్నంత ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది.

పులకించిన మేడారం

మేడారం పొలిమేరల్లోకి సారక్క రాగానే సంబుర వాతావరణం వెల్లవిరిసింది. అప్పటికే పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలి వచ్చారు. ఆ ఇద్దరూ సారక్కకోసం ఎదురు చూస్తున్న తరుణంలో మేడారానికి సారక్క వచ్చిందన్న సంకేతంతో గుడి ప్రాంగణం సందడిగా తయారైంది. సారక్క మేడారం గుడిలోకి చేరగానే ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలీ మోతలు, కొమ్ము బూరల నాదాలు దద్దరిల్లాయి. ప్రత్యేక పూజలు ముగిసిన తర్వాత ముగ్గురు కలిసి మేడారం గద్దెల ప్రాంగణానికి బయలుదేరారు. రాత్రి 12.22 గంటలకు సారక్కను గద్దెపై ప్రతిష్ఠించారు. అదేవిధంగా పగిడిద్దరాజు, గోవిందరాజు వారివారి గద్దెలపై ఆసీనులయ్యారు.

నేడు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాక

గురువారం చిలుకలగుట్ట నుంచి సమ్మక్కతల్లి గుట్టదిగి వచ్చి భక్తుల నీరాజనాలు అందుకుంటుంది. ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య సమ్మక్క తల్లిని గద్దెపై రాత్రి సుమారు 9గంటల ప్రాంతంలో ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే సమ్మక్క పూజారులు ఐదుగురు చిలుకలగుట్టపైకి వెళ్లి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కతల్లిని వెంటతీసుకొని చిలుకలగుట్ట చివరి మూలమలుపుకాడికి వస్తారు. అక్కడ జిల్లా కలెక్టర్ కర్ణన్, జిల్లా ఎస్పీ భాస్కరన్ సమ్మక్క తల్లికి స్వాగతం పలికి ఏకే 47తో తూటాలు పేల్చిన తరువాత సమ్మక్కతల్లి గుట్ట దిగుతుంది. అక్కడి నుంచి భక్తులు ఉద్వేగాల నడుమ దారి పొడవునా సమ్మక్కతల్లికి రాకను స్వాగతం పలుకుతూ తల్లికి ఎదురుగా కోళ్లు, గొర్రెలు, మేకలు బలిస్తూ పూనకాలతో ఊగిపోతారు. సమ్మక్క తల్లి వస్తున్నదనే సంకేతంతో జాతర ప్రాంగణం అంతా ఒక్కసారిగా ఉద్వేగానికి లోనవుతుంది. ఈ దశలో పూజారులు చాలా జాగ్రత్తగా తల్లిని తీసుకొని ప్రధాన ద్వారం గుండా గద్దెపైకి చేరుకొని ప్రతిష్ఠిస్తారు.



బుధవారం భూపాలపల్లి జిల్లా ములుగులో ట్రాఫిక్ స్తంభించడంతో బారులు తీరిన ఆర్టీసీ బస్సులు

ఈసారి జాతరకు ట్రాఫిక్ అంతరాయం

గత జాతర అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు చర్యలు చేపట్టినప్పటికీ మొదటి రోజైన మంగళవారం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు 163వ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడంలో వారు అంతగా సఫలీకృతం కాలేదనే విమర్శలు వినవచ్చాయి. దీనికితోడు తాడ్వాయి మండలం లవ్వాల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన నలుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జాతరకు వచ్చిన ఓ నిండు గర్భిణీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి మార్గమధ్యంలో బాబుకు జన్మనిచ్చి తనువు చాలించడం మరో అపశృతిగా మిగిలింది.

అభయారణ్యంలో తీరొక్క మొక్కులు

- భిన్నరీతుల్లో భక్తుల చెల్లింపులు
- హుండీలో డాలర్లు, భారతీయ కరెన్సీ
- సారె, బంగారం చెల్లింపులే కీలకం
- ఒడిబియ్యాలూ, యాచనలూ మొక్కులే



బుధవారం జాతర సందర్భంగా జంపన్నవాగులో ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా పూజలు, భక్తుల పూనకాలు.. మహా జాతరలో లక్ష్మీ దేవరల సందడి

జూపల్లి రమేశ్ / వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మేడారం మహాజాతరలో చెట్టూపుట్టా ప్రతిదీ ప్రత్యేకమే. ఇక్కడి ఆదివాసీ, గిరిజనుల ఆరాధన ఎన్నో విశేషాల సమాహారం. అడవి తల్లులను కొలిచేందుకు సుదూరం ప్రయాణించి మేడారానికి చేరుకునే భక్తులు సమ్మక్క, సారక్కలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కోరికలు మన్నించమంటూ వివిధరూపాల్లో మొక్కులు చెల్లించుకుంటారు. జాతరకు ప్రత్యేకమైన అడవిబిడ్డల సంప్రదాయ మొక్కులపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

ఆదివాసీల చిహ్నం లక్ష్మీదేవరలు

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట అలంకరణలతో కూడిన లక్ష్మీదేవరలది ప్రత్యేకస్థానం. దేవతామూర్తులను కొలిచేందుకు వచ్చే భక్తులు గుర్రం ఆకారాన్ని పోలిన చెక్కలో మనిషి సులువుగా ఒదిగిపోయే లక్ష్మీదేవరల రూపంలో గద్దెల చెంతకు చేరుకుంటారు. ఎరుపురంగులో ఉండే లక్ష్మీదేవరపై ఆదివాసీల సంస్కృతికి సంబంధించిన పలు చిత్రాలను అద్దుతారు. పురుషులు స్త్రీ వేషధారణలో వస్తామని మొక్కుకోవడం జాతర మరో విశిష్టత.

అమ్మలకు సారె, బంగారం

మేడారం జాతరలో అడుగడుగునా భక్తులు సమర్పించే మొక్కుల్లో ప్రధానంగా కనిపించేవి చీరసారెతోపాటు ఎత్తు బంగారమే. బెల్లం రూపంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకుంటుండటం ఇక్కడి ప్రత్యేకత. ఈ బంగారాన్ని గ్రామాల్లోకి వెళ్లిన తర్వాత సమ్మక్క పేర అందరికీ పంచుతుంటారు. తల్లులకు ఒడిబియ్యం పోసేందుకు ఆడపడుచులు ఇంటి నుంచే బియ్యాన్ని నడుముకు కట్టుకుని, చేతిలో త్రిశూలాన్ని పట్టుకుని దర్శనానికి బయలుదేరుతారు. వనదేవతల గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీలోనూ ఒడిబియ్యాన్ని పోసి మొక్కుతుంటారు. మొక్కులో భాగంగా సమ్మక్క భక్తులు జాతరలో యాచన చేయడం మరో విశేషం. అలా అడుక్కున్న పైసలను తర్వాత వచ్చే జాతరలో సమ్మక్కకే సమర్పిస్తుంటారు.జాతరకొచ్చే ప్రతి భక్తుడు తన ఇంట్లోంచి పసుపు, కుంకుమలను తీసుకొచ్చి దేవతలకు సమర్పించడం ఆచారం.

ఎదుర్కోళ్ల మొక్కు

సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి తీసుకువస్తుండగా ఆమెకు ఎదురుగా వెళ్లి కోళ్లను ఎగిరేస్తారు. దీనినే ఎదుర్కోళ్ల మొక్కుగా పిలుస్తారు. జాతర జరిగినన్నిరోజులూ గుడి ప్రాంగణంలో ఎదుర్కోళ్ల సందడి ఉంటుంది. ఐదో పదో చెల్లిస్తే ఒక కోడిపుంజును దేవతల ప్రాంగణానికి ఎదురుగా గాల్లో ఎదుర్కోడి మొక్కుగా ఎగిరేసే అవకాశాన్ని స్థానికులు కల్పిస్తారు.

మేడారం జాతర వెబ్‌సైట్ ఆవిష్కరణ

సమ్మక్క సారక్క జాతర వెబ్‌సైట్‌ను గిరిజన, పర్యాటకశాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ బుధవారం ప్రారంభించారు. sammakkasarakka.in పేరుతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌లో జాతర ముఖ్యఘట్టాలన్నీ పొందుపరిచారు.

5,800 బస్సులు నడిపిన ఆర్టీసీ

మేడారం జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 5,800 బస్సులను నడిపినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వీటి ద్వారా 2.60 లక్షల మంది భక్తులను చేరవేసినట్టు వివరించారు.

మేడారంలో మంత్రుల మకాం

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: సమ్మక్క సారక్క మహాజాతర ప్రారంభం కావడంతో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం మేడారం చేరుకున్నారు. ప్రముఖుల పర్యటన నేపథ్యంలో ఇక్కడే మకాం వేశారు. మూడురోజుల పర్యటన కోసం మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి మేడారం వచ్చారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. జాతర ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా కలెక్టర్ కర్ణన్, ఎస్పీ భాస్కరన్‌తో కలిసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యసేవల గురించి భక్తులనే నేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్కను తీసుకురానున్న చిలుకలగుట్ట వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భక్తులు భారీగా తరలివస్తున్నందున మంగళవారం రాత్రి కొంత ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని.. బుధవారం ఎక్కడా ట్రాఫిక్ సమస్య లేదని చెప్పారు. జాతీయ రహదారిలో అదనపు బలగాలను నియమించామని.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రులు వివరించారు. తాము శుక్రవారం వరకు మేడారంలోనే ఉంటామని.. ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.



మేడారం జాతరలో సెల్ఫీ తీసుకొంటున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సీతారాంనాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు. (ఇన్‌సెట్) వాకీటాకీలో అధికారులకు కడియం సూచనలు



మేడారంలో భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

భక్తుల క్షేమమే పోలీసుల లక్ష్యం

మేడారంలో డీజీపీ మహేందర్‌రెడ్డి

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: మేడారం వచ్చే భక్తులు క్షేమంగా ఇండ్లకు చేరుకునేలా బందోబస్తు నిర్వహించటమే పోలీసుల లక్ష్యమని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి తెలిపారు. మహాజాతరకు 15 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహాజాతర ప్రారంభమైన నేపథ్యంలో హైదరాబాద్- భూపాలపట్నం జాతీయ రహదారిలో ములుగు వద్ద ఉన్న గట్టమ్మ గుడి నుంచి గోవిందరావుపేట మండలం పస్రా మధ్య మంగళవారం రాత్రి నుంచి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు జాతీయ రహదారిపై ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. బందోబస్తు పర్యవేక్షణలో భాగంగా మంగళవారమే ఇక్కడికి చేరుకున్న డీజీపీ మహేందర్‌రెడ్డి.. జాతీయ రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రహదారిపై విధులను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారుల తీరును డీజీపీ తప్పుబట్టారు. అనంతరం అదనపు డీజీపీ అంజనీకుమార్, ఐజీలు నాగిరెడ్డి, నవీన్‌చంద్, డీఐజీ రవివర్మ, ఎస్పీ భాస్కరన్‌తో కలిసి మేడారం గద్దెల ప్రాంగణంలో పర్యటించారు. ఉపరాష్ట్రపతి, గవర్నర్, సీఎం, ఛత్తీస్‌గఢ్ సీఎం రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.



మేయర్ బొంతు రామ్మోహన్‌తో సిర్సా మున్సిపల్ కార్పొరేషన్ బృందం

హైదరాబాద్‌లో పారిశుద్ధ్యం భేష్!

హర్యానాలోని సిర్సా మున్సిపల్ కార్పొరేషన్ బృందం ప్రశంస

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మహానగరంలో పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ ఎంతో బాగున్నాయని హర్యానా రాష్ట్రంలోని సిర్సా మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి సభ్యులు ప్రశంసించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న స్వచ్ఛ కార్యక్రమాలతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు సిర్సా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌తోపాటు పలువురు కార్పొరేటర్లు హైదరాబాద్‌కు వచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో ఘన వ్యర్థాల నిర్వహణ తదితర పనులను వారు పరిశీలించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో మేయర్ బొంతు రామ్మోహన్‌తో భేటీ అయ్యారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పరిశుభ్రత, పచ్చదనం ఎంతో మెరుగ్గా ఉన్నట్టు తమ అధ్యయనంలో గుర్తించామని, పనితీరు బాగున్నదని అభినందించారు. మేయర్ రామ్మోహన్ మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతమున్న 16 శాతం గ్రీనరీని 33 శాతానికి పెంచేందుకు 40 కోట్ల మొక్కలను నాటుతున్నట్టు తెలిపారు. గ్రేటర్‌లో అమలుచేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ హాలును సిర్సా బృందం పరిశీలించింది.

ఆకాశంలో అద్భుతం

ఆకట్టుకున్న సంపూర్ణ చంద్రగ్రహణం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మాఘపౌర్ణమి బుధవారం సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. సాయంత్రం 5.18 నుంచి రాత్రి 8.41 గంటల వరకు కొనసాగింది. గ్రహణం ప్రారంభంలో సూర్యకాంతితో ప్రభావితమైన చంద్రుడు ఎర్రని రంగులో శోభాయమానంగా కనిపించాడు. గ్రహణ సమయంలో బ్లడ్ మూన్, బ్లూమూన్, సూపర్‌మూన్ ఆవిష్కృతమై అలరించింది. అంతరిక్షంలోనే ఇదొక అరుదైన, అద్భుతమైన ఘటన అని అంతరిక్ష పరిశోధకులు రఘునందన్ తెలిపారు. గ్రహణం దేశమంతటా కనిపించిందన్నారు. 1982లో ఇటువంటి సూపర్‌మూన్ ఆవిష్కృతం కాగా, తిరిగి 2037లో సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్నదన్నారు. ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా దేశాల్లో చంద్రగ్రహణం, బ్లడ్ మూన్ చాలా దగ్గరగా కనిపించింది.



శాంతి హోమాలు, జపాలు..

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా తమ ఆశ్రమంలో జపాలు, గ్రహణ విడిచాక శాంతిహోమాలు చేశామని విశాఖ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామీజీ పేర్కొన్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామీజీ, శృంగేరీపీఠంలో లోక కల్యాణం కోసం జపాలు, హోమాలు జరిపారు.

నేటి నుంచి జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన

పీపుల్స్‌ప్లాజాలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసోసియేషన్ ఆఫ్ ఈవెంట్ ఆర్గనైజర్స్(ఏఈవో) ఆధ్వర్యంలో గురువారం నుంచి 5వ తేదీ వరకు ఐదో అఖిల భారత ఉద్యానవన, వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు ఖాలిక్ అహ్మద్ తెలిపారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించే ఈ ప్రదర్శనను డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నర్సరీల నుంచి ఫల, పుష్ప, ఆర్నమెంట్, మెడిసిన్ మొక్కలను ఇందులో ప్రదర్శిస్తారు. 70కిపైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తామని ఖాలిక్ తెలిపారు. నిత్యం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. అధికంగా తెలంగాణ, డార్జిలింగ్, ముంబై, బెంగళూరు, పుణె, ఏపీ రాష్ట్రాల నుంచి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో చిత్రాలను పరిశీలిస్తున్న అమెరికా కాన్సులేట్ జనరల్ క్యాథరీన్ హడ్డా, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

70 ఏండ్లుగా భారత్‌తో సత్సంబంధాలు

మెట్రోరైలు అద్భుతమైన ప్రాజెక్టు: యూఎస్ కాన్సులేట్ జనరల్ క్యాథరీన్ బీ హడ్డా

అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో భారత్-అమెరికా సంబంధాలపై ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భారతదేశంతో అమెరికాకు 70 ఏండ్లుగా సత్సంబంధాలు కొనసాగుతున్నాయని అమెరికా కాన్సులేట్ జనరల్ క్యాథరీన్ హడ్డా పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు చాలా బాగున్నాయని కొనియాడారు. భారత్-అమెరికా సంబంధాలపై విద్యార్థులు వేసిన చిత్రాలతో అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను బుధవారం హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి క్యాథరీన్ హడ్డా ప్రారంభించారు. పేయింటింగ్స్ చాలా అందంగా ఉన్నాయని, మంచి సందేశాలను ఇస్తున్నాయని క్యాథరీన్ అభినందించారు. రాబోయే తరాల ఆలోచనలకు ఈ చిత్రాలు అద్దం పడుతున్నాయన్నారు. ఎగ్జిబిషన్ కోసం 200 ఎంట్రీలు రాగా అందులోనుంచి ఉత్తమంగా ఉన్న 50 చిత్రాలను ఎంపికచేసినట్టు చెప్పారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. అమీర్‌పేట స్టేషన్ నుంచి ప్రయాణించే వేల మందికి భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను చూసే వీలుంటుందన్నారు. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ ఇదో అద్భుతమైన ప్రాజెక్టని కొనియాడారు. పలు దేశాల్లో నిర్మించిన మెట్రోలతో పోలిస్తే అత్యుత్తమమైనదని అభినందించారు. మెట్రోలో ప్రయాణం చాలా బాగుందన్నారు. మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య కొనసాగుతున్న సత్సంబంధాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతతో వేసిన చిత్రాలు గొప్ప సందేశాన్ని ఇస్తున్నాయన్నారు. అంతకుముందు మెట్రోరైలు భవన్ సమీపంలోని రసూల్‌పుర స్టేషన్ నుంచి క్యాథరీన్ హడ్డా, ఎన్వీఎస్ రెడ్డి, ఇతర ఇంజినీర్లు, మీడియా ప్రతినిధులు మెట్రోరైలులో అమీర్‌పేట వరకు ప్రయాణించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తార్నాక డేవిడ్ మెమోరియల్ హైస్కూల్, పటాన్‌చెరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్, నామాలగుండుకు చెందిన శ్రీ సరస్వతి హైస్కూల్, వారాసిగూడకు చెందిన సేయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రైల్వే సిస్టమ్స్ అనిల్‌కుమార్ షైని, ఎస్ఈ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగీ గుండి.. 4.5 కోట్లు!

ఖరీదైన వజ్రమంటూ మాయమాటలు ● రూ.1.20 కోట్లు కొట్టేసిన ముఠా ● ఇద్దరి అరెస్ట్.. రూ.1.15 కోట్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అంగీలు, కోట్‌లు, సూట్‌ల గుండీలకు వాడే ఓ రంగురాయిని చార్మినార్ అంగడిలో రూ.3,500 కొని ఖరీదైన రత్నమంటూ నమ్మించిన ఓ ముఠా.. రూ.1.2 కోట్లు కొట్టేసింది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రూ.1.15 కోట్లు రికవరీ చేశారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధ కిషన్‌రావుతో కలిసి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. సనత్‌నగర్‌కు చెందిన షేక్‌హాజీ అలియాస్ ఇలియాస్ చిరు వ్యాపారి. బీహెచ్ఈఎల్ ఆర్‌సీపురంకు చెందిన మహ్మద్ సలాం ఖాన్‌తో కలిసి గతంలో ఓ జ్యువెలరీలో సేల్స్‌మెన్‌గా పనిచేశారు. ఆ తర్వాత సలాం రంగు రాళ్లను విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అతేర్ సిద్దిఖీతో స్నేహం ఏర్పడింది. సలాం, అతేర్‌కు వ్యాపారం కలిసిరాకపోవడం, అధికంగా ఇబ్బందులు ఎదురుకావడంతో ఎవరినైనా మోసం చేసి పెద్దమొత్తంలో సంపాదించాలని పథకం వేశారు. షేక్ హాజీ బంధువులు, స్నేహితులు బాగా ఉన్నవారు కావడంతో అతడిని లక్ష్యంగా చేసుకున్నారు. గత నెల 14న చార్మినార్ వద్ద ఆదివారం మార్కెట్‌లో రూ.3,500కు వజ్రంలా కనిపించే ఓ రంగురాయిని కొన్నారు. అదేరోజు షేక్ హాజీకి ఫోన్ చేసి రూ.4.5 కోట్ల విలువైన వజ్రం ఉన్నదని, ఓ వ్యక్తికి అత్యవసరంగా డబ్బు అవసరం కావడంతో అగ్గువకే అమ్ముతున్నాడని నమ్మించారు. డబ్బు సర్దుబాటు చేసి వెంటనే వజ్రాన్ని కొంటే వారంరోజుల్లో మార్కెట్ ధర ప్రకారం అమ్మి భారీగా లాభం పొందవచ్చని నమ్మించారు. వారి మాటలు నమ్మిన హాజీ రూ.1.2 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. తెలిసిన వారి వద్ద నుంచి డబ్బు అప్పుగా తెచ్చి గత నెల 18న తేదిన నాంపల్లిలోని కామత్ హోటల్ సమీపంలోని స్వదేశ్ లాడ్జ్ వద్ద వారిని కలిశారు. ఆ రాయిని వజ్రంగా నమ్మించడానికి సలాం, అతేర్ తమకు అనుకూలంగా ఉన్న మరో వ్యక్తిని రప్పించి హాజీ ముందు డైమండ్ టెస్టింగ్ మెషిన్, ఎలక్ట్రానిక్ కాంట, అల్ట్రా వాయిలెట్ రేస్ యంత్రం, టేబుల్ డైమండ్ సెలక్టర్ లైట్, కెనాన్ జ్యువెలరీ లూప్స్ 18 ఎంఎం లెన్స్ డైమండ్ క్లిప్పర్, క్రోస్ జెమ్ క్లీనర్ పరికరాలతో పరీక్షలు చేసినట్టు నమ్మించి అసలైన వజ్రమని చెప్పించారు. దీంతో డబ్బు ఇచ్చి వజ్రాన్ని తీసుకెళ్లాడు.

వజ్రం కాదు రంగురాయి

వారం రోజుల్లో కొనుగోలుదారులను తీసుకొచ్చి వజ్రాన్ని మార్కెట్ ధరకు విక్రయిస్తానని మాట ఇచ్చిన సలాం, సిద్దిఖీకి ఫోన్‌చేస్తే కాలయాపన చేస్తున్నారు. మరోవైపు డబ్బులు ఇచ్చినవారు తిరిగివ్వాలని హాజీని ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. దీంతో హాజీ తనవద్ద ఉన్న వజ్రానికి పంజాగుట్టలో పరీక్షలు చేయించగా, అది వజ్రం కాదని, అంగీలు, సూట్, కోట్‌ల గుండీలకు వాడే రంగురాయి అని తేల్చిచెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన హాజీ అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సాయిని శ్రీనివాసరావు బృందం దర్యాప్తు చేపట్టి సలాంఖాన్‌ను, అతేర్‌సిద్దిఖీని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,15,20,000 నగదు, రంగురాయి పరీక్షలకు వాడిన నకిలీ పరికరాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. నిందితులు తీసుకున్న డబ్బులో రూ.4.8 లక్షలను పిల్లల స్కూల్, కాలేజీ ఫీజులు, ఆస్పత్రిలోని సోదరుడికి పంపారని, మిగతా సొమ్మును రికవరీ చేశామని సీపీ వెల్లడించారు. హాజీ ఆ డబ్బును ఎక్కడి నుంచి తెచ్చారు? లెక్కలున్నాయా? వంటి విషయాలపై ఆరాతీస్తున్నారు. సరైన పత్రాలు లేకుంటే ఆదాయపన్ను శాఖకు సమాచారం ఇస్తామన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసరావు. (ఇన్‌సెట్) వజ్రంగా నమ్మించిన రంగురాయి

మోసాలపై సమాచారం ఇవ్వండి

ఎవరైనా మార్కెట్ ధర కన్నా అగ్గువకు బంగారం, వజ్రాలు అమ్ముతామని వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ శ్రీనివాసరావు కోరారు. బాధితులు ఎక్కువ మొత్తంలో మోసపోయినప్పుడే పోలీసులను ఆశ్రయిస్తున్నారని, వేలల్లో మోసం జరిగినా తప్పకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు. మోసగాళ్లను గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఫిర్యాదు చేయడానికి వస్తే.. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు!

మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ ఎస్సై నర్సింహులుపై డీసీపీకి ఫిర్యాదు

హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేసిన ఉన్నతాధికారులు




ఎస్సై నర్సింహులు

జవహర్‌నగర్/వినాయకనగర్: ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తన భార్యను మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ ఎస్సై లోబరుచుకున్నాడని, వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని మల్కాజిగిరి డీసీపీకి ఫిర్యాదు అందింది. ఇటీవలే ఓ ఏఎస్పీ, సీఐ, ఓ కానిస్టేబుల్ ఇలాంటి వ్యవహారాల్లో దొరికిపోగా తాజాగా ఎస్సై వివాదంలో చిక్కుకున్నారు. కరీంనగర్‌కు చెందిన జ్యోత్స్నాదేవి, కాప్రా మండలం మౌలాలి హెచ్‌బీ కాలనీకి చెందిన సతీశ్ 2016లో ప్రేమ పెండ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వీరు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు మొదలయ్యాయి. దీంతో జ్యోత్స్నాదేవి గత ఏడాది నవంబర్ 23న జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనను భర్త సతీశ్ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఎస్సై నర్సింహులుకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కేసు నమోదు చేయకుండా జ్యోత్స్న, సతీశ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించాడు. తర్వాత ఎస్సై నర్సింహులు తరుచూ జ్యోత్స్నకు ఫోన్‌చేయడం మొదలుపెట్టాడు. కొన్నాళ్ల తర్వాత జ్యోత్స్నను నేరుగా తన ఇంటికి తీసుకెళ్లి భార్యకు పరిచయం చేశాడు. కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనలో మార్పు రావడం, విడాకులు కావాలని తరుచూ గొడవ పడుతుండటంతో సతీశ్‌కు వారి వ్యవహారశైలిపై అనుమానం వచ్చి నిఘా పెట్టాడు. ఎస్సై నర్సింహులు క్రెడిట్‌కార్డు జ్యోత్స్న వద్ద దొరుకడం, ఆ కార్డుతో రూ.40వేలు షాపింగ్ చేయడంతో అనుమానం బలపడింది. దీంతో సతీశ్ బుధవారం మాల్కాజిగిరి డీసీపీ ఉమా మహేశ్వరశర్మను కలిసి ఫిర్యాదు చేశారు. వారిద్దరి వ్యవహారం తనకు తెలువడంతో బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని వాపోయారు. తనకు ప్రాణహాని ఉన్నదని, రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని వేడుకున్నారు. సతీశ్ ఫిర్యాదు నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు జవహర్‌నగర్ ఎస్సై నర్సింహులును హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీచేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

మాది స్నేహం మాత్రమే

ఎస్సై నర్సింహులుకు, తనకు మధ్య ఉన్నది స్నేహం మాత్రమేనని జ్యోత్స్నాదేవి పేర్కొన్నారు. తన భర్త సతీశ్ కొన్నాళ్లుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో న్యాయం చేయాలని తన తండ్రితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సైని కోరానన్నారు. ఈ క్రమంలోనే స్నేహంగా ఉంటున్నామని, అంతకు మించి ఏమీ లేదన్నారు.



కీసర మండలం తిమ్మాయిపల్లిలో కాలిపోతున్న బస్సు, బేగంపేటలో దగ్ధమవుతున్న కారు

బుధవారం మేడ్చల్ జిల్లాలో ఓ బస్సు, హైదరాబాద్‌లో ఓ కారు దగ్ధమయ్యాయి. హైదరాబాద్ జామైఉస్మానియాకు చెందిన 20 మంది ఉద్యోగులు సుప్రీం ట్రావెల్స్ బస్సులో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని ఫార్మా కంపెనీకి వెళ్తున్నారు. కీసర మండలం తిమ్మాయిపల్లి సమీపంలోకి రాగానే బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్, ఉద్యోగులు దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మరోప్రమాదంలో హైదరాబాద్ బేగంపేటలోని విజయ్‌పురికాలనీకి చెందిన మురళి తన కారులో పంజాగుట్టవైపు వెళ్తున్నారు. ప్రకాశ్‌నగర్‌కు చేరుకోగానే కారు ఇంజిన్‌లో మంటలు రావడంతో వాహనాన్ని నిలిపి కిందికి దిగేశారు.

–కీసర/బేగంపేట

Life is Beautiful

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 1 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

మేడారం సమ్మక్కకు దండంపెడుతూ మధ్యభారతం కదిలింది. మేడారం జాతర ప్రాంగణాన్ని ఆదిమ గిరిజన తెగల సంగమంగా భావించే సంప్రదాయానికి కొనసాగింపుగా కోయజాతి కొంగు బంగారం కోసం వందల కిలోమీటర్లు కాలిబాటలతో పయనమై వచ్చారు.


ఫొటో: వీరగోని రజినీకాంత్

మేడారంలో మధ్యభారతం!


జంపన్న వాగులో స్నానమాచరిస్తున్న గిరిజన తెగ ప్రజలు


జంపన్న వాగులో పూజలు చేస్తున్న దృశ్యం


గిరిజన సంప్రదాయ ముసుగు 'కర్కట్' కడుతున్న దృశ్యం


కర్కట్ కప్పుకొని గిరిజన సంప్రదాయంలో శివసత్తు..


శివసత్తుకు నుదట కుంకుమ పెడుతున్న భక్తురాలు


చెలిమె పూజ సమయంలో సన్నాయి వాయిస్తూ..


జంపన్న వాగు ఒడ్డున ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజనులు

మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలుకాలోని దాదాపు కోయగూడెలన్నీ మేడారం చేరుకున్నవి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, సుకుమా, కాంకేర్, దంతెవాడ మొదలైన జిల్లాల నుంచే కాకుండా ఒడిషాలోని బరంపురం నుంచి వేలాది మంది కోయలు మేడారం చేరుకున్నారు. 'ఇక్కడి నుంచి దుఃఖంతో వెళతాం. ఇక్కడి రావడానికి నెల రోజుల ముందు నుంచే పండుగ చేసుకుంటాం. సమ్మక్కను మొక్కితే మనసు తేలికైతది' అని బీజాపూర్ జిల్లాకు చెందిన దుర్గానాథ్ మేడారం రాకవెనుక ఉన్న ఆంతర్యాన్ని వెల్లడిస్తున్నారు. యేడు విడిచి యేడు తమ ప్రాంతంలో చిన్న సమ్మక్క జాతర జరుపుతామని ఒక సంవత్సరం అక్కడ మరో సంవత్సరం ఇక్కడ పెద్ద సమ్మక్కకు వస్తామని మాథూరాం పేర్కొంటున్నారు.

గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలుకా రాంగూడ నుంచి ఐదు రోజుల కింద పయనమై మంగళవారం తెల్లవారుజామున మేడారం చేరుకున్నామని, తమ ప్రాంతం నుంచి 22 కుటుంబాలు ఇక్కడికి వచ్చాయని మెస్రం పేర్కొన్నారు. కోయజాతి కొంగు బంగారం సమక్క–సారక్క జాతర కోసం ఆదివాసీ ప్రపంచం మేడారంతో సంభాషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిష్టాత్మక సేవలు మునుపెన్నడూ లేనివిధంగా అసాధారణంగా ఉండడమే కాదు జాతర భక్తులకు ప్రత్యేక రైళ్లు వేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన డిమాండ్‌కు దిగొచ్చిన కేంద్రం ఈసారి ప్రత్యేకంగా 16 రైళ్లను వేసి భక్తులకు ఊరట కల్పించింది. దీంతో ఈసారి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. రైల్వే స్టేషన్‌కు వచ్చిన భక్తులను మేడారం తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఎప్పటినుంచో పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తూనే ఉన్నారు టీఆర్‌ఎస్ ఎంపీలు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో ఉపరాష్ట్రపతి నుంచి మొదలుకొని ప్రధానమంత్రి సహా పలువురు కేంద్ర మంత్రులు జాతరకు రావాలని ఆహ్వానాలు చేశారు. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం తాముసైతం పట్టించుకుంటున్నట్టు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ నేడు మేడారం రానున్నారు. అంతేకాకుండా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అదే రోజు వస్తారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో పాటు 16 మంది ఎంపీల బృందం కూడా మేడారం వచ్చేందుకు సమాయత్తం అవుతున్నట్టు బీజేపీ వర్గాలు ప్రకటిస్తున్నాయి. మహారాష్ట్ర చత్తీస్‌గడ్ ఒడిషా మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు మధ్య భారతంలోని 35కోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహించే జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

జంపన్న వాగులో మధ్యభారత పూజలు

మేడారంలోని జంపన్నవాగులో మధ్యభారత ఆదిమ గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా జంపన్నవాగు ఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోయ, ఆంద్, ప్రధాన్, తోటి, గోండ్ తెగలకు సంబంధించిన వారు వచ్చి ఊరట్టం వైపున్న జంపన్నవాగు నీటిలో ఇసుకను తెచ్చి ఒడ్డున చెలిమలుగా వేసి పూజలు చేశారు. బీజాపూర్‌లోని దుర్గామాత ఆలయం నుంచి వచ్చిన భక్తులు తమ కర్కట్ (మొహానికి దిష్టి తగులకుండా కట్టే ఎర్రటి గుడ్డ), మెరుపు ముసుగును ధరించి తమ తమ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు చేశారు. మధ్యభారతంలోని ఆయా రాష్ట్రాల గిరిజన తెగలు వారి వారి ప్రాంతాల్లో మేడారంలో జరిగే రెండేళ్ల జాతర తరహాలోనే చిన్న జాతరలు జరుపుకొంటారు. అక్కడ సమ్మక్క, సారక్కలను గద్దెలపై పెట్టి జాతర చేస్తారు. కాకపోతే గూడాలకు గూడాల్లో చిన్న చిన్న సమూహాలుగా తమ తమ ప్రాంతాల్లో జాతర (పండుగ) చేస్తామని కానీ ఇక్కడిలాగా అక్కడి ప్రభుత్వ ఏర్పాట్లు ఉండవని మాథూర్‌మాన్ పేర్కొన్నారు. చెలిమెతొక్కుడు విధానంలో వచ్చిన తొలిరోజు పూజ చేసి శివాలుగే భక్తురాలి తలపై, పాదాల దగ్గర వేసిన అక్షింతపు బియ్యపు గింజలను కోడితో తినిపించి సమ్మక్క గద్దెకు వచ్చిన తరువాత దాన్ని కోసి తల్లికి ప్రసాదంగా సమర్పించిన అనంతరం వారు భుజిస్తారు. మహారాష్ట్రలోని గడ్చిరోజు జిల్లా సిరోంచ తాలుకా నుంచి రెండు రోజుల క్రితం నడక ప్రారంభించి జాతరకు చేరుకున్నామని గాన్‌సింగ్ చెప్పారు. అదే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నుంచి ఐదు రోజుల క్రితం కాలినడకన తల్లి దగ్గరకు వచ్చామని సారాబాయి వివరించారు.

నూర శ్రీనివాస్
వరంగల్ ప్రధానప్రతినిధి–నమస్తేతెలంగాణ
ఫొటోలు: సీహెచ్ శ్యాం

బిట్స్ కార్నర్

దివ్యాంగుల కోసం.. పోరాడి గెలిచింది!


విరాలీ మోడీ దివ్యాంగురాలు. వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్నది. ఆ పోరాటంలో భాగంగానే 'మై ట్రెయిన్ టూ' క్యాంపెయిన్ చేపట్టింది. దానికి స్పందించిన ఎర్నాకులమ్ జంక్షన్ రైల్వే యంత్రాంగం.. ఆ జంక్షన్‌ని ఇప్పుడు దివ్యాంగుల అనుకూల స్టేషన్‌గా మార్చారు.

విరాలీ మోడీకి పద్నాలుగేళ్ల వయసులో జ్వరం వచ్చింది. ఆ సమయంలోనే ఆమెకు పక్షవాతం అటాక్ అయింది. దాంతో తల నుంచి కిందభాగం కదులలేని స్థితిలో వీల్‌చెయిర్‌కే పరిమితమైంది. ఆ పరిస్థితిలో ఉన్న ఆమె మూడుసార్లు చనిపోవడానికి ప్రయత్నించింది. కానీ చావు విధితో పోరాడింది. అప్పుడే విరాలి తనలాంటి ఎంతోమందికి సహాయం చేయాలని నిర్ణయించుకుంది. దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం మొదలుపెట్టింది. అందులో భాగంగానే ఒకరోజు ముంబై నుంచి ట్రెయిన్‌లో కేరళకు చేరుకున్నది. అక్కడ తనతో వచ్చిన అతను కనిపించలేదు. దిగలేకుండా దిక్కులు చూస్తూ ఉన్న ఆమెను ట్రెయిన్‌లో ఉన్నవారే వీల్‌చెయిర్‌తో సహా బయటకు దింపారు. కానీ ఫ్లాట్‌ఫామ్ నుంచి కాస్త కూడా ముందుకు జరుగలేని స్థితిలో ఉంది. ఆ సమయంలోనే దివ్యాంగులు ఈజీగా బయటకు వెళ్లడానికి, ట్రెయిన్‌లో కూడా దివ్యాంగులకు అనుకూల సదుపాయాలు ఉండాలని పోరాటం చేయాలని అనుకుంది. సంవత్సర కాలంగా ఈ పోరాటం సాగుతున్నది. ఎంతోమంది రాజకీయ నాయకులను, రైల్వే ఆఫీసర్లను కలిసింది. ఏ రాష్ట్రం ఆమె బాధను పట్టించుకోలేదు. కానీ ఎర్నాకులమ్ జంక్షన్ మాత్రం ఆమె కలలను నిజం చేసేలా తయారైంది. ఎంతోమంది దివ్యాంగులకు ఇప్పుడా స్టేషన్ అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. పైగా ఇలా తయారైన మొదటి రైల్వే స్టేషన్‌గా కూడా ఈ జంక్షన్ పేరు నమోదు చేసుకుంది. ఏది ఏమైనా విరాలీ పోరాటం గెలిచింది.

అంతకుముందు.. ఆ తర్వాత..



శ్రీమంతుడు సినిమాల్లో ఊళ్లను దత్తత తీసుకొని బాగు చేస్తాడు హీరో. ఇక్కడ కనిపించే అమ్మాయి కూడా ఆ పనే చేస్తుంది. ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని దాని రూపరేఖల్నే మార్చేసింది.

'భారతదేశం భవిష్యత్తు గ్రామాల్లోనే ఉంది' అన్నాడు మన బాపూజీ. కవిత కె పాండియన్ తమిళనాడులోని విరుదానగర్ జిల్లా కొట్టాయూర్ గ్రామానికి చెందినది. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగానికి వెళ్లింది. అక్కడికి వెళ్లినా తన గ్రామాన్ని ఎన్నడూ మరువలేదామ్మాయి. ఎలాగైనా తన గ్రామాన్ని బాగు చేసుకోవాలనుకుంది. తన ఆలోచనను స్నేహితులకు చెప్పింది. వారు తోడవుతామని అనడంతో ఊరును దత్తత తీసుకుంది. అలా ఆ గ్రామంలోని రోడ్లు, స్కూళ్లు, ఆసుపత్రి.. ఇలా ఒక్కొక్కటిగా బాగు చేస్తూ వస్తున్నది. ఆ ఒక్క గ్రామంతోనే అభివృద్ధి ఆపేయకుండా పక్క గ్రామాల్లోని స్కూళ్లలో సైతం ఆమె సహాయక కార్యక్రమాలు చేపడతున్నది. క్లాసులను అందంగా తీర్చిదిద్దడమే కాదు.. ఆ పిల్లలకు స్మార్ట్ టీవీల సహాయంతో ఇంగ్లీష్ పాఠాలు నిర్వహిస్తున్నది. ఆమెతో పాటు మరెంతో మంది ఈ బృహత్ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు. వారి ఈ కార్యక్రమానికి అందరి మన్ననలూ అందుతున్నాయి.

ఈ సమస్య తీరేదెలా?

అడుగండి చెబుతా






మా నాన్నగారి వయసు 68 సంవత్సరాలు. ఆయనకి ఇప్పటివరకు షుగర్, బి.పి. వంటి వ్యాధులు లేవు. కాని తరుచూ ఆయన మూత్ర విసర్జన చేయడం, మూత్రం చుక్కలుగా రావడం, మూత్రంలో రక్తం పడడం, మూత్ర విసర్జనకు ఎక్కువ సమయం పట్టడం, మూత్రంలో మంట వంటి సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి తగిన సలహా ఇవ్వగలరు.

- దినేష్, జగిత్యాల

మీరు తెలిపిన వివరాలు, లక్షణాలను బట్టి చూస్తే మీ నాన్నగారికి ప్రొస్టేట్ గ్రంథిలో పెరుగుదల ఉన్నట్టు అనిపిస్తున్నది. చాలామందికి ప్రొస్టేట్ గ్రంథి పరిమాణం పెరగడం వల్ల మీరు తెలిపిన సమస్యలు వస్తాయి. కాబట్టి మీరు ఈ సమస్యను నిర్ధారణ చేసుకోవాలి. ఇందుకోసం అల్ట్రాసౌండ్ స్కాన్ పరీక్ష చేయించుకోవాలి. ఈ పరీక్ష ద్వారా ప్రొస్టేట్ గ్రంథి పరిమాణం బ్లాడర్ పరిమాణం, కిడ్నీ మీద దాని ప్రభావం ఎంతవరకు ఉందో తెలుసుకోవచ్చు. ప్రొస్టేట్ పెరుగుదల సమస్య అందరిలో ఒకేలా ఉండకపోవచ్చు. కొందరిలో చాలాకాలం వరకు ఎటువంటి సమస్య ఉండకపోవచ్చు. ప్రొస్టేట్ పెరుగుతున్న తీరును బట్టి సమస్యలు మొదలవుతాయి.

నిర్ధారణ తరువాత ప్రొస్టేట్ చికిత్స చేయించుకోవాలి. మీరు తెలిపిన లక్షణాలు గల వారికి 80 శాతం మందులతో చికిత్స సరిపోతుంది. 20 శాతం మందికి మాత్రం సర్జరీ అవసరం అవుతుంది. మూత్రంలో రక్తం పడుతున్నప్పుడు ప్రొస్టేట్ గ్రంథి పూర్తిగా తీసివేయాల్సి ఉంటుంది. ఇదివరకు ప్రొస్టేట్ గ్రంథి పెరిగిన పరిమాణాన్ని అనుసరించి గ్రంథిలో కొంత భాగాన్ని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి తీసేవారు. కాని కొంత కాలానికి తిరిగి మొదలవ్వొచ్చు. కాని ఇప్పుడు పెరిగిన శాస్త్ర పరిజ్ఞానం వల్ల లేజర్ ద్వారా పూర్తిగా గ్రంథిని ఒకేసారి తీసివేయడం సాధ్యపడుతుంది. దీన్ని ట్రాన్స్ యురెత్రర్ రిసెక్షన్ ఆఫ్ ప్రొస్టేట్ (టీయూఆర్‌పి) చికిత్స అంటారు. దీని ద్వారా సమస్యను శాశ్వతంగా తొలగించవచ్చు.


డాక్టర్ పి. వంశీకృష్ణ
కన్సల్టెంట్ యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

హైకోర్టు విభజనపై నీలినీడ!



- సందేహాస్పదంగా మారిన ఏపీ సర్కార్ వైఖరి
- భవనాలను పరిశీలిస్తామన్న హైకోర్టు లేఖకు స్పందన లేదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టు విభజనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సందేహాస్పదంగా మారింది. ఈ ఏడాది జూన్ 2 నుంచి అమరావతిలోనే ఏపీ హైకోర్టు కార్యకలాపాలు నిర్వహించడానికి సకలం సిద్ధంచేస్తామని చెప్పిన ఏపీ రాష్ట్ర సర్కార్.. ఆచరణలో అడుగు ముందుకు వేయడం లేదు. 'ఏపీ హైకోర్టు కోసం అమరావతిలో తాత్కాలిక భవనాన్ని ఎంపిక చేశాం.. ఆ భవనాలను పరిశీలించి ఒకదానిని ఎంపిక చేస్తే హైకోర్టు నిర్వహణ కోసం మౌలికవసతులు మూడునెలల్లో పూర్తిచేస్తాం'.. అని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు గత ఏడాది డిసెంబర్ 27న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు లేఖ రాశారు. జనవరి రెండోవారంలోనే వచ్చి భవనాలను పరిశీలించాలని కూడా పేర్కొన్నారు. చంద్రబాబు లేఖ ఆధారంగా ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల సమావేశం నిర్వహించిన ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్.. ఆ భవనాల పరిశీలన కోసం కమిటీని ఏర్పాటుచేశారు. న్యాయమూర్తుల అభిప్రాయం మేరకు ఫిబ్రవరి మొదటివారంలో పరిశీలనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని ఏపీ సర్కార్‌కు ఉమ్మడి హైకోర్టు తరఫున లేఖ ద్వారా తెలియజేశారు. జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని న్యాయమూర్తుల కమిటీ ఫిబ్రవరి మొదటివారంలో అమరావతిలో ప్రభుత్వం ఎంపికచేసిన తాత్కాలిక భవనాలను పరిశీలిస్తుందని, అనంతరం న్యాయమూర్తులతో సమావేశమైన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని హైకోర్టు వర్గాలు పేర్కొన్నాయి. ఆ లేఖపై ఇప్పటివరకు ఏపీ సర్కార్ నుంచి స్పందన రాలేదు. తమ లేఖపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాని విషయాన్ని తనను కలిసిన రాయలసీమ న్యాయవాదుల బృందానికి ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ తెలియజేశారు. దీంతో ఈ ఏడాది జూన్ రెండో తేదీకల్లా అమరావతిలో తాత్కాలిక భవనంలో ఏపీ హైకోర్టు ఏర్పాటుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాధానం రాకపోవడంపై హైకోర్టు వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఏపీ సీఎం చంద్రబాబు లేఖలో అంశాలకు.. వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోతున్నది.

రాజకీయ కారణాలతోనే లేఖ?..

రాజకీయ కారణాలతోనే ఈ తతంగం జరిగిందా.. అనే అనుమానాలు బలపడుతున్నాయి. చంద్రబాబునాయుడు, కేంద్ర ప్రభుత్వం తీరుపై సందేహపడాల్సి వస్తున్నది. ప్రత్యేక హైకోర్టు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, న్యాయవాదులు, టీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఈ దఫా పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రత్యేక హైకోర్టు కోసం లోక్‌సభలో నిలదీస్తామని టీఆర్‌ఎస్ ఎంపీలు ముందుగానే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకవేళ సభకు అంతరాయం కలిగించిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగానే లేఖ రాసిందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏపీకి ప్రత్యేక హైకోర్టు కోసం తాత్కాలిక భవనాలు ఎంపిక చేసినట్టు ఏసీజేకు చంద్రబాబు లేఖ రాయడం, అదే విషయాన్ని ఏపీకి చెందిన కీలక వ్యక్తి మీడియాకు బహిర్గతపరచడం, తెల్లవారి పార్లమెంట్ సమావేశాల సమయంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి ఏసీజేకు చంద్రబాబు లేఖ గురించి వివరించడం తెలిసిందే. టీఆర్‌ఎస్ ఎంపీల ఆందోళనను సద్దుమణచడానికి, ఇతర రాజకీయ కారణాలతోనే ఈ తతంగమంతా జరిగిందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ముగ్గురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

- రాజేశ్వర్‌తివారీకి సీసీఎల్ఏ, స్మితాసబర్వాల్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు
- జోషికి సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
- త్వరలోనే ఐఏఎస్‌ల బదిలీలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు కీలకమైన శాఖల పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్కే జోషికి.. ఇప్పటివరకు ఆయన పనిచేసిన సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. సీఎస్ ఎస్పీసింగ్ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించిన సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) శాఖలను మరో ఇద్దరు అధికారులకు అప్పగించారు. పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీకి సీసీఎల్ఏ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎం ఆదేశాల మేరకు సీఎస్ జోషి ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా ఉత్తర్వులు జారీచేశారు.

అందరికీ పోస్టింగ్ ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం

రాష్ట్రానికి కొత్తగా పదిమంది కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారులు వచ్చారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉన్నది. కొన్ని జిల్లాలకు ఇంచార్జి కలెక్టర్లు ఉన్నారు. కొన్ని శాఖలు ఇంచార్జి పాలనలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఐఏఎస్‌ల బదిలీ చేస్తూ, అందరికీ పోస్టింగులు ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ తేదీ తర్వాత బదిలీలు ఉండే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

హోంగార్డుల రోజువారీ భత్యం రూ.675

- జీతాలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిన హోంశాఖ
- ప్రతి ఏప్రిల్ 1న వెయ్యి రూపాయలు పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీసుశాఖలో పనిచేస్తున్న హోంగార్డుల దినసరి భత్యాన్ని రూ. 400ల నుంచి రూ. 675కు పెంచుతూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది బుధవారం ఉత్వర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రానున్నాయి. హోంగార్డులకు పోలీసు కానిస్టేబుళ్లతో సమానంగా పలు సదుపాయాలు కల్పించారు. హోంగార్డులకు ఇకనుంచి ప్రతి ఏడాది ఏప్రిల్ 1వ తేదీన వెయ్యి రూపాయల జీతం పెరుగుతుంది. ట్రాఫిక్ విభాగంలో పనిచేసే హంగార్డులకు కానిస్టేబుళ్లతో సమానంగా 30శాతం గౌరవ వేతనం అందుతుంది. యూనిఫాం అలవెన్స్, మహిళా హోంగార్డులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు (ఇద్దరు పిల్లలు వరకు), భార్య డెలివరీ సమయంలో 15 రోజుల పితృత్వ సెలవులు (ఇద్దరు పిల్లలు వరకు) ఇస్తారు. బందోబస్తు సమయంలో కానిస్టేబుళ్లతో సమానంగా భోజనచార్జీలు, పోలీసు దవాఖానలో వైద్యసదుపాయాలు కల్పించారు. విధి నిర్వహణలో మరణించే హోంగార్డులకు ఇచ్చే ఇన్సిడెంటల్ చార్జీలను రూ.5వేల నుంచి 10వేలకు పెంచారు. ఇదిలాఉండగా, కుటుంబసభ్యులకు కూడా వర్తించేలా బీమా సదుపాయం, డబుల్ బెడ్రూం ఇండ్లలోనూ అవకాశం కల్పించేలా త్వరలో పత్యేకంగా ఉత్తర్వులు జారీ అవుతాయని రాజీవ్‌త్రివేది తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



ఇచ్చిన హామీ మేరకు హోంగార్డుల వేతనాలను పెంచిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు హోంగార్డుల అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నా. ముఖ్యమంత్రి సారథ్యంలో రూపొందించిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి. ఆ వరుసలోనే హోంగార్డులకు ఉత్తమ ఫలాలు అందాయి. సీఎంకు ఇచ్చిన హామీ ప్రకారం హోంగార్డులు కూడా రాష్ట్రానికి అద్భుతమైన సేవలు అందించాలి.

- శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే, హోంగార్డుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు

జీవితాంతం రుణపడి ఉంటాం



మాకు చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు జీవితాంతం రుణపడి ఉంటాం. గతంలో ఏ ప్రభుత్వం కూడా హోంగార్డులను పట్టించుకోలేదు. అధికారంలోకి రాగానే హోంగార్డుల వేతనాలను పెంచి వారి జీవితాలపై అధ్యయనం చేసిన సీఎం కేసీఆర్.. హోంమంత్రి, డీజీపీ, శ్రీనివాస్‌గౌడ్‌తో పలుమార్లు ప్రత్యేకంగా చర్చించారు. హామీ ఇచ్చిన ప్రకారం హోంగార్డులకు న్యాయంచేశారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

- రాజేందర్‌రెడ్డి, హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

బీసీలకు రిజర్వేషన్ల కల్పనలో వ్యవసాయ వర్సిటీ భేష్

వెనుకబడిన తరగతుల సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వెనుకబడిన తరగతులకు చెందినవారికి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలుస్తున్నదని వెనుబడిన తరగతుల సంక్షేమంపై ఏర్పడిన అసెంబ్లీ కమిటీ అభిప్రాయపడింది. విశ్వవిద్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు, ఉద్యోగుల నియామకం, అడ్మిషన్లలో రిజర్వేషన్లు అమలుచేయడంపై సభాసంఘం బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధికారులతో సమీక్షించింది. అనంతరం కమిటీ చైర్మన్ వీ గంగాధర్ గౌడ్.. కమిటీ సభ్యులు టీ ప్రకాశ్‌గౌడ్, సీ విఠల్‌రెడ్డి, ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్‌లతో కలిసి సమీక్షా వివరాలను మీడియాకు వెల్లడించారు. వర్సిటీలో 738 ప్రభుత్వ అనుమతి పొందిన టీచింగ్ పోస్టులు ఉండగా, వాటిలో ప్రస్తుతం 361 పోస్టులు భర్తీలో ఉన్నాయని, వారిలో 132 మంది బీసీ ఉద్యోగులు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. ఇది 36.5 శాతం అన్నారు. 918 నాన్‌టీచింగ్ పోస్టుల్లో 399 మంది బీసీలు ఉన్నట్టు చెప్పారు. విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం బీసీ సెల్‌ను ఏర్పాటుచేయాలని, డిగ్రీ సీట్లు పెంచడానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

మహిళల రక్షణకు మరిన్ని చర్యలు చేపట్టాలి

మహిళా కమిషన్ చైర్మన్ త్రిపురాన వెంకటరత్నం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా మహిళల రక్షణ కోసం మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ త్రిపురాన వెంకటరత్నం అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన జాతీయ మహిళా కమిషన్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధులు నిర్వర్తించే చోట స్త్రీలపై లైంగికవేధింపులు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ.. మహిళల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచి మహిళా కమిషన్ సభ్యులు సహా 40 మంది పాల్గొనగా అన్ని రాష్ట్రాల నుంచి ఆయా రాష్ట్రాల మహిళా కమిషన్ చైర్‌పర్సన్లు, కార్యనిర్వాహక సభ్యులు హాజరయ్యారు.

గ్రేటర్‌లో రూ.721.86 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో రూ.721.86 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పాలనా అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. బడ్జెట్ కేటాయింపులు కాకుండా 2017-18, తదుపరి సంవత్సరాల్లో రూ.500 కోట్ల ఆర్థిక మద్దతు ఉంటుందని పేర్కొన్నది. రూ.1500 కోట్ల మేర రుణాలను హెచ్‌ఆర్‌డీసీఎల్ పొందవచ్చని స్పష్టంచేసింది.

ఎన్‌ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా దినేశ్ శ్రీవాస్తవ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ దినేశ్ శ్రీవాస్తవ బుధవారం హైదరాబాద్‌లోని 'అణు ఇంధన సంస్థ' (ఎన్‌ఎఫ్‌సీ) నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరించిన జీ కల్యాణకృష్ణన్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన నుంచి శ్రీవాస్తవ బాధ్యతలను తీసుకున్నారు.

రైతుకు చేదోడుగా ప్రణాళిక

- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం
- 'మన కూరగాయల' అవుట్‌లెట్లను 100కు పెంచాలి
- మార్కెటింగ్ సదుపాయాలపై సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎకరానికి సీజన్‌కు రూ.4000 చొప్పున తెలంగాణ ప్రభుత్వం అమలుచేయనున్న పంట పెట్టుబడి పథకం, పెరుగనున్న సాగునీటి వసతి, పలు సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో తెలంగాణ రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు అవుతుందని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రైతులకు మరిన్ని ప్రయోజనాలు లభించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటకల్లో అమలవుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కార్యకలాపాలపై అధ్యయనం చేసి వచ్చిన మార్కెటింగ్ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి మంత్రికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మహారాష్ట్రలో గత ముప్పయ్ సంవత్సరాలుగా కాటన్ మార్కెటింగ్ కార్పొరేషన్ పనిచేస్తున్నట్టు మార్కెటింగ్ అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే ఆ రాష్ట్ర మార్కెటింగ్ సంస్థ కందులు కొనుగోలు చేసి, పప్పులుగా మార్చి మధ్యాహ్న భోజన పథకానికి, హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 'భావాంతర్ భుగ్తాన్' పేరిట అమలు చేస్తున్న కార్యక్రమాన్ని మంత్రికి వివరించారు. ఈ పథకం కింద కనీస మద్దతు ధర కన్నా మార్కెట్లో రైతులకు తక్కువధర పలికిన సందర్భాల్లో మిగతా డబ్బును నష్టపరిహారం కింద ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లిస్తున్నదని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. ధరల స్థిరీకరణ కింద రూ.4000 కోట్లను మధ్యప్రదేశ్ ప్రభుత్వం సమకూర్చిందని మార్కెటింగ్ అధికారులు చెప్పారు. హర్యానాలో ఉల్లి, టమాట, కాలిఫ్లవర్ వంటి కూరగాయలను పండించే ముందే ఆయా పంటలు, వాటి దిగుబడి అంచనాతో ప్రాథమిక ధరను ప్రభుత్వం ఖరారు చేస్తున్నట్టు వివరించారు.



రైతులకు మార్కెటింగ్ సదుపాయాలపై నాలుగు రాష్ట్రాల్లో అధ్యాయనం అనంతరం మంత్రి హరీశ్‌రావుకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు

మార్కెట్‌లో తేడావస్తే..

మద్దతుధర రానిపక్షంలో ప్రభుత్వం వివిధ పద్ధతుల్లో సహకరిస్తున్నదని, ఆర్థికసాయం అందిస్తున్నదని తెలిపారు. తాజా కూరగాయలతో నడుపుతున్న 'మనకూరగాయలు' అవుట్‌లెట్ల సంఖ్య 100కు పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

1.50 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలుచేయండి

- కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ
- అక్రమాలపై కొరడా, జనగామ మార్కెట్ కార్యదర్శిపై చర్యలు
- ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టాలని కలెక్టర్లకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఈ సీజన్‌కు సంబంధించి కందుల పంట దిగుబడి 2.84 లక్షల మెట్రిక్ టన్నులు వస్తాయని అంచనా నేపథ్యంలో 1.50 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కోరింది. ఈ మేరకు మార్కెటింగ్ మంత్రి హరీశ్‌రావు బుధవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాశారు. ఎంపీ జితేందర్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి పార్థసారథి ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రాధా మోహన్‌సింగ్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేయడంతో 1,13,600 మెట్రిక్ టన్నుల కందుల సేకరణకు అంగీకరిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. రాష్ట్రంలో కందుల దిగుబడి దృష్ట్యా కేంద్రం ఈ పరిమితిని సడలించి 1.50 మెట్రిక్ టన్నుల సేకరణకు ఆదేశించాలని తాజాగా రాసిన లేఖలో హరీశ్‌రావు కోరారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 83,650 మెట్రిక్ టన్నుల కందులను సేకరించారు. మార్క్‌ఫెడ్‌కు చెందిన 66, హాకాకు చెందిన 47 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ కొనుగోళ్లు జరిగాయి. మొత్తం కందుల కొనుగోళ్ల విలువ రూ.455 కోట్లు. కందులను కొనుగోలు చేసిన వెంటనే మార్క్‌ఫెడ్, హాకా సంస్థల అధికారులు గోడౌన్లను 'నాఫెడ్' సంస్థకు స్వాధీనపరుచాలని మంత్రి ఆదేశించారు. కందుల కొనుగోళ్లలో అక్రమాలు జరిగితే సహించబోనని హెచ్చరించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి కందుల కొనుగోలు కేంద్రాలపై నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జనగామ, భువనగిరిలో కందుల విక్రయాల్లో అవకతవకలు జరిగినందున జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌ను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.

బాధితులకు సత్వర న్యాయం అందాలి

మహిళా కానిస్టేబుళ్లకు హోంమంత్రి నాయిని సూచన ● 731 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్‌ఔట్ పరేడ్



బుధవారం ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్‌ఔట్ పరేడ్‌లో పాల్గొన్న హోంమంత్రి నాయిని, డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సహాయం కోరి స్టేషన్‌కు వచ్చేవారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం పెరిగిందని, హక్కుల కోసం పోరాడుతున్న నేటి పరిస్థితుల్లో వారితో బాధ్యతతో, స్నేహపూర్వకంగా మెలుగాలని సూచించారు. బుధవారం రావ్‌బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో తొమ్మిది నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 735 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్‌ఔట్ పరేడ్ జరిగింది. ఈ పరేడ్‌కు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్ల నుంచి వారు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధునీకరణ, నూతన సంస్కరణల దిశగా సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పోలీస్‌శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల క్షేమమే ధ్యేయంగా, వారి రక్షణే లక్ష్యంగా పనిచేసి పోలీస్‌శాఖ గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ప్రజల్లో పోలీసులపై ఉన్న భయాన్ని తొలిగించి, ఫ్రెండ్లీపోలీసింగ్‌తో వారికి మరింత చేరువ కావాలని నూతన కానిస్టేబుళ్లకు సూచించారు. ఒకేసారి 735 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరడం హర్షణీయమని, మహిళలపై జరుగుతున్న నేరాలు కట్టడి, వారి సమస్యల పరిష్కారానికి ఇది ఒక సూచన అని చెప్పారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ జితేందర్, పరేడ్ కమాండర్ జే మహేశ్వరి పాల్గొన్నారు.

చనాక-కొర్ట, తమ్మిడిహట్టికి లైన్ క్లియర్

- ఈ రెండు బరాజ్‌లతో వన్యప్రాణులకు హాని లేదు
- స్పష్టం చేసిన మహారాష్ట్ర వన్యప్రాణి మండలి
- ఫలించిన నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కృషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చనాక-కొర్ట, తమ్మడిహట్టి బరాజ్‌లకు మార్గం సుగమం అయ్యింది. ఈ రెండు బరాజ్‌లతో వన్యప్రాణులకు ఎలాంటి హాని కలుగదని మహారాష్ట్ర వన్యప్రాణి మండలి స్పష్టంచేసింది. ఈ ప్రాజెక్టుల పనుల వల్ల తమ పరిధిలో వన్యప్రాణులపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంటూ చనాక-కొర్ట బరాజ్‌కు సంబంధించి తిప్పేశ్వర్ వన్యప్రాణి కేంద్రం, తమ్మిడిహట్టికి సంబంధించి చాప్రాల్ వన్యప్రాణి కేంద్రం అనుమతి ఇచ్చాయి. దీంతో ఈ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని జాతీయ వన్యప్రాణి మండలికి మహారాష్ట్ర వన్యప్రాణి మండలి సిఫార్సు చేసింది. బుధవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన ముంబైలోని సహ్యాద్రి అతిథిగృహంలో జరిగిన మహారాష్ట్ర వన్యప్రాణి మండలి సమావేశంలో ఆదిలాబాద్ చీఫ్ ఇంజినీర్ భగవంతరావు ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై మండలి సంతృప్తి వ్యక్తంచేసింది. సమావేశంలో మహారాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్, తెలంగాణ నుంచి ఆదిలాబాద్ చీఫ్ ఇంజినీర్ భగవంతరావు, డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ శ్రీనివాస్, పెనుగంగ ఎస్‌ఈ అంజద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రెండు ప్రాజెక్టులతో ప్రయోజనాలివి..

లోయర్ పెన్‌గంగ - చనాక-కొర్ట బరాజ్

వినియోగించుకునే నీటి పరిమాణం : 5.12 టీఎంసీలు

లబ్ధి : పాత ఆదిలాబాద్ జిల్లా బేల, జైనథ్, ఆదిలాబాద్, తాంసి మండలాల పరిధిలోని 58 వేల ఎకరాలకు సాగునీరు. 98 గ్రామాలకు తాగునీరు.

ప్రాణహిత ప్రాజెక్టు - తమ్మిడిహట్టి బరాజ్

వినియోగించుకునే నీటి పరిమాణం: 1.800 టీఎంసీలు బరాజ్‌లో, 14.40 టీఎంసీలు రిజర్వాయర్లలో.

లబ్ధి: పాత ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇందులో కొన్ని మండలాల పరిధిలో లబ్ధి పొందే ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాల్లో)

కౌటాల : 12,452, **బెజ్జూర్** : 13,700, **రెబ్బెన:** 38,830, **తాండూరు:** 19,700, **దహేగాం** : 10,400, **భీమిని** : 21,500, **నెన్నెల** : 19,556, **బెల్లంపల్లి** : 7,870.

మంత్రి హరీశ్ హర్షం

మహారాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయంపట్ల నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు హర్షం వెలిబుచ్చారు. రెండు కీలక బరాజ్‌లకు కూడా మార్గం సుగమం కావడంతో గత కొన్నినెలలుగా హరీశ్‌రావు చేసిన కృషి ఫలించినట్టయింది.

కేంద్ర ఆర్థిక సర్వేలో తెలంగాణ టాప్

- ఇక్కడి పథకాలను ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి: గట్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామచంద్రరావు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు రాష్ట్రంలోని అభివృద్ధిని, పథకాలను అధ్యయనం చేస్తున్నాయని, ఆచరిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదనేందుకు ఇది నిదర్శనమని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం గట్టు రామచంద్రరావు మీడియా మాట్లాడుతూ.. 'వ్యవసాయరంగ అభివృద్ధిలోనూ దేశంలో రాష్ట్రం అగ్రస్థానాల్లో ఒకటిగా నిలిచింది. ఉత్పత్తిరంగంలో విదేశీ ఎగుమతుల్లో 70 శాతం ఎగుమతులు కలిగిన ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి కావడం గర్వకారణం' అని పేర్కొన్నారు. 'ప్రభుత్వం వ్యవసాయరంగానికి అన్ని సదుపాయాలు కల్పించింది. దీంతో విత్తనాల కోసం క్యూలు లేవు. క్యూలో తొక్కిసలాటలు లేవు. తొక్కిసలాటలో మరణాలు లేవు' అని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు చంద్రబాబు హెలిక్యాప్టర్‌లో తాపీ మేస్త్రీలను తీసుకెళ్లి ఒక ఇటుకవేసి సిమెంట్ పూస్తే, ఈ రోజు దేవాదుల ద్వారా యాసంగికి నీళ్లు అందిస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమ రంగాలను అభివృద్ధి చేస్తూ మంత్రి కేటీఆర్ యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారని టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ అన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణ వనరులను విదేశీ ప్రతినిధుల ముందు బలంగా వినిపించారని తెలిపారు. మంత్రి కేటీఆర్‌ను అభినందించాల్సింది పోయి విమర్శించడం పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తగదన్నారు.




తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామచంద్రరావు, టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

నేటి నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గురువారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇవి ఫిబ్రవరి 21వ తేదీ వరకు కొనసాగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రాక్టికల్స్ పరీక్షలకు 3,33,480 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణకు 6,410 ఎగ్జామినర్లను నియమించామని ఇంటర్‌బోర్డు తెలిపింది.

జీవకణమే చికిత్సకు ఆధారం

- సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా.. ముగిసిన జీవకణశాస్త్ర సదస్సు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీవకణమే భవిష్యత్ చికిత్సకు మూలంగా మారుతుందని, సెల్ థెరపీ విధానంలో వ్యాధుల నియంత్రణ జరుగుతుందని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయోలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ రాకేశ్ మిశ్రా పేర్కొన్నారు. ఔషధాల అవసరం అంతగా లేకుండానే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అయితే మరిన్ని పరిశోధనల ద్వారా దీనిని చేరువచేసేందుకు కృషి జరుగుతున్నదని చెప్పారు. హైదరాబాద్‌లోని లియోనియా రిసార్ట్స్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ జీవకణ శాస్త్ర సదస్సు బుధవారం ముగిసింది. ఐదురోజులపాటు జరిగిన ఈ సదస్సులో 30దేశాల నుంచి 1200మంది శాస్త్రవేత్తలు, వివిధ వర్సిటీల విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు ఉపాధి నైపుణ్య శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీసీ యువతీయువకులకు ఉపాధి నైపుణ్య శిక్షణ అందిస్తామని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనితరాజేంద్ర తెలిపారు. బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ కోసం పదోతరగతి ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

అనిశా వలలో ఏపీ తిమింగలం

- జీఎస్టీ కమిషనర్ లక్ష్మీప్రసాద్ ఆస్తులపై దాడులు.. విలువ 50 కోట్లు!
- తెలంగాణ, ఏపీలో 20 చోట్ల సోదాలు

హైదరాబాద్, అమరావతి, నమస్తే తెలంగాణ / దోమల్‌గూడ: ఏపీ వాణిజ్య పన్నులశాఖలో మరోసారి అవినీతి కలకలం రేగింది. ఆ రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న జీ లక్ష్మీప్రసాద్ ఆస్తులపై ఏపీ, తెలంగాణలో బుధవారం తెల్లవారుజాము నుంచి అవినీతి నిరోధకశాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి 20 ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు మొదలుపెట్టాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం ఆస్తుల విలువ దాదాపు రూ.ఆరుకోట్లని, మార్కెట్ ధరతో పోలిస్తే రూ.50 కోట్ల పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కాకరపల్లి గ్రామానికి చెందిన గెడ్డపు లక్ష్మీప్రసాద్ 1987లో వాణిజ్య పన్నుల శాఖలో అడుగుపెట్టి, సీటీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017 నుంచి విజయవాడలో జీఎస్టీ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారనే అభియోగంపై అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక బృందాలు లక్ష్మీప్రసాద్‌కు చెందిన విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్ ఆస్తులపై తనిఖీలు చేపట్టాయి. ఏపీ రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ జనరల్ ఆర్పీ ఠాకూర్ పర్యవేక్షణలో అనిశా దర్యాప్తు బృందాలతో పాటు సీఐయూ విభాగానికి చెందిన బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం 2 కోట్ల రూపాయల ఉంటుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇద్దరు భార్యలు అలివేలు, మల్లిక, అత్త అప్పలనర్సమ్మ, వదిన పేరుతో చాలా ఆస్తులు కూడగట్టుకున్నాడని అధికారులు గుర్తించారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో రెండో భార్య నివసించే లెజెండ్ అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. విజయవాడలోని ఆయన నివాసంలో జరిపిన తనిఖీల్లో పెద్దఎత్తున బంగారు ఆభరణాలు, వెండి సామాను లభ్యమైంది. 30 తులాల బంగారు ఆభరణాలు, కిలో బంగారానికి సంబంధించిన రశీదులు బయటపడ్డాయి. రెండు కార్లతో పాటు గచ్చిబౌలిలో రెండు వేల చదరపు అడుగుల్లో ఓ కమర్షియల్ భవనం, పరిగిలో నాలుగు ప్లాట్లు ఉన్నట్టు గుర్తించారు. విజయవాడ సీఆర్డీఏలో 60 సెంట్ల భూమి, గుంటూరులో 2 ఇళ్ల స్థలాలు, గోరంట్ల, విశాఖలో రెండు ఇండ్ల స్థలాలను గుర్తించినట్టు అధికారులు పేర్కొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు. (ఇన్‌సెట్) లక్ష్మీప్రసాద్

నమస్తే తెలంగాణ
రైతుబడి
[హైదరాబాద్]
గురువారం 1 ఫిబ్రవరి 2018





సేంద్రియ సాగు, సొంతంగా మార్కెటింగ్

మిర్యాలగూడెం మండల పరిధిలోని రాయినిపాలెం గ్రామంలో కె. శ్రీనివాస్‌రెడ్డి తనకున్న ఏడు ఎకరాల భూమిలో రెండు ఎకరాల వరకు పండ్ల తోటలు సాగు చేస్తున్నాడు. మిగిలిన భూమిలో ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. గతంలో ప్రైవేట్ ఉద్యోగం చేసిన శ్రీనివాసరెడ్డికి వ్యవసాయం అంటే ఆసక్తి ఎక్కువ. అందుకే ఉద్యోగానికి స్వస్తి పలికి వ్యవసాయం వైపు దృష్టి సారించాడు. ప్రకృతి వ్యవసాయం చేయాలనే ఉద్దేశంతో సుభాష్ పాలేకర్ సదస్సులలో పాల్గొనేవాడు. అక్కడ ప్రకృతి వ్యవసాయంపై మెళకువలు తెలుసుకున్నాడు. మూడు దేశీయ ఆవులను తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేయడం మొదలు పెట్టాడు. వాణిజ్య పంటలు, పండ్లతోటలు, కూరగాయలు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నాడు.

ఐదు అంచెల పద్ధతిలో ఎకరం విస్తీర్ణంలో జామ (థాయ్ రకం) 250 మొక్కలను, మునగ పీకేఎం1 రకం వంద మొక్కలను, సీతాఫలం (ఎస్ఎంకే-1) 400 మొక్కలను, దానిమ్మ (భగువ) 250 మొక్కలను, మామిడి (బంగినపల్లి) 100 మొక్కలను నాటాడు. అలాగే కూరగాయలు పది గుంటల్లో క్యారెట్ (పూసాకేసర్ రకం) వేశాడు. అన్నీ ఖర్చులు పోగా 25,000 వరకు సంపాదించాడు. ఆ క్యారెట్‌ను మార్కెట్‌లో అమ్మకుండా తానే సొంతంగా మిర్యాలగూడ పట్టణంలో సేంద్రియ ఉత్పత్తుల కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. తన షాపులోనే కిలోకు 20 రూపాయల చొప్పున అమ్మాడు. జామ తోట నుంచి 250 కేజీల దిగుబడి తీశాడు. ఈ కాయలను కిలో 60 రూపాయల చొప్పున అమ్మాడు. ప్రస్తుతం క్యారెట్‌తో పాటుగా క్యాబేజీ, ఆలుగడ్డ వేశాడు. అదేవిధంగా ఒక ఎకరంలో బంతి పూల సాగు చేపట్టాడు. ఇందులో అన్నీ ఖర్చులు పోగా దాదాపు ఎనభై వేల వరకు లాభం వచ్చినట్టు తెలిపాడు. వీటికి తోడు వేరుశనగ (K6 రకాన్ని) సాగుచేసి ఎకరంలో 500 కిలోల వేరుశనగ పండించాడు. వీటిని పల్లీలుగా మార్చి కిలో 160 రూపాయల చొప్పున అమ్మాడు. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉన్నది. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు వివరించాడు.



సేంద్రియ ఎరువుల తయారీ

ఆవుపేడ, ఆవుమూత్రం, కూరగాయల వ్యర్థాలను సేకరించి జీవామృతం తయారు చేసుకుని పంటలకు వినియోగిస్తున్నాడు. మార్కెట్‌లో పడేసిన కూరగాయల వ్యర్థాలతో ఎరువులు తయారు చేసే విధానాన్ని వివరించాడు. 25 కిలోల కూరగాయల వ్యర్థాలను 200 లీటర్ల నీటిలో వేయాలి. దానికి రెండు కిలోల బెల్లాన్ని కలుపాలి. ఇలా పదిహేను రోజుల పాటు కలిపితే ద్రావ ణం తయారవుతుంది. ఈ ద్రావణాన్ని 200 లీటర్ల నీటికి కలిపి డ్రిప్ ద్వారా అందించాను. దీంతో గణనీయమైన దిగుబడులు వచ్చినట్టు రైతు తెలిపాడు.

ఆవు పాలను రెండు లీటర్లు తీసుకుని వాటిని తోడు పెట్టి పెరుగు అయ్యాక అందులో చిన్న చిన్న రాగి (కాపర్) ముక్కలను వేసి ఉంచాలి. ఇలా పది రోజుల పాటు ఉంచాలి. ఆ పెరుగును మజ్జిగగా చేసి 200 లీటర్ల నీటికి లీటరు మజ్జిగ ద్రావణాన్ని కలిపి పంటలపై పిచికారీ చేయాలి. దీనివల్ల పంటలకు తెగుళ్లు దరిచేరవు. అలాగే వేస్టు డికంపోజర్‌ను ఒక బాటిల్ ను 50 లీటర్ల నీటిలో కలుపాలి. పది రోజులు నానబెట్టాలి. దానికి రెండు కిలోల బెల్లాన్ని కలుపాలి. ఆ కుళ్లిన వ్యర్థాలను డ్రిప్ ద్వారా పంటలకు అందించాలి. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయని శ్రీనివాస్‌రెడ్డి వివరించాడు. సేంద్రియ పద్ధతి గురించి మరి న్ని వివరాల కోసం తనను 7075000888 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని రైతులు తెలిపాడు.

-సుందరి సురేష్
మండలస్థాయి ఉద్యాన అధికారి, మిర్యాలగూడ,
8919844432

ఉద్యాన శాఖ సహకారం

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి నాలుగు ఎకరాలకు డ్రిప్ సౌకర్యం అందించాం. ఈ ఏడాది మల్చింగ్ పద్ధతిలో కూరగాయలు సాగు చేసేందుకు ప్రోత్సహించాం. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని చూసి ఇతర రైతులు ఈ పద్ధతివైపు మొగ్గు చూపుతున్నారు.



- సంగీత లక్ష్మి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

వరిలో సస్యరక్షణ

ప్రస్తుతం వరి పైరులో గత నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న మంచు, గాలిలో అధిక తేమ వాతావరణం వల్ల అగ్గితెగులు సోకడానికి చాలా అనువైన సమయం.



- ముఖ్యంగా సన్నగింజ రకాలైన బి.పి.టి. 5204. హెచ్.ఎమ్.టి, జై శ్రీరామ్ వంటి రకాల్లో నూలు కండె ఆకారంతో గోధుమ రంగు మచ్చలు గమనించాం. దీని ఉధృతి ఇంకా పెరిగి ఇతర దొడ్డు గింజ రకాలకు కూడా ఆశించే అవకాశం ఉన్నది. దీని నివారణకు గాను ట్రైసైక్లజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ.లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటర్ నీటికి చొప్పున కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- యాసంగిలో వరి నాట్లు ఆలస్యమైనప్పుడు 40-60 రోజుల్లోపు పైరులో వరి ఈగ ఆశించడం వల్ల ఆకులు తెల్లగా సన్నగా పెరిగి అక్కడక్కడ నొక్కులు ఏర్పడి ఆకుల అంచుల దగ్గర రంధ్రాలు ఏర్పడుతాయి. అంతేకాకుండా చిర పొట్టదశలో ఉన్న పైరును ఆశించినప్పుడు వెన్ను లోని గింజలు పాలుపోసుపోక పాక్షికంగా తాలుగా మారుతాయి. యాసంగిలో రాష్ట్రంలో వరి ఈగ ఉధృతి ఏటా పెరుగుతున్నది.
- ఆకుముడుత పురుగు ఆశించిప్పుడు ఆకులు నిలువుగా ముడుచుకొని తెల్లని గీతలు ఏర్పడుతాయి. ఆకుముడుతలు విడదిస్తే లేత పసుపు లేదా ఆకుపచ్చ లార్వాలు ఉంటాయి. అదే విధంగా పొలంలో గుంపులు, గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులు కనబడుతాయి. దీని ఉధృతి ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు లేదా బెట్ట పరిస్థితులు, పొడి వాతావరణంలో ఎక్కువ అవుతుంది. దీని నివారణకు గాను ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ (20 డబ్ల్యుడిజి) 0.25 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 480 యస్.సి 0.1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- చౌడు నేలలో, మురుగు నీరు పోయే ఏర్పాటు లేనటువంటి పొలంలో వరి పండుబారి పైరు లోని ముదురు ఆకులు పండుబారి పోవటం లేదా లేత ఆకులు పైనుంచి ఎండిపోవటం సర్వసాధారణం. దీనికితోడు వేర్లు కుళ్ళి నల్లగా మారుతాయి. దీని నివారణకు పొలంలో మురుగు నీరు పోయే సౌకర్యాన్ని ఏర్పర్చి ఆరుతడుల మాదిరిగా వరిని పెంచా లి. పైపాటుగా వేసే యూరియాతో పాటు 30-35 కిలోలకు 100 గ్రా. కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ కల్గిన మిశ్రమ శిలీంధ్ర నాశిని పట్టించి బురద పదునులో వేసి కలియబెట్టి నివారించవచ్చు.



ఆర్. జగదీశ్వర్,
ప్రధాన శాస్త్రవేత్త (వరి)
వరి పరిశోధన కేంద్రం,
రాజేంద్రనగర్
8179540261

మామిడిలో అంతరపంటగా అల్లం సాగు చేస్తే ఎంతో లాభసాటిగా ఉంటుంది. దీని వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. మామిడిలో సకాలంలో పూత నిల్వకపోవటం, అలాగే పిందె కూడా రాలడం వల్ల రైతులు నష్టపోతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మామిడిలో అంతరపంటగా అల్లం సాగు చేసి లాభాలను గడించవచ్చు. ఎకరాకు 12టన్నులు అల్లం పండిస్తూ, టన్నుకు రూ.25వేల చొప్పున మొత్తం రూ.3లక్షలు రాబడి పొందవచ్చు. సగం ఖర్చు పోగా సగం రూ.1.50లక్షలు లాభం వస్తున్నది.

మామిడిలో అంతర పంటగా అల్లం సాగు



వాతావరణం...

తేమతో కూడిన వేడి వాతావరణం అనుకూలం. పాక్షికంగా ఉన్న ప్రాంతాల్లోనూ అల్లం పెరుగుతుంది. సముద్రమట్టానికి 1500 మీ. ఎత్తు వరకు గల ప్రదేశాలలో అల్లం పంటను సాగు చేసుకోవచ్చు. అల్లం పండించడానికి 19డిగ్రీ - 28 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అనుకూలం. అధిక సూర్యకాంతి, వర్షపాతం, తేమ గల వాతావరణంలో మంచి దిగుబడులు వస్తాయి. నీటి వసతి విస్తరించి ఉన్న ప్రదేశాలు అల్లం సాగుకు అనుకూలం. ఎర్ర, చెల్కా, గరప నేలలు కూడా అనుకూలమే. బరువైన బంక మట్టి నేలలు, నీరు నిలిచే నేలలు అల్లం సాగుకు పనికిరావు. అల్లం వేర్లు, దుంపలు నేలలో 25 సెం.మీ లోతులో విస్తరించి ఉంటాయి. కాబట్టి కనీసం 30సెం.మీ లోతుగల సారవంతమైన, గుల్ల నేలలు అల్లం సాగుకు అనుకూలం. పి.హెచ్ విలువ 6.0 - 6.5 ఉన్న నేలల్లో దిగుబడి వస్తున్నది.



విత్తేకాలం...

సాధారణంగా అల్లం పంట కాలపరిమితి 9-10నెలలు. అల్లం దుంపలు ఏప్రిల్-మే నెలల్లో నాటుకుంటే డిసెంబర్-జనవరి మాసాల్లో తవ్వకానికి వస్తాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి మే నెలాఖరిలోగా విత్తుకోవాలి. అంతేగాక మే నెలలో విత్తుకోవాలంటే నీటి వసతి ఉండాలి. ప్రాంతాల వారీగా విత్తే సమయంలో పెద్దగా మార్పులు ఉండవు. దుంపలను విత్తేందుకు వర్షపాతం లేదా నీటి వసతి కావాలి. దుంపలను నైరుతి రుతుపవన కాలంలో ముందుగా విత్తుకోవడం చాలా మంచిది. దీనివల్ల వర్షాలు పడే లోపల మొక్కలు భూమిలో బాగా నిలదొక్కుకొని పెరిగి ఉంటాయి. అనంతరం అధిక వర్షాలు పడినాగాని మొక్కలు నిలబడగలుగుతాయి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు లేదా భూమి తయారీ ఆలస్యమైనప్పుడు మే ఆఖరు వరకు కూడా విత్తుకోవచ్చు. విత్తటం ఆలస్యమైతే దుంపకుళ్లు ఎక్కువగా రావడమే కాకుం డా దిగుబడులు తగ్గుతాయి. రాష్ట్రంలో మారన్ రకాన్ని అధికంగా సాగు చేస్తున్నారు. ఆరోగ్యకరంగా ఉండి, 2-3 మొలకలు వచ్చి 40-50 గ్రా. బరువున్న దుంపలను విత్తనం కింద వాడుకోవచ్చు. విత్తే దూరం, రకాన్ని బట్టి 600-1000 కిలోల విత్తనం ఒక ఎకరంలో నాటడానికి అవసరం ఉంటుంది.

విత్తన ఎంపిక, విత్తనశుద్ధి

తెగుళ్ల సోకని పంట నుంచి, బలమైన విత్తన దుంపలను ఎంపిక చేసుకోవాలి. దుక్కులు లోతుగా దున్నుకోవాలి. తర్వాత కల్టివేటర్‌తో దున్ని ఎకరానికి 10టన్నుల పశువుల ఎరువు, ఒక టన్ను వర్మి కంపోస్టు వాడాలి. కల్టివేటర్‌తో దున్నటం వల్ల పశువుల ఎరువు, వర్మికంపోస్టు పూర్తిగా భూమిలో కలిసిపోతాయి. బెడ్ మేకర్‌తో బోదెలు 4ఫీట్లు వెడల్పు, 9 ఇంచుల ఎత్తు, 2 బోదెల మధ్య 120 సెం. మీ. ఉండేటట్లు బెడ్ తయారు చేసుకోవాలి. మొలకొచ్చిన దుంపలను సుమారు 30-35 గ్రా. బరువు ఉండేట్లు ముక్కలుగా చేయాలి. బెల్లం లేదా పసుపు వండే కడాయిల్లో తగినంత నీరు పోసి లీటరు నీటికి 3గ్రా. రిడోమిల్ యం-జడ్ లేదా 3గ్రా. మ్యాంకోజెబ్, 5మి.లీ. మలాథియాన్ చొప్పున కలిపి ఆ ద్రావణంలో దుంపలను 30-40 నిమిషాలు నానబెట్టాలి. రిడోమిల్ యం.జడ్‌తో విత్తనశుద్ధి చేసిన తరువాత మ్యాంకోజెబ్ కన్నా మెరుగుగా దుంపకుళ్లును అరికట్టవచ్చు. తరువాత తీసి నీడలో ఆరబెట్టాలి. కొత్తగా నీరు తీసుకొని లీటరు నీటికి ట్రైకోడెర్మావిరిడి 8-10 గ్రా. చొప్పున కలిపి ఆ ద్రావణంలో ఈ దుంపలను 30-40 నిమిషాలు నానబెట్టాలి.

తెగుళ్లు - రక్షణ చర్యలు

దుంపకుళ్లు తెగులు : అధిక నష్టం చేసే ఈ తెగులు వల్ల ఎకరాకు 10-20 క్వింటాలు దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నది. మురుగునీటి కలువలు లేకపోతే దుంపకుళ్లు సమస్య తీవ్రమవుతుంది. 50శాతం వరకు దిగుబడులు తగ్గుతాయి. ఎక్కువ వర్షపాతం, నీరు నిలిచే పరిస్థితులు ఈ తెగులుకు అనుకూలం. భూమిలో, కొమ్మలపై ఈ వ్యాధికారక శిలీంధ్రాలు నీరు ద్వారా వ్యాపిస్తాయి. ఈ తెగులు ఆశించిన దుంపలు మెత్తగా అవుతాయి. చర్మం పదులుగా ఉండి ఊడి వస్తుంది. తెగులు ఉధృతి ఎక్కువవైనప్పుడు మొక్కలు ఎండి పడిపోతాయి. నిల్వలో కూడా ఈ తెగులు ఉధృతి పెరిగి దుంపలు కుళ్లిపోతాయి. దీని నివారణకు ఆరోగ్యవంతమైన తెగులు సోకని దుంపలను నాటడానికి ఎన్నుకోవాలి. విత్తనశుద్ధి పాటించాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వేపపిండి ఎరువును వేసుకోవాలి, సరైన ఎరువు యాజమాన్యం పాటించాలి. తెగులు సోకిన మొక్కల మొదళ్లలో మెటలాక్సిల్ లేదా మ్యాంకోజెబ్ 5గ్రా. లీటరు నీటిలో కలుపుకొని పోసుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. , లేదా ట్రైకోడెర్మా విరిడి 5గ్రా. లీటరు నీటిని కలిపి తెగులు సోకిన మొక్కల చుట్టూ ఉన్న 4-5 మొక్కలకు, వరుసల్లోని పాదులను ముందుగా తడుపడం వల్ల దుంప కుళ్లు ఉధృతిని తగ్గించుకోవచ్చు.

దుంపకుళ్ల ఈగ

దీని పిల్ల పురుగులు మెత్తని కళ్లు ఆశించిన దుంపలను, కాండాన్ని తొలిచి లోపలి పదార్థాన్ని తినడం వల్ల మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు వేడి వాతావరణంలో దుక్కులు లోతుగా దున్నాలి. దుంప కుళ్లను తట్టుకునే, పీచు తక్కువగా ఉండే అల్లం రకాలను సాగు చేయాలి. మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేసి, నీరు నిల్వకుండా చేయాలి. ఎకరాకు 10కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను సన్నటి ఇసుకతో కలిపి తోటంతా సమంగా చేసుకోవాలి.

-గుండెల రాజు,
మహబూబాబాద్ అగ్రికల్చర్
7288985757

లాభసాటి సాగు



మామిడిలో అంతర పంటగా అల్లం సాగు లాభాలుంటాయి. రాష్ట్రంలో పది వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. మామిడిలో సకాలంలో పూత నిల్వక, పిందె రాలడం వల్ల నష్టం జరుగుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా మామిడిలో అంతర పంటగా అల్లం సాగు చేస్తే లాభాలను గడించవచ్చు. ఆరోగ్యవంతమైన తెగులు సోకని దుంపలను నాటాలి. తప్పకుండా విత్తనశుద్ధి చేయాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- కె. సూర్యనారాయణ
జిల్లా ఉద్యాన శాఖ అధికారి,
మహబూబాబాద్ 83744 49066

వరికి ఆరుతడి మేలు

వ్యవసాయంలో ఎలాంటి ప్రగతి సాధించాలన్నా వరి సాగులో నీటి నియంత్రణ సాధించినప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది. సాగు కోసం ఉపయోగించే నీటిలో సింహభాగం వరి సాగుకు కేటాయించబడుతున్నాయి. దీంతో భూములకు కనీస నీటి వసతి లేకుండా వాటి నుంచి ఎలాంటి ఉత్పాదకత లేకుండా వృథాగా ఉంటున్నాయి. వరిలో నీటి నియంత్రణ లేకుండా నీటిని వినియోగించడం వల్ల పొదుపుగా వాడాల్సిన జలాశయాలు త్వరగా ఖాళీ అవుతున్నాయి. భూగర్భ జలాలు కూడా అడుగంటిపోతున్నాయి. ప్రస్తుతం మనం వాడుతున్న రీతిలో వరి సాగుకు ఇంత నీటిని వినియోగించవలసిన అవసరం ఉన్నదా?

నిజానికి ఈ విధంగా వరిసాగు కోసం ఈ స్థాయిలో నీటిని తప్పనిసరిగా పెట్టాలా? ఈ విధంగా నీటిని పెట్టడం వల్ల వరి దిగుబడి పెరుగుతుందా.. ఆలోచించాలి. శాస్త్రీయంగా ఆలోచించినప్పుడు.. వరి సాగుకు ఇప్పుడు అందరూ వాడుతున్న స్థాయిలో నీటిని పెట్టాల్సిన అవసరం లేదు. నిజానికి తక్కువ నీటితోనే దిగుబడి పెరుగుతుందని అనుభవాలు చెబుతున్నాయి. 1) వరిలో ఆరు తడి పెట్టిన కొద్దీ వరి మొక్క పాదభాగం (కింది భాగం) నీటిలో మునిగి ఉండదు. కాబట్టి కింది భాగానికి గాలి, వెలుతురు తగిలి పిలక ఎక్కువ వస్తుంది. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది. వరిలో పొలాన్ని ఆరబెట్టిన కొద్దీ భూమిలో మట్టి కణాలకు వాతావారణ పీడనం ద్వారా గాలిలోని ప్రాణవాయువు (ఆక్సిజన్) చేరుతుంది. ఆక్సిజన్ ఎక్కువ అందితే వేరు వ్యవస్థ తేమను వెతుక్కుంటూ నిట్టనిలువుగా అడుగులోతు వరకు విస్తరిస్తుంది. వేర్లు ఎంత లోతుకు విస్తరిస్తే అంత తేమను పోషకాలను తీసుకొని మొక్క దృఢంగా ఎదుగుతుంది. మొక్క తీసుకోలేని భూమిలోని పోషకాలను సూక్ష్మజీవులు ప్రాణవాయువు దొరుకగానే కరిగించి అందిస్తాయి.

పొలాన్ని కొత్తగా అచ్చు కట్టినపుడు చిన్న మళ్ళను పెద్ద మళ్ళుగా మార్చటానికి దిగదోలినపుడు, కింది మట్టి, పై మట్టి ఒకే రకమైనదైనా ఆ సంవత్సరం దాకా ఆ మట్టిలో మొక్క గిడసబారి సరిగా ఎదుగదు. ఇలాంటి సందర్భాల్లో పెద్ద నాగలితో లోతైన దుక్కి దున్నినప్పుడు వాతావరణ పీడనం ద్వారా గాలిలోని ప్రాణవాయువు ఎంతమేరకు భూమిలో సూక్ష్మరంధ్రాల్లోకి చొప్పించగలదో అంతమేరకే సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమి సారవంతంగా మారుతుంది.

వరి పొలానికి ఆరుతడి నిడివి (గ్యాప్) ఎంతగా పెంచగలిగితే అంతగా బ్రీతింగ్ ప్లేస్ అందుబాటులోకి తెస్తున్నట్లు రైతులు భావించాలి. అదే కలుపును అదుపులో ఉంచటానికి నీరు నిల్వ ఉంచితే, మట్టిలోని సూక్ష్మరంధ్రాలు నీటి అణువులతో మూయబడి, వేరు వ్యవస్థ ప్రాణవాయువు అందుబాటులో లేక వేరు వ్యవస్థ మొత్తం భూమి ఉపరితలంలోనే సమాంతరంగా పరుచుకుంటుంది. ఏ మాత్రం తడితప్పినా, నీరు ఇవ్వలేని పరిస్థితి వచ్చినా వెంటనే భూమి పైపొర ఎండుతుంది. అప్పుడు వేరు వ్యవస్థ మొత్తం భూమి ఉపరితలంలో ఉంటుంది కాబట్టి నీరు అందక ఎండిపోతుంది.ఈ స్థితిలోనే రైతులు వరికి నీరు ఎక్కువ అవసరం అనుకుంటారు. నిజానికి నీరు ఇప్పుడు పెడుతున్న స్థాయిలో నీరు అవసరం లేదు. వేరువ్యవస్థ లోతుకు పోతే నిజానికి వరిపొలాన్ని ఆరబెట్టడం వల్ల మాత్రమే ఎక్కువ పంట వస్తుంది. నీరు ఎక్కువ పెట్టడం వల్ల వరి పొట్ట దశ వచ్చేసరికి 70 శాతం వేర్లు కుళ్ళిపోతాయి. మిగతా 30 శాతం వేర్లు పై మొక్కకు శక్తి అందించలేవు. దీంతో వరి కంకికి సరిపోయేంత నీరు అందక మొత్తంలో గింజలు తయారుగాక, తాలు శాతం పెరుగుతుంది. వరికి నీటిని అధికంగా వాడిన కొద్దీ నీటిపై దోమలు గుడ్లు పెట్టి దోమ పోటు, సుడి తెగులు, దుబ్బలు పాయటం, నీటిలో చల్లదనం వలన జింక్ లోపాలు ఇలా ఎన్నోరకాలైన సమస్యలు ఉత్పన్నమౌతాయి. అదే ఆరుతడులు పెడితే గట్లు మెత్తబడవు, భూసారం కొట్టుకుపోదు. ఆరుతడులతో మరిన్ని లాభాలు ఏంటంటే.. పొలంలో చిత్తడి ఉండదు కాబట్టి దుబ్బుల మధ్యలో కప్పలు, పక్షులు, పిల్లులు ఇలా ఎన్నో రకాలైన జీవజాతులు వాటి మధ్య స్వేచ్ఛగా తిరుగుతూ జీవ నియంత్రణ సాధ్యపడుతుంది. జీవవైవిధ్యం కాపాడబడుతుంది. ఆరుతడి పంట వాతావరణ మార్పులను తట్టుకుంటుంది.

ఆరుతడులు పెట్టిన వరిపొలంలో ఏర్పడిన అధిక దుబ్బు, వేర్లు లోతుల్లోకి విస్తరించుట మూలానా పంట కోసిన తర్వాత భూమిలో అల్లుకుపోయిన వేరు వ్యవస్థ ఆ భూమిని కలియదున్నినప్పుడు, కారుకారుకు టన్నులకొద్దీ సేంద్రియ పదార్థం భూమిలోకి చేర్చబడి భూమి సారవంతమౌతుంది. ఎలాంటి రసాయన ఎరువులు గాని సేంద్రియ ఎరువుల గాని బయట నుంచి తేకుండా పంట అవశేషాలే సేంద్రియ ఎరువులా మారుతాయి. ఆరుతడి వల్ల భూమి తన సొంత స్వరూపాన్ని పొందుతుంది. వరికి ఏ దశలోనైనా ఆరుతడులనే అనుసరించాలి.

ఇదే విషయాన్ని 2016-2017 యాసంగి సీజన్ నిరూపించింది. దీనిపై పరిశోధనలు, పరిశీలనలు అవసరం లేదు. వరికి ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉంచుట వల్ల నీటిలోని చల్లదనం వరి మొక్క ఎదుగుదలను అడ్డుకుంటుంది. మొక్క సూర్యకిరణాల నుంచి గ్రహించిన సౌరశక్తి ఆకుల ద్వారా కిరణజన్యసంయోగ క్రియ ద్వారా తయారుచేసుకొనిన శక్తి మొత్తం కూడా మొక్క తననుతాను వెచ్చబరుచుకొని మొక్క బతికేందుకే ఉపయోగపడుతుంది తప్ప మొక్క ఎదుగుదలకు, గింజ తయారీకి ఉపయోగపడదు. ఆరుతడులు పెడితే సౌరశక్తి మొత్తం మొక్క ఎదుగుదలకు, గింజ తయారీకి ఉపయోగపడుతుంది.

ఈ విషయాలన్నీ రైతుల్లో విస్తృతంగా ప్రచారం అయితే ఎంతో మేలు. తక్కువ నీటితోనే ఎంతో వరి పంటను లాభసాటిగా పండించవచ్చు. పక్క పొలాలు పంట మార్పిడికి అవకాశం ఏర్పడుతుంది. భూసారం పెరుగుతుంది.. భూమి మురగటం వలన విడుదలయ్యే మీథేన్ వాయువు వెలువడదు. జీవ వైవిధ్యాన్ని కాపాడవచ్చు. ఈ పద్ధతితో వరిని పూర్తిస్థాయిలో సేంద్రియ వ్యవసాయంలోకి మార్చవచ్చు.

- కలగా మట్టపల్లి నర్సింహమూర్తి
9701823838



రైతుబడికి ఆహ్వానం

రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంటవిధానాలకు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతుసోదరులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.



రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. raithubadi@ntdaily.news, Fax-040-23291118

నమస్తే తెలంగాణ

చిత్రం

[హైదరాబాద్]

గురువారం 1 ఫిబ్రవరి 2018

సాహసాల 'సాహో'



ప్రభాస్

'బాహుబలి' చిత్రం ప్రభాస్‌కు సరికొత్త ఇమేజ్‌ను తీసు కురావడమే కాక దేశవ్యాప్తంగా అభిమానగణాన్ని సంపాదించిపెట్టింది. ధీరత్వం, అసమాన పోరాటపటిమ కలబోసిన పాత్రలో ఆయన ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్నారు. దాంతో ప్రభాస్ తాజా చిత్రం 'సాహో' కోసం ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో కూడా ప్రభాస్ శక్తివంతమైన పాత్రలో కనిపిస్తాడని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన యాక్షన్ సీక్వెన్స్‌పై ప్రభాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడట. స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ సినిమా పోరాట ఘట్టాల రూపకల్పనకు విదేశీ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. యాక్షన్ ఘట్టాల్లో రోడ్లపై ఛేజింగ్ సీక్వెన్స్, నీటిలో సాహస విన్యాసాలు, గాలిలో అబ్బురపరిచే డైవింగ్ అంశాలు వుంటాయని తెలుస్తున్నది. వీటిలో పరిపూర్ణత కనబరిచేందుకు ప్రభాస్ నిపుణుల వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడట. ముఖ్యంగా స్క్యూబా డైవింగ్ కోసం విదేశాలకు వెళ్లి ఓ ట్రెయినర్ సమక్షంలో తర్ఫీదు పొందాడట. 'సాహో' చిత్రంలో పోరాటాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయని చిత్ర బృంద చెబుతున్నది. 'బాహుబలి'నాకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అభిమానులు నా నుంచి శక్తివంతమైన పాత్రల్ని ఆశిస్తున్నారు. 'సాహో' ద్వారా గొప్ప అవకాశం లభించింది. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్ కోసం చాలా శ్రమిస్తున్నాను' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు ప్రభాస్. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 'సాహో' చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది.

'తొలిప్రేమ' డేట్ మారింది



బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, దిల్‌రాజు

'తొలి ప్రేమ, ఇంటిలిజెంట్ సినిమాల్ని నిర్మాతల మధ్య సమాచారం లోపం వల్లే ఒకే రోజున విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. అంతేకానీ పోటీపడాలనే భావన మాలో లేదు. ఆ ఆలోచనతోనే 'తొలి ప్రేమ' సినిమాను ఈ నెల10న విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం' అని అన్నారు దిల్‌రాజు. బుధవారం హైదరాబాద్‌లో నిర్మాతలు దిల్‌రాజు, బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'హీరోల సంఖ్య పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతివారం పలు సినిమాల్ని విడుదలచేయాల్సి వస్తున్నది. నిర్మాతగా, పంపిణీదారుడిగా మరొకరితో పోటీ పడటం నాకు ఇష్టం ఉండదు. 'ఇంటిలిజెంట్'ను ఫిబ్రవరి 9న విడుదలచేస్తున్న విషయం మాకు తెలియదు. ఆ రోజున వస్తున్నట్లు వారు అధికారికంగా ప్రకటించలేదు. వారి సినిమా గురించి తెలియకపోవడం, అనుకూలమైన తేదీ కావడంతో మేము అదే రోజున రావాలని నిర్ణయించు కోవడం జరిగింది. ఈ విషయమై సి కల్యాణ్‌తో సంప్రదింపులు జరిపాం. సమాచారం లోపం వల్ల ఏర్పడిన ఈ సమస్యను నివృత్తి చేయడానికే ఒకరోజు ఆలస్యంగా ఈ నెల 10న మా సినిమాను విడుదల చేస్తున్నాం. గత ఏడాది పంపిణీ దారుడిగా చేదు అనుభవాల్ని ఎదుర్కొన్నాను. ఈ ఏడాది 'భాగమతి' చక్కటి శుభారంభాన్నిచ్చింది. ఆ విజయపరంపరను ఈ సినిమాతో కొనసాగిస్తాననే నమ్మకముంది' అని తెలిపారు. 'ప్రేమికుల రోజు వారాంతంలో వస్తే బాగుంటుందనే ఆలోచనతో ఫిబ్రవరి 9న రావాలని అనుకున్నాం. కానీ అదే సమయంలో 'ఇంటిలిజెంట్' విడుదల చేస్తున్న విషయం మాకు తెలియదు. అభిమానుల్లో ఉన్న అసంతృప్తిని దూరం చేయడానికే ఈ నెల 10న విడుదల చేస్తున్నాం' అని బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ తెలిపారు.



ఇషా, అనుష్క, నిత్యామీనన్, కీరవాణి, ప్రశాంతి, రాజమౌళి, ప్రశాంత్, నాని, కాజల్, ప్రియదర్శి, రెజీనా

నిర్మాతలపై గౌరవాన్ని పెంచిన సినిమా!

'హీరోగా కెరీర్ మంచి దశలో ఉన్న సమయంలో నిర్మాతగా మారడం అవసరమా అని చాలా మంది సలహా ఇచ్చారు. లాభాల కోసమే ఈ సినిమా చేస్తున్నానని అనుకున్నారు. కానీ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చిత్రనిర్మాణం చాలా కష్టమైన పని అని ఈ సినిమా మొదలుపెట్టిన తర్వాతే అర్థమైంది. నిర్మాతలపై గౌరవం పెరిగింది' అని అన్నారు నాని. ఆయన సమర్పకుడిగా వ్యవహరిస్తున్న చిత్రం 'అ!'. కాజల్ అగర్వాల్, నిత్యామీనన్, రెజీనా, ఇషా ప్రధాన పాత్రల్లో నటించారు. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి నిర్మిస్తున్నారు. ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. రాజమౌళి, కీరవాణి, అనుష్క సంయుక్తంగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదలచేశారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ 'నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులు కలిసి చేసిన సినిమాఇది. ట్రైలర్ చూడగానే విడుదలకు ముందుగానే సినిమా చూడాలన్న ఆసక్తి నాలో మొదలైంది. నాని సినిమా అంటే గ్యారెంటీ హిట్టనే నమ్మకముంది. ప్రస్తుతమున్న స్థాయిని దాటి మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని నానితో ఒకరోజు చెప్పాను. ఆ తర్వాత చేపలా కనిపించి ఆశ్చర్యపరిచాడు. ఇందులో ఏదో కొత్తదనం ఉంది కాబట్టే రెజీనా, నిత్యామీనన్, కాజల్ లాంటి ప్రతిభావంతులైన నటులు ఈ సినిమాలో ఉన్నారు. తెలుగులో ఓ ట్రెండ్‌సెట్టర్‌గా ఈసినిమా నిలుస్తుంది' అని చెప్పారు. తొలి రోజు మొదటి ఆటకే ఈసినిమా చూడాలనుందని అనుష్క చెప్పింది. నిత్యామీనన్ మాట్లాడుతూ 'సార్వజనీన కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. దర్శకుడు ప్రశాంత్‌వర్మ కథ చెప్పగానే ఒక క్షణం కూడా ఆలోచించకుండా సినిమాలో నటిస్తానని చెప్పాను. ఇలాంటి విభిన్న కథాంశంతో తెలుగులో సినిమా రావడం మంచి పరిణామం' అని చెప్పింది. కథ చెప్పినప్పుడే తన పాత్ర అద్భుతంగా అనిపించిందని రెజీనా పేర్కొన్నది. తన కెరీర్‌లోనే విభిన్నమైన ప్రయత్నమిదని, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం మిళితమై ఉంటుందని కాజల్ అగర్వాల్ చెప్పారు. నాని మాట్లాడుతూ 'చేప పాత్రకు వాయిస్ ఓవర్ కోసం వచ్చి ప్రశాంత్‌వర్మ నాకు ఈ కథ వినిపించాడు. కథలోని కొత్త దనం నచ్చడంతో నేనే నిర్మాతల్ని వెతికిపెడతానని అతడికి చెప్పాను. తొలుత ఇద్దరు, ముగ్గురు నిర్మాతల్ని అనుకున్నాను. కానీ వారిని ఎలా సంప్రదించాలో, సినిమా గురించి ఏం చెప్పాలో అర్థంకాలేదు. 'నిన్నుకోరి' సినిమాలోని 'అడిగా అడిగా..' పాట చిత్రీకరణ సమయంలో సెట్స్‌లో ప్రశాంత్‌వర్మ కనిపించాడు. షూటింగ్ గ్యాప్‌లో వచ్చి నేనే సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తానని చెప్పాను. సినిమాల ద్వారా కాకుండా నేను సంపాదించుకున్నది ఒక్క రూపాయి కూడా లేదు. సినిమానే నాకు అన్ని ఇచ్చింది. ఇలాంటి కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించకపోతే నవ్యతతో కూడిన కథాంశాలు రావనిపించింది. నిత్యామీనన్ నాకు మంచి స్నేహితురాలు. నిర్మాతగా మారి నేను చేసిన తొలి ప్రయత్నంలో ఆమె ఓ భాగమవ్వడం ఆనందంగా ఉంది. తను మాత్రమే చేయగల పాత్ర అది. రెజీనా ఈ సినిమా కోసం చాలా కష్టపడింది. నేను ఈ సినిమాకు నిర్మాతగా మారడానికి ముందే రవితేజ వాయిస్ ఓవర్‌ను ఇవ్వడానికి అంగీకరించాను. ఇద్దరం కలిసి నిర్మిద్దామని అన్నారు. తొలిప్రయత్నమైనా ఎంతో అనుభవజ్ఞుడిలా దర్శకుడు ప్రశాంత్ ఈసినిమాను తెరకెక్కించారు. కమర్షియల్ లెక్కలు నాకు తెలియవు. రిస్క్ అయినా నేనే విడుదల చేయాలని అనుకున్నాను' అని చెప్పారు. నూతన తారలతో చిన్న సినిమాగా ఈ కథను తెరకెక్కించాలని అనుకు న్నానని, కానీ నాని రాకతో పెద్ద సినిమా అయిందని, నిర్మాతగా నాకు నాని పూర్తిస్వేచ్ఛనిచ్చారని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రమా రాజమౌళి, ఎస్.ఎస్. కార్తికేయ, అవసరాల శ్రీనివాస్, ఇషా, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

చిరు అల్లుడొస్తున్నాడు..



సాయి కొర్రపాటి, గుణ్ణం గంగరాజు, కల్యాణ్‌దేవ్, చిరంజీవి, సెంథిల్, కీరవాణి, రాజమౌళి

ప్రముఖ నటుడు చిరంజీవి రెండో తనయ శ్రీజ భర్త కల్యాణ్‌దేవ్ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. వారాహి చలన చిత్రం సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక నాయర్ కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్‌నివ్వగా, ఎం.ఎం.కీరవాణి కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత సాయికొర్రపాటి మాట్లాడుతూ 'కల్యాణ్‌దేవ్‌ను పరిశ్రమకు పరిచయం చేయడం ఆనందంగా వుంది. వైవిధ్యమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో ఉన్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తాం. రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలో ప్రారంభిస్తాం' అన్నారు. తనికెళ్ల భరణి, మురళీశర్మ, నాజర్, సత్యం రాజేష్, ప్రగతి, కల్యాణి నటరాజన్, పోసాని కృష్ణమురళి, రాజీవ్ కనకాల, జయప్రకాష్ (తమిళ నటుడు), ఆదర్ష్ బాల కృష్ణ, నోయల్, కిరీటి, భద్రమ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.కె.సెంథిల్‌కుమార్, ఆర్ట్: రామకృష్ణ, సంగీతం: యోగేష్, సాహిత్యం: రెహమాన్, ఫైట్స్: జాషువా, సమర్పణ: సాయి శివాని, నిర్మాణం: సాయి కొర్రపాటి, నిర్మాత: రజని కొర్రపాటి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: రాకేష్ శశి.

అతడిలో చిరంజీవి కనిపించాడు!



సి.కల్యాణ్

"ఖైదీ నంబర్ 150' తర్వాత దర్శకుడు వినాయక్ తెరకెక్కించిన ఈ చిత్రం అందరి అంచనాలకు మించి ఉంటుంది. పేదోడికి అండగా నిలిచే ఓ ధైర్యవంతుడైన యువకుడి కథ ఇది. ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తూ ఈ సినిమాను తెరకెక్కించాం' అని అన్నారు సి.కల్యాణ్. ఆయన నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించారు. వి.వి.వినాయక్ దర్శకత్వం వహించారు. ఈ నెల 9న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో సి.కల్యాణ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ ' ఇటీవల బాలకృష్ణ విడుదల చేసిన ఈ సినిమా ప్రచార చిత్రానికి, ప్రభాస్ ఆవిష్కరించిన పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నది. ఇందులో ప్రతి సన్నివేశం ఇంటలిజెంట్‌గా ఉంటుంది. తొలినాళ్లలో చిరంజీవిలో ఉన్న తపన, కష్టపడేతత్వం సాయిధరమ్‌తేజ్‌లో కనిపిస్తున్నాయి. అతడి కెరీర్‌లో మరో మంచి సినిమా అవుతుంది. చిరంజీవి నటించిన 'చమక్ చమక్ రే' గీతాన్ని ఈ సినిమాలో రీమిక్స్ చేశాం. ఒమన్‌లోని అందమైన ప్రదేశాల్లో ఈ పాటను చిత్రీకరించాం. ఈ వీడియో సాంగ్‌ను ఇళయరాజా, సిరివెన్నెల సీతారామ శాస్త్రి కలిసి విడుదలచేయనున్నారు. అలాగే ఈ నెల 4న రాజమండ్రిలో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించనున్నాం. వినాయక్‌పై ఉన్న నమ్మకంతో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతూ పాడుతూ చేసిన సినిమా ఇది. నిర్మాతగా కథ బాగా రావడం కోసం అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. ఒకసారి కథ సిద్ధమైన తర్వాత దర్శకుడి పనిలో ఎలాంటి జోక్యం కలుగజేసుకోను. ఈ విషయంలో సత్యమూర్తి, దాసరి నారాయణరావుల ప్రభావం నాపై ఎక్కువ ఉంది. ప్రస్తుతం రానాతో '1945' అనే సినిమా చేస్తున్నాను. పీరియాడికల్ ప్రేమకథతో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే 'భారతి' అనే పేరుతో మరో చిన్న సినిమా చేయబోతున్నాను' అన్నారు.


సరదాల 'కిరాక్ పార్టీ'



సంయుక్త హెగ్డే, నిఖిల్, సిమ్రన్ పరీన్జా

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. సిమ్రన్ పరీన్జా, సంయుక్త హెగ్డే కథానాయికలు. ఈ చిత్ర టీజర్‌ను బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్ చూశాను. చాలా బాగుంది. మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా వుంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది' అన్నారు. నిఖిల్ మాట్లాడుతూ ' 'హ్యాపీడేస్' తర్వాత కాలేజీ జీవితాల్ని, విద్యార్థుల మనోప్రపంచాల్ని ఆవిష్కరించే సినిమాలు ఎక్కువగా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీర్చుతుంది. ఆద్యంతం హాస్యప్రధానంగా భావోద్వేగాలతో సాగే చిత్రమిది. షూటింగ్ అంతా సరదాగా సాగిపోయింది. చివరి రోజు షూటింగ్‌లో ఉద్వేగాన్ని ఆపుకోలేక అందరం ఏడ్చేశాం' అన్నారు. చిత్ర దర్శకుడు తన వద్ద పనిచేశాడని, అద్భుతంగా సినిమాను తెరకెక్కించాడని సుధీర్‌వర్మ చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'యువతరాన్ని అలరించే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం. 44రోజుల్లో చిత్రీకరణ పూర్తిచేశాం. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ద్వారా తెలుగు చిత్రసీమకు పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నామని కథానాయికలు సిమ్రన్ పరీన్జా, సంయుక్తహెగ్డే చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్: అవినాష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికపాటి, సహనిర్మాత: అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్.

దయ్యంతో కష్టాలు



మేఘన, సల్మాన్, సంతోషి

మేఘన, సంతోషి, సల్మాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హ్యాక్‌డ్ బై డెవిల్ (హెచ్‌బీడీ). కృష్ణకార్తీక్ దర్శకుడు. ఉదయ్‌భాస్కర్.వై నిర్మాత. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. టీజర్‌ను నవీన్‌యాదవ్, ట్రైలర్‌ను మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ విడుదలచేశారు. గీతాల్ని ఆర్.పి పట్నాయక్ ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ థ్రిల్లర్ చిత్రమిది. ఓ దయ్యం కారణంగా చిక్కుల్లో పడిన కొందరు యువతీయువకులు ఆ సమస్యను ఎలా అధిగమించారన్నదే ఈ చిత్ర కథ. దర్శకుడిగా నా మొదటి సినిమా ఇది. పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిలా ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపారు. రెగ్యులర్ హారర్ కథాంశాలకు భిన్నమైన చిత్రమిదని, ఈ నెల 2న ఈ చిత్రాన్ని విడుదలచేయనున్నామని నిర్మాత చెప్పారు.

ప్రేమకు వంతెన



రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి

'ఓ జంట ప్రణయకథకు అందమైన దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. నా జీవితంలో మరచిపోలేని ఎన్నో మధురమైన అనుభూతులను పంచిన ప్రయాణమిది' అని తెలిపారు రాహుల్ రవీంద్రన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హౌరాబ్రిడ్జ్'. రేవన్ యాదు దర్శకుడు. ఈ నెల 3న విడుదలకానుంది. ఈఎమ్‌వీఈ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్నది. చాందిని చౌదరి, మనాలీరాథోడ్ కథానాయికలు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. చిత్ర గీతాలను కథానాయకుడు నారా రోహిత్ ఆవిష్కరించారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ 'కథను నమ్మి నిజాయితీగా నిర్మాతలు చేస్తున్న ప్రయత్నమిది. దర్శకుడిగా, నటుడిగా రాణిస్తున్న రాహుల్‌రవీంద్రన్‌కు ఈ సినిమా పెద్ద విజయం దక్కాలి' అని తెలిపారు. రేవన్ యాదు మాట్లాడుతూ 'దర్శకుడిగా నా రెండో చిత్రమిది. హౌరాబ్రిడ్జ్‌కు ఓ జంటకు ఉన్న సంబంధమేమిటి? వారి ప్రేమకు ఆ వంతెన ఎలా వారధిగా నిలిచిందన్నదే చిత్ర ఇతివృత్తం. శేఖర్‌చంద్ర బాణీలు, చల్లా భాగ్యలక్ష్మి, శ్రీమణి సాహిత్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అని చెప్పారు. స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే చిత్రమిదని చాందిని చౌదరి చెప్పింది.

కనువిందు చేసిన మహా నీలి అరుణ చంద్రుడు



చెన్నైలోని ఈస్ట్‌కోస్ట్ రోడ్‌లో బుధవారం సాయంత్రం కనిపించిన 'బ్లడ్ మూన్'



టోక్యోలో అరుణ చంద్రుడి శోభ



గౌహతిలో చంద్రగ్రహణ వీక్షణం

న్యూఢిల్లీ: 'మహా నీలి అరుణ చంద్రుడు' (సూపర్ బ్లూ బ్లడ్ మూన్) బుధవారం ప్రపంచ ప్రజానీకానికి కనువిందు చేశాడు. భారీసైజు (సూపర్),ఒకే నెలలో రెండోసారి నిండు చంద్రుడి రూపంలో రావటం (బ్లూమూన్),ఎరుపు వర్ణం (బ్లడ్) – ఇవన్నీ కలగలసి వచ్చిన చంద్రుడు అందరినీ అలరించాడు. ఈ విధంగా మూడు లక్షణాలతో చందమామ ప్రత్యక్షం కావటం అత్యంత అరుదైన ఖగోళ పరిణామం. దీనిని చూడటానికి మనదేశంలోనూ ప్రజలు తండోపతండాలుగా ప్లానెటేరియంలకు వెళ్లారు. 1982 తర్వాత తొలిసారిగా సంపూర్ణ చంద్రగ్రహణం, బ్లూమూన్ ఏర్పడటం మనదేశంలో ఇదే తొలిసారి. ఈ అరుదైన ఘటనను తిలకించటానికి స్పేస్ ఇండియా అనే సంస్థ వివిధ పట్టణాలు, నగరాల్లో ప్రత్యేకంగా టెలిస్కోపులను ఏర్పాటు చేసింది. సాయంత్రం 4.21 గంటలకే చంద్రగ్రహణం ప్రారంభమైంది. భూమి ఛాయ నుంచి చంద్రుడు పూర్తిగా తప్పుకునే వరకూ (9.38 వరకూ) గ్రహణం కొనసాగింది. భూమి నీడలో ఉన్నప్పుడు చంద్రుడు ఎరుపు వర్ణాన్ని సంతరించుకొని అరుణచంద్రుడిగా కనిపించాడు. దీనినే బ్లడ్ లేదా రెడ్ మూన్ అని పిలుస్తుంటారు. గ్రహణం సమయంలో భూమికి అత్యంత సమీపానికి రావటంతో సాధారణం కంటే 14 శాతం అధిక పరిమాణంతో, ప్రకాశంతో చందమామ కనిపించింది. అందువల్లే ఈ చంద్రుడిని సూపర్ మూన్ (మహాచంద్రుడు)గా కూడా అభివర్ణించారు. ఇక ఈ నెలలో వచ్చిన రెండో నిండుచంద్రుడు కూడా కావటంతో ఈ చందమామను బ్లూమూన్‌గా కూడా పిలిచారు. ఒకే నెలలో రెండోసారి వచ్చే నిండుచంద్రుడిని బ్లూమూన్ అని అంటారు. ఈ విధంగా 'సూపర్ బ్లూ బ్లడ్ మూన్' ఒకేసారి ప్రజలకు కనువిందు చేసింది.

చెవులను పునఃసృష్టించారు

ల్యాబ్‌లో తయారుచేసి ఐదుగురు పిల్లలకు అమర్చిన శాస్త్రవేత్తలు



బీజింగ్: ప్రయోగశాలల్లో మానవ అవయవాలను తయారు చేయడంలో చైనా శాస్త్రవేత్తలు తొలి విజయం సాధించారు. 3డీ బయోడిగ్రేడబుల్ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఐదుగురు చిన్నారులకు వారి కణాల సహాయంతో కొత్త చెవులను తయారుచేసి అమర్చారు. కొందరికి పుట్టుకతోనే వెలుపలి చెవి లోపించడమో లేదా సరిగా ఎదుగక చాలా చిన్నగా కనిపిస్తుంది. దీనిని మైక్రోటికా అంటారు. ఈ జన్యువ్యాధితో బాధపడుతున్న ఆరు నుంచి తొమ్మిదేండ్ల మధ్య వయస్సున్న ఐదుగురు చిన్నారులకు శాస్త్రవేత్తలు వెలుపలి చెవిని తయారుచేసి అమర్చారు. ఇందుకోసం 3డీ టెక్నాలజీ బయోడిగ్రేడబుల్ ప్రింటింగ్ యంత్రాన్ని మూలకాలు, పోషకాలను వినియోగించి చెవిని తయారు చేయగలిగేలా అభివృద్ధి చేశారు. తర్వాత మృదులాస్థి నుంచి కణాలను సేకరించి, వాటికి ల్యాబ్‌లో పోషకాలను సమకూర్చి చెవి ఆకారంలో ఎదిగేలా చేశారు. మూడు నెలల్లో వెలుపలిచెవిని అభివృద్ధి చెందిన తర్వాత చిన్నారికి శస్త్రచికిత్స ద్వారా దానిని అమర్చారు.

కాస్‌గంజ్ హింసాకాండ..

విద్యార్థి హత్య కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

- బాల్కనీ నుంచి కాల్పులు జరిపిన నిందితుడు
- 150మందికిపైగా అదుపులోకి.. కేంద్ర హోంశాఖకు నివేదిక
- తిరంగాయాత్రకు అనుమతి నిరాకరణ
- సంచలనం రేపుతున్న వీడియో



కాస్‌గంజ్ అల్లర్ల సందర్భంగా రివాల్వర్ పట్టుకున్న ఓ వ్యక్తి; నిందితుడు సలీం

లక్నో, జనవరి 31: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో చెలరేగిన హింస సందర్భంగా ఓ విద్యార్థి హత్య కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అలీగఢ్ రేంజ్ ఐజీ సంజీవ్ గుప్తా మాట్లాడుతూ కాస్‌గంజ్‌లో జరిగిన హింస సందర్భంగా కాలేజీ విద్యార్థి చందన్ గుప్తా హత్యకు గురయ్యాడని తెలిపారు. ఈ హత్యలో ప్రధాన నిందితుడు సలీం, అతడి సోదరులు నసీం, వసీం పాలుపంచుకున్నారని చెప్పారు. నిందితుడు తన ఇంటి బాల్కనీ నుంచి కాల్పులు జరిపాడని వివరించారు. చందన్‌పై తానే కాల్పులు జరిపినట్లు తమ విచారణలో సలీం ఒప్పుకున్నాడని ఐజీ పేర్కొన్నారు. కాస్‌గంజ్ హింసాకాండ ఓ పథకం ప్రకారమే జరిగిందని, విద్యార్థి హత్య తరువాత అల్లర్లు మరింతగా పెరిగిపోయాయని, ఆందోళనకారులు మూడు దుకాణాలు, రెండు బస్సులు, ఓ కారుకు నిప్పుపెట్టారని చెప్పారు. ఈ ఆందోళనలకు సంబంధించి 150 మందికిపైగా అరెస్టు చేశామన్నారు. మరోవైపు చందన్ మృతిని నిరసిస్తూ బుధవారం విశ్వ హిందూ పరిషత్ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త తిరంగా యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. నిందితుడు తన కుమారుడి తలకు తుపాకీ గురిపెట్టి పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేయాలని భయపెట్టాడని, నిరాకరించడంతోనే కాల్చాడని చందన్ గుప్తా తండ్రి ఆరోపించారు. మరోవైపు, కాస్‌గంజ్ ఘర్షణలకు సంబంధంచిన ఓ వీడియో ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆ వీడియలో కొందరు వ్యక్తులు తుపాకులు, కర్రలతో రోడ్డుపై తిరుగుతున్నారు. కాల్పుల శబ్దం కూడా వినిపిస్తున్నది. ఈ కాల్పుల్లోనే విద్యార్థి చందన్ గుప్తా మృతిచెందాడు. ఈ వీడియోపై దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతిభ ఆధారంగానే అమెరికా ప్రవేశం!

నూతన వలస విధానంలో ఇదే కీలకం

- లాటరీ విధానాన్ని రద్దు చేసే సమయం వచ్చింది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి తొలిసారి ప్రసంగం

వాషింగ్టన్, జనవరి 31:



అమెరికన్ కాంగ్రెస్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ప్రతిభ ఆధారంగానే ప్రవేశం లభించేలా నూతన వలస విధానం అవసరమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. లాటరీ వీసా వ్యవస్థకు తాను ముగింపు పలకబోతున్నట్లు ప్రకటించారు. 'అమెరికా ఫస్ట్' విధానానికి ఇదే సరైన మార్గమని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ట్రంప్ కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. ప్రతిభ ఆధారంగానే వీసాలు జారీ చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నిపుణులు, సమాజానికి సేవలందించేవారు, అమెరికాను ప్రేమించి గౌరవించేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలని ట్రంప్ తన ప్రసంగంలో స్పష్టంచేశారు. గొలుసుకట్టు వలస విధానాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ప్రతిపాదిస్తున్న వలస విధానం న్యాయమైనదని, దీనిపై అందరం కలిసి ఏకాభిప్రాయంతో పనిచేద్దామని అన్నారు. '18లక్షల మంది డ్రీమర్లకు పౌరసత్వం కల్పించడం, అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం, లాటరీ వీసా రద్దు, కుటుంబ ఆధారిత వలస విధానాలకు స్వస్తి చెప్పడం.. ఈ నాలుగు అంశాలు కీలకంగా నూతన వలస విధానంలో సంస్కరణలు తేవాల్సిన అవసరముంది. అమెరికా ప్రయోజనాలరీత్యా నా ప్రతిపాదనకు రిపబ్లికన్లు, డెమొక్రాట్లు మద్దతు తెలుపుతారని ఆశిస్తున్నా..' అని ట్రంప్ చెప్పారు. నేరగాళ్లు, ఉగ్రవాదులు దేశంలోకి ప్రవేశించేందుకు వీలు కల్పిస్తున్న లోపభూయిష్టమైన వలస చట్టాలను సమూలంగా మార్చేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 'పట్టుకో.. తర్వాత వదిలెయ్.. అనే ప్రమాదకర విధానాలకు అవకాశమీయకుండా దేశంలోకి ప్రవేశించేస్థాయిలోనే నేరస్థులను నిరోధించేలా నూతన విధానం అవసరముంది' అని ట్రంప్ వివరించారు.అమెరికాలో నిరుద్యోగం 45 ఏండ్ల కనిష్ఠస్థాయికి పడిపోయిందని ట్రంప్ వెల్లడించారు.

'చైనా, రష్యా వంటి ప్రత్యర్థి దేశాల్ని ఢీకొంటున్నాం'

సురక్షిత, పటిష్ఠ అమెరికా లక్ష్యంగా తాము పనిచేస్తుంటే, చైనా, రష్యా వంటి ప్రత్యర్థి దేశాలు అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని ట్రంప్ విమర్శించారు. 'అమెరికాను అంతర్జాతీయంగా శక్తిమంతంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ధూర్తదేశాలతో, ఉగ్రవాద సంస్థలతోపాటు మన ప్రయోజనాలు, మన ఆర్థికవ్యవస్థ, మన విలువలను సవాల్ చేస్తున్న చైనా, రష్యా వంటి ప్రత్యర్థులతో మేం ఢీకొంటున్నాం' అని ఆయన తన ప్రసంగంలో చెప్పారు. ఇలాంటి తరుణంలో సుస్థిరంగా నిలబడితేనే దేశాన్ని రక్షించుకోగలమని అన్నారు. 'విషాద సమయాల్లోనో, విపత్తులు సంభవించినప్పుడో ఒకే వేదికపైకి రావడం కాదు. అమెరికా ప్రయోజనాల కోసం అందరం ఒక్కటవుదాం. ఇది కొత్త అమెరికన్ ఉద్యమం' అంటూ రిపబ్లికన్లు, డెమొక్రాట్లు తనతో కలిసిరావాలని ఆయన కోరారు. తాలిబన్లతో చర్చల ప్రసక్తే లేదని ఆయన స్పష్టంచేశారు. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో మూసివేయాలని నిర్ణయించిన గ్వాంటనామోబే జైలును తిరిగి తెరిచేందుకు ఉత్తర్వులపై సంతకం చేసినట్లు ట్రంప్ వెల్లడించారు. కాగా డెమొక్రాట్ సభ్యులు అధ్యక్షుడి ప్రసంగాన్ని బహిష్కరించారు.

అధ్యక్షుడి ప్రసంగ కార్యక్రమానికి సునయన హాజరు



అమెరికన్ కాంగ్రెస్‌లో జరిగిన అధ్యక్షుడి వార్షిక ప్రసంగ కార్యక్రమం 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ అడ్రస్'కు ప్రవాస భారతీయుడు కూచిభొట్ల శ్రీనివాస్ సతీమణి సునయన కూడా హాజరయ్యారు. గత ఏడాది కేన్సస్ రాష్ట్రంలోని ఒలేథ్‌లో జరిగిన జాతివిద్వేష కాల్పుల్లో శ్రీనివాస్ మరణించారు. ఈ నేపథ్యంలో సునయన తన అమెరికన్ పౌరసత్వాన్ని కోల్పోయారు. అయినప్పటికీ అమెరికాలో ఉండేందుకు ఆమె ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. రిపబ్లికన్ నేత కెవిన్ యోడర్ ఆహ్వానం మేరకు సునయన అధ్యక్షుడి ప్రసంగ కార్యక్రమానికి హాజరయ్యారు.

భారతీయులకు తీపికబురే..

ప్రతిభ ఆధారిత వలస విధానంతో ప్రతిభావంతులైన భారతీయ ఉద్యోగులకు ప్రయోజనం కలిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే గొలుసుకట్టు వలస విధానాలను రద్దు చేస్తే వారి బంధువులను అమెరికాకు తీసుకువచ్చే అవకాశాలకు అడ్డుకట్ట పడుతుంది. అమెరికాలో లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ఊరట కలిగిస్తున్నాయి. ఏటా 50వేలకు మించి హెచ్1బీ వీసాలు పొందుతున్న భారత్, మరో 17 దేశాలకు లాటరీ వీసాలు ప్రస్తుతం అమెరికా ఇవ్వట్లేదు. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో వంటి అమెరికాలోని భారత ఐటీ కంపెనీలు హెచ్1బీ వీసాల గడువు ముగిసిన ఉద్యోగుల్ని భారత్‌కు తిప్పి పంపుతున్నాయి. గ్రీన్‌కార్డులు పరిమితంగానే జారీ చేస్తుండడంతో బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోయిన దరఖాస్తులు లక్షల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గొలుసుకట్టు వలస విధానాల రద్దుతో కొంత నష్టం కలుగుతున్నా, ప్రతిభ ఆధారిత వలస విధానంతో భారతీయులకు గరిష్ఠ లబ్ధి చేకూరుతుందని నిపుణులు భావిస్తున్నారు.

జస్టిస్ ఎస్ఎన్ శుక్లా ఉద్వాసనకు సీజేఐ నిర్ణయం!

న్యూఢిల్లీ: మెడికల్ కళాశాల అడ్మిషన్ల కుంభకోణంలో ప్రమేయం ఉన్నదని అంతర్గత విచారణలో తేలడంతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ శుక్లాను పదవి నుంచి తొలిగించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ (సీజేఐ) దీపక్ మిశ్రా నిర్ణయించారు. మెడికల్ కాలేజీ అడ్మిషన్ల వ్యవహారంపై మద్రాస్, సిక్కిం, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఇందిరాబెనర్జీ, జస్టిస్ ఎస్‌కే అగ్నిహోత్రి, జస్టిస్ పీకే జైశ్వాల్‌లతో త్రిసభ్య కమిటీని విచారణ జరిపింది. జస్టిస్ శుక్లాకు అడ్మిషన్ల వ్యవహారంతో సంబంధం ఉన్నదని త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. రాజీనామా గానీ, స్వచ్ఛంద పదవీ విరమణ గానీ చేయాలని సీజేఐ సలహా ఇచ్చినా, జస్టిస్ శుక్లా అందుకు నిరాకరించారు. దీంతో ఆయనను జ్యుడిషియల్ విధుల నుంచి తొలిగించాలని అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను జస్టిస్ దీపక్‌మిశ్రా ఆదేశించారు. మంగళవారం నాడే విధుల నుంచి తప్పించడంతో జస్టిస్ శుక్లా సెలవుపై వెళ్లినట్లు తెలుస్తున్నది.

సోనియా అధ్యక్షతన నేడు విపక్షాల భేటీ!

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు విపక్షాలు గురువారం సాయంత్రం సమావేశం కానున్నాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018 – 19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించిన తర్వాత పార్లమెంట్ లైబ్రరీ హాలులో జరిగే ఈ సమావేశానికి యూపీఏ చైర్‌పర్సన్‌గా, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియాగాంధీ అధ్యక్షత వహిస్తారని సమాచారం. ఎన్సీపీ అధినేత శరద్‌పవార్‌తోపాటు డీఎంకే, తృణమూల్, ఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, ఆరెస్పీ, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, జేడీయూ తిరుగుబాటు నేతలు శరద్ యాదవ్, అలీ అన్వర్ అన్సారీ తదితరులు హాజరవుతారని తెలుస్తున్నది. జేడీఎస్ ప్రతినిధి కూడా హాజరవుతారని సమాచారం. అదే జరిగితే త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీతో జేడీఎస్ జత కట్టే అవకాశాలు ఉన్నాయి.

ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ భూకంపం

- రిక్టర్‌స్కేలుపై 6.1 తీవ్రత నమోదు
- భారత్, పాకిస్థాన్‌లోనూ కనిపించిన ప్రభావం
- ఒకరి మృతి, పదుల మందికి గాయాలు



భూకంపం కారణంగా శ్రీనగర్‌లో విరిగిపడిన ఫ్లైఓవర్ పిల్లర్

ఇస్లామాబాద్/కాబూల్/శ్రీనగర్, జనవరి 31: ఆఫ్ఘనిస్థాన్‌ను బుధవారం భారీ భూకంపం కుదిపేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.37 గంటలకు ఆఫ్ఘనిస్థాన్–తజకిస్థాన్ సరిహద్దు సమీపంలోని హిందూకుష్ పర్వతశ్రేణి కేంద్రంగా ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదైంది. భూ ఉపరితలానికి 191 కిలోమీటర్ల లోతున భూకంపకేంద్రాన్ని గుర్తించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే శాస్త్రవేత్తలు తెలిపారు. భూమి కంపించడం మొదలవగానే స్థానికులు ఇండ్లు, దుకాణాలు, పాఠశాలల నుంచి భయాందోళనలతో పరుగులు తీశారు. నష్టాన్ని అంచనా వేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆ దేశ విపత్తు నిర్వహణ శాఖ పేర్కొన్నది. ప్రకంపనల ప్రభావం భారత్, పాకిస్థాన్‌లలోనూ కనిపించింది. భారత్‌లో ఢిల్లీ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్‌లలో ప్రకంపనలు సంభవించాయి. ప్రకంపనల తీవ్రతకు శ్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఫ్లైఓవర్ నుంచి రెండు పిల్లర్లు జారిపడిపోయాయి. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. అధికారులు లోయవ్యాప్తంగా కాసేపు కరెంటు సరఫరాను నిలిపివేశారు. ఢిల్లీలో మెట్రోరైళ్లను కొంతసేపు నిలిపివేసి ఆ తర్వాత యధాతథంగా కొనసాగించారు. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ రాష్ట్రంలో భూకంప ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఇస్లామాబాద్, పెషావర్, లాహోర్‌లోనూ స్వల్పంగా భూమి కంపించింది. క్వెట్టా నగరంలో ఇంటి పైకప్పు కూలి ఒక బాలిక మృతిచెందింది. పలు ఇండ్లు కూలిపోవడంతో పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత శ్రేణుల కింద యురోపియన్, ఇండియన్ భూఫలకాలు కలుస్తుండటంతో తరుచూ భూకంపాలు సంభవిస్తుంటాయని అధికారులు చెప్తున్నారు.

పసికందు ఆరోగ్యంపై నివేదిక ఇవ్వండి

లైంగిక దాడికి గురైన చిన్నారి కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వాయవ్య ఢిల్లీలో ఆదివారం లైంగిక దాడికి గురైన ఎనిమిది నెలల పసికందు ఆరోగ్య పరిస్థితిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇద్దరు ఎయిమ్స్ వైద్యులు ప్రత్యేక అంబులెన్స్‌తో వెళ్లి.. ఆ పసికందు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి గురువారం తమకు నివేదించాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. పరిస్థితి విషమంగా ఉంటే ఎయిమ్స్‌కు తరలించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలోని ఒక ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న పసికందు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని, మృత్యువుతో పోరాడుతున్నదని బాధితురాలి తల్లిదండ్రుల తరపున పిటిషన్ దాఖలు చేసిన అలోక్ శ్రీవాస్తవ తెలిపారు. కాగా, లైంగిక దాడి నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎన్జీటీలో సింగిల్ బెంచ్ విచారణలొద్దు: సుప్రీం

జాతీయ హరిత న్యాయస్థానం (ఎన్జీటీ)లో సింగిల్ జడ్జి బెంచ్‌లు కేసులను విచారించరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విషయమై ఎన్జీటీ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్‌జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం బుధవారం విచారించింది. ఏకసభ్య బెంచ్‌లను ఏర్పాటు చేయకుండా ఎన్జీటీ తాత్కాలిక చైర్‌పర్సన్‌కు సూచించాలని అటార్నీ జనరల్‌కు ధర్మాసనం తెలిపింది.

రాహుల్ జాకెట్‌పై బీజేపీ ట్వీట్ ఫైట్

రూ.63 వేల ఖరీదంటూ విమర్శలు.. తప్పుపట్టిన కాంగ్రెస్



షిల్లాంగ్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వేసుకున్న బ్లాక్ జాకెట్‌పై బీజేపీ విమర్శలు గుప్పిస్తున్నది. నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామాతో భేటీ సందర్భంగా అప్పట్లో ప్రధాని మోదీ ఖరీదైన సూటు వేసుకోవడంపై.. రాహుల్ చేసిన 'సూట్– బూట్' సర్కార్ వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఎదురుదాడికి దిగింది. మంగళవారం షిల్లాంగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ నల్లటి జాకెట్ ధరించి వచ్చారు. ప్రజలు బాధల్లో ఉంటే, రాహుల్ రూ.63వేలకు పైగా ఖరీదైన జాకెట్ ధరించారని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి ఖండించారు. 'నేను రూ.700కు కూడా కొనుగోలు చేసి చూపిస్తా. అప్పుడేమంటారు?' అని ప్రశ్నించారు. మరోవైపు మోదీ ఇప్పటికీ 'సూటు–బూటు వ్యక్తేనని, అందుకే పేదలకు దూరంగా ఉంటారని రాహుల్ సమాధానమిచ్చారు.

షోపియాన్ ఘటనపై వివరణ ఇచ్చిన ఆర్మీ

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లా గనోవ్‌పొరలో గత శనివారం చోటుచేసుకున్న కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతిచెందిన ఘటన మీద రాష్ట్ర పోలీసులు కేసు నమోదుచేయడంపై సైన్యం స్పందించింది. సుమారు 120 మంది ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఏడుగురు సిబ్బంది గాయపడ్డారని, ఆత్మరక్షణలో భాగంగానే కాల్పులు జరిపామని పోలీసులకు వివరణ ఇచ్చింది. జూనియర్ కమిషన్డ్ అధికారిని తీవ్రంగా హింసించారని, ఆయన సర్వీస్ ఆయుధాన్ని గుంజుకున్నారని పేర్కొన్నది. మరోవైపు షోపియాన్ జిల్లాలో సైన్యం కాల్పుల్లో గాయపడిన మరో యువకుడు బుధవారం మృతిచెందాడు. దీంతో మృతుల సంఖ్య మూడుకు పెరిగింది.

ఎన్ఎస్‌జీ కమెండోలకు యోగా!

న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జాతీయ భద్రతా దళం(ఎన్ఎస్‌జీ) కమెండోలు ఇకపై రోజూ యోగా చేయాల్సి ఉంటుంది. ఆరోగ్య పరీక్షలనూ ఎదుర్కోవాలి. ఈమేరకు ఎన్ఎస్‌జీ విధివిధానాలను రూపొందించింది. ఎన్ఎస్‌జీ కమాండోలకు యోగాను ప్రారంభించడం ఇదే మొదటిసారి. అధికార వర్గాలు మాట్లాడుతూ ఉగ్రవాదం తదితర సంఘ విద్రోహకర చర్యలను నిరోధించడంలో కీలకపాత్ర పోషించే ఎన్ఎస్‌జీ కమాండోలకు ఫిజికల్ ఫిట్‌నెస్ చాలా ముఖ్యమని, అందుకే నూతన విధివిధానాలను రూపొందించామని తెలిపాయి.



మూడో శ్రేణి స్కార్పియాన్ విభాగానికి చెందిన ఈ జలాంతర్గామి పేరు కరంజ్. మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్) రూపొందించిన ఈ జలంతర్గామిని బుధవారం ముంబైలో నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా భార్య రీనా ప్రారంభించారు. ఫ్రాన్స్‌కు చెందిన నావెల్ గ్రూప్ సహకారంతో ఎండీఎల్ ఆరు జలాంతర్గాములను రూపొందిస్తున్నదని సునీల్ లాంబా తెలిపారు.

గల్లంతైన ఉపగ్రహం జాడ 12 ఏండ్లకు దొరికింది

వాషింగ్టన్: అంతరిక్షంలో కనిపించకుండా పోయిన నాసా ఉపగ్రహం ఆచూకీ 12 ఏండ్ల తర్వాత లభ్యమైంది. సాంకేతికంగా అది చనిపోయినట్లేనని భావిస్తూ వచ్చిన శాస్త్రవేత్తలకు అనూహ్యంగా అది ఇప్పటికీ పనిచేస్తుండటం ఆశ్చర్యపరిచింది. అమెరికా సైనిక అవసరాల నిమిత్తం ఆ దేశ అంతరిక్ష పరిశోధనాసంస్థ నాసా ప్రయోగించిన 'ఇమేజ్' ఉపగ్రహం 2005 జనవరి నుంచి కనిపించకుండా పోయింది. ఎర్త్‌స్టేషన్‌తో సంబంధాలు తెగిపోవడంతో ఇంతకాలం దాని వివరాలేవీ తెలియరాలేదు. తాజాగా ఆ ఉపగ్రహం ఆచూకీ దొరికింది.

క్రిప్టోకరెన్సీ ప్రకటనలపై ఫేస్‌బుక్‌లో నిషేధం

వాషింగ్టన్: బిట్ కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలకు సంబంధించిన అన్నిరకాల ప్రకటనలను సోషల్‌మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ నిషేధించింది. ఇన్‌స్టాగ్రామ్, ఆడియన్స్ నెట్‌వర్క్, మెసెంజర్‌లోనూ వీటిని ప్రోత్సహించరాదని నిర్ణయించింది. తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించినట్టు బుధవారం ప్రకటించింది.

మన ప్రజాస్వామ్యం అంతంతే!

- 167 దేశాల జాబితాలో 42వ స్థానం
- మొదటి నాలుగు స్థానాల్లో నార్వే, ఐస్‌లాండ్, స్వీడన్, న్యూజిలాండ్
- 19 దేశాల్లోనే పూర్తిస్థాయి ప్రజాస్వామ్యం
- పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లలో హైబ్రిడ్ ప్రజాస్వామ్యం
- చైనా, మయన్మార్, రష్యా, వియత్నాంలలో నియంతృత్వం
- వెల్లడించిన ఈఐయూ 2017 జాబితా



అంతర్జాతీయ ప్రజాస్వామ్య దేశాల సూచి-2017

న్యూఢిల్లీ, జనవరి 31: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దేశాల జాబితాలో భారత్ 42 స్థానంలో నిలిచింది. సంప్రదాయ మతశక్తులు ప్రబలడం, మైనారిటీలపై హింస, అసమ్మతులు పెరుగడం వంటివి ఇందుకు కారణం అని భావిస్తున్నారు. ప్రపంచంలో తమదే బడా ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకునే అమెరికా కూడా 21 స్థానంలోనే ఉన్నది. చైనా, రష్యా వంటి దేశాలు నియంతృత్వ తరహా పాలనలో ప్రజాస్వామ్యానికి చాలా దూరంగా ఉన్నాయి. పాకిస్థాన్ వంటి దేశాల్లో అయితే అటూఇటూకాని ప్రజాస్వామ్య వ్యవస్థలు.. అంటే సంకర(హైబ్రిడ్)మైన స్థిరంగా లేని పాలనావిధానాలు ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలుగా భావిస్తున్న జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, సింగపూర్, హాంగ్‌కాంగ్ దేశాలు సైతం లోపభూయిష్ఠమైన ప్రజాస్వామ్య దేశాల జాబితాలో ఉన్నాయి. భారత్‌లోనూ లోపభూయిష్టమైన ప్రజాస్వామ్యమే ఉన్నదని ఇంగ్లాండ్‌కు చెందిన ఆర్థికశాస్త్ర నిఘావిభాగం(ఈఐయూ) విశ్లేషించి రూపొందించిన 2017 జాబితా వెల్లడించింది. 1946లో ఆర్థిక సంస్థలు, ప్రభుత్వాలకు ప్రపంచ పోకడలపై అవగాహన కల్పించడానికి ఈఐయూ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ సంస్థ ఏటా ప్రజాస్వామ్య దేశాల జాబితా తయారు చేస్తున్నది. తాజా జాబితాలో భూగోళం ఉత్తరఖండంలో ఉన్న మూడు దేశాలు అగ్రభాగంలో ఉన్నాయి. నార్వే మొదటి స్థానంలో ఉండగా, ఐస్‌లాండ్, స్వీడన్ తరువాతి స్థానాలు నిలిచాయి. ప్రపంచంలోని 165 స్వతంత్ర దేశాలు, రెండు ప్రాదేశిక ప్రాంతాల్లో ప్రజాస్వామిక విలువలను బట్టి ఈఐయూ వాటికి ర్యాంకులు ఇచ్చింది. ఎన్నికల ప్రక్రియ–బహుళత్వం, పౌరహక్కులు, ప్రభుత్వ పనితీరు, రాజకీయ భాగస్వామ్యం, రాజకీయ సంస్కృతి అనే ఐదు అంశాలను ఇందుకు ప్రామాణికాలుగా తీసుకున్నది. ఇందులోనూ పూర్తిస్థాయి ప్రజాస్వామ్యం, లోపభూయిష్టమైన ప్రజాస్వామ్యం, సంకరమైన వ్యవస్థలతో కూడిన పాలన, నియంతృత్వ దేశాలు అనే నాలుగు విభాగాలు చేసింది. ఈ జాబితాలో ఇండియాను ఈఐయూ లోపభూయిష్టమైన ప్రజాస్వామ్య దేశాల సరసన చేర్చింది. 165 దేశాల్లో కేవలం 19 దేశాల్లోనే పూర్తిస్థాయి ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నట్లు ఈఐయూ పేర్కొంది. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దేశాల జాబితాలో న్యూజిలాండ్ 4, డెన్మార్క్ 5, ఐర్లాండ్ 6, కెనడా 7, ఆస్ట్రేలియా 8. ఫిన్లాండ్ 9, స్విట్జర్లాండ్ 10 స్థానంలో ఉన్నాయని తెలిపింది. ఇక పాకిస్థాన్(110), బంగ్లాదేశ్(92), నేపాల్ (94), భూటాన్ (99) వంటి దేశాల్లో సంకర విధానాలతో కూడిన ప్రజాస్వామ్యం ఉన్నదని వెల్లడించింది. చైనా(139) మయన్మార్(120), రష్యా (135). వియత్నాం(140) దేశాల్లో నియంతృత్వ తరహా పాలన ఉన్నదని స్పష్టంచేసింది. సిరియా (166), ఉత్తరకొరియా (167) ఈ జాబితాలో ఆఖరున నిలిచాయి. ప్రజాస్వామ్య దేశాల జాబితాలో నంబర్ వన్‌గా ఉన్న నార్వేకు 10 పాయింట్లలో 9.87 పాయింట్లు కేటాయించింది. ఇండియాకు 7.23 పాయింట్లు ఇచ్చింది. ఎన్నికల ప్రక్రియ–బహుళత్వం అనే ఒకే అంశంలో మాత్రం భారత్‌కు 9.17 పాయింట్లు కేటాయించింది.



గిరిజన మహిళల ద్వారా మేడారం వనదేవతలకు పట్టువస్త్రాలు, ఒడిబియ్యంతో కూడిన సారెను పంపుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ శ్రీధర్

మేడారం మహాజాతరకు నాగర్‌కర్నూల్ సారె

అమ్రాబాద్‌రూరల్: మేడారం మహాజాతరకు నాగర్‌కర్నూల్ జిల్లా తరుపున నల్లమల ప్రాంతంలోని ఆదివాసి చెంచుల ద్వారా బుధవారం సారెను పంపారు. లింగాల మండలం భౌరాపూర్ చెంచుపెట్ట వద్ద వెలసిన భ్రమారాంబిక ఆలయంలో సారెకు పూజలు నిర్వహించి, అక్కడి నుంచి మన్ననూర్ చేరుకొని ప్రత్యేక బస్సులో బయలుదేరారు. ముందుగా వారు కలెక్టర్ శ్రీధర్‌ను కలువగా పట్టువస్త్రాలు, ఒడి బియ్యంతో కూడిన సారె అందజేశారు.

ఆలయాల మూసివేత

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా బుధవారం రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను మూసివేశారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 10గంటలకు మూసివేశారు. రాత్రి 9 గంటలకు తెరిచి సంప్రోక్షణ చేసి ఆలయాన్ని మూసివేశారు. గురువారం ఉదయం నాలుగు నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు, నిత్యకైంకర్యాలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు మూసివేశారు. రాత్రి 10గంటలకు తెరిచి గోదావరి నీటితో శుద్ధిచేశారు. గురువారం తెల్లవారుజాము నుంచి యథావిధిగా నిత్య పూజలకు అవకాశం కల్పిస్తారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయప్రధాన ద్వారాన్ని బుధవారం ఉదయం 7.30 గంటలకు మూసి ఉంచారు. గురువారం ఉదయం 4.30 గంటలకు తెరువనున్నట్టు ఆలయ ఈవో సోమయ్య తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ఉదయం 8:18 గంటలకు ఆలయ స్థానాచార్యులు గోపన్నగారి శంకరయ్య ఆధ్వర్యంలో మూసివేశారు. రాత్రి 8:45 గంటలకు సంప్రోక్షణ, నిశీపూజ అనంతరం పవళింపుసేవ నిర్వహించి ఆలయాన్ని తిరిగి మూసివేశారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాలను మూసివేశారు. కొండగట్టు ఆలయముఖ ద్వారాన్ని బుధవారం ఉదయం 6.30లకు మూసివేశారు. గురువారం వేకువజామున ఆలయ సంప్రోక్షణ చేసి భక్తులకు యథావిధిగా దర్శనఅవకాశాన్ని కల్పిస్తామని కొండగట్టు ఆలయ ఈవో అమరేందర్ తెలిపారు. ఏపీలోని తిరుమల తిరుపతి ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసి ఉంచారు. బెజవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయాన్ని మూసివేశారు. గురువారం ఉదయం ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ నిర్వహించిన తర్వాత 8 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించనున్నట్టు ఈవో పద్మ తెలిపారు.



భద్రాద్రి ఆలయ తలుపులు మూసివేస్తున్న అర్చకులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో దేవీప్రసాద్, కారెం రవీందర్‌రెడ్డి తదితరులు

బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలి

ఉద్యోగులకు మండలి చైర్మన్ స్వామిగౌడ్ పిలుపు

సంగారెడ్డి చౌరస్తా: ఉద్యోగులు బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో టీఎన్జీవోస్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ఎమ్మెల్యే ప్రభాకర్, జేసీ వాసం వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జీవం పోస్తున్న కేసీఆర్ సర్కార్

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు బైక్‌పై వెళ్తున్న మంత్రి

సత్తుపల్లి, నమస్తే తెలంగాణ: వెక్కిరిస్తున్న శిలాఫలకాలకు జీవం పోసి ప్రాజెక్ట్‌లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తూ రైతుల మోములో చిరునవ్వులు చిందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ సర్కార్‌కే దక్కిందని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో రూ.22 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందన్నారు. ఉగాది నాటికి గోదావరి జలాలను ఇంటింటికీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి



జనహిత గ్రామ దర్శిని కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు, నమస్తే తెలంగాణ: రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నదని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరానికి రెండు పంటలకు రూ. 8 వేల పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామని తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో బుధవారం నాలుగో విడుత జనహిత గ్రామదర్శిని కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



రామారెడ్డిలో ఎన్డీసీసీ బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పోచారం

సదాశివనగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని రామారెడ్డి మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన ఎన్డీసీసీ బ్యాంకు భవనాన్ని ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.

కాళేశ్వరానికి జాతీయ హోదా అడుగుతాం

- కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్



వేములవాడలో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్ చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

వేములవాడ, నమస్తే తెలంగాణ: తెలంగాణ రైతులకు ప్రధానంగా సాగు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టుకు వచ్చే బడ్జెట్ సమావేశాల్లో జాతీయ హోదాతోపాటు, తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతామని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి ఎంపీ వినోద్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, నిధులను కేటాయించాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీని గతంలోనే కోరామన్నారు. రాష్ట్రానికి ఎయిమ్స్, సిరిసిల్లలో పవర్‌లూమ్ క్లస్టర్ కావాలని ఇప్పటికే మంత్రి కేటీఆర్‌తో కలిసి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశామన్నారు.

కల్వకుర్తి.. భరోసా

- కృష్ణాజలాలతో అలుగుపారుతున్న 52 చెరువులు
- ఆవంచ అక్విడెక్ట్ నుంచి జంగారెడ్డిపల్లి వరకు సాగునీరు
- నెరవేరిన మూడు దశాబ్దాల కల

కల్వకుర్తి, నమస్తే తెలంగాణ: కల్వకుర్తి వాసుల కల నెరవేరింది. మూడు దశాబ్దాలపాటు సాగునీటి కోసం ఎదురుచూపులు చూసిన అన్నదాతలకు కృష్ణమ్మ పరవళ్లు సంతోషాన్ని తెచ్చిపెట్టాయి. పొలాల మధ్య పరుగులు తీస్తున్న కృష్ణా జలాలతో తమ కష్టాలను మరిచిపోతున్నారు. కృష్ణా జలాలు వట్టిపోయిన చెరువులను ముద్దాడుతూ అలుగులు పారుతున్నాయి. బోరు బావుల్లో నీటి మట్టం పెరగడంతోపాటు 24 గంటల విద్యుత్‌తో వ్యవసాయ పనుల్లో రైతులు తీరికలేకుండా ఉన్నారు.

ఎంజీకేఎల్‌ఐ ద్వారా కల్వకుర్తికి సాగునీరు..

మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్‌ఐ) 29వ ప్యాకేజీ ద్వారా కల్వకుర్తికి సాగునీరు అందుతుంది. 29వ ప్యాకేజీ ద్వారా 2016 వానాకాలం వరకు నాగర్‌కర్నూల్ అవంచ వరకు మాత్రమే సాగునీరు వచ్చింది. 2017 వానాకాలం నాటికి 29వ ప్యాకేజీ ద్వారా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి 160 కిలోమీటర్ టెయిల్‌ఎండ్ వరకు సాగునీరు ఇస్తామని మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు రైతులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సంవత్సర కాలంలో దుందుబీ వాగుపై నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచ వద్ద అక్విడెక్ట్ నిర్మాణం పూర్తి చేయించారు. ఆవంచ అక్విడెక్ట్ 90 కిలోమీటర్ నుంచి జంగారెడ్డిపల్లి 160 కిలోమీటర్ వరకు కాల్వ పనులను వేగవంతంగా పూర్తి చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం 2017 వానాకాలం నాటికి కల్వకుర్తికి సాగునీరు అందించారు.

అక్విడెక్ట్ నుంచి జంగారెడ్డిపల్లి వరకు..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కల్వకుర్తి పూర్వపు తాలుకాలోని చిల్వేరు (మిడ్జిల్ మండలం) నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు కృష్ణా జలాలతో 52 చెరువులను నింపారు. అందులో కల్వకుర్తి మండలంలోనే ప్రధానంగా 22 చెరువులు ఉన్నాయి. ఆవంచ అక్విడెక్ట్ నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు దాదాపు 28 గ్రామాల గుండా 29వ ప్యాకేజీ కాల్వ సాగుతుంది. ఆవంచ అక్విడెక్ట్ నుంచి టెయిల్‌ఎండ్ జంగారెడ్డిపల్లి వరకు 78 వేల ఆయకట్టును స్థిరీకరించారు. అందులో కల్వకుర్తి మండలంలో దాదాపు 37 వేల ఆయకట్టు ఉంది.





జంగారెడ్డి పల్లి- తిమ్మరాశిపల్లి మధ్య ఉన్న ఎంజీకేఎల్ ఐ 29 ప్యాకేజీ కాల్వ (ఇన్‌సెట్‌లో) జంగారెడ్డిపల్లిలో కళ కళ లాడుతున్న వరి పైర్లు

చెరువులు, కుంటలు నిండటంతో...

చెరువులు కుంటలు నిండటంతో కల్వకుర్తి మండలంతోపాటు ఊర్కొండ, మిడ్జిల్ మండలాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కల్వకుర్తికి కృష్ణాజలాలు పారించడంతో కాల్వల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. కల్వకుర్తి మండలంలోనే 22 చెరువుల నిండాయి. కల్వకుర్తి మండలంలో చెరువుల నిండి అలుగులు పారడంతో వంగూర్ మండలంలో నాలుగు చెరువులు నిండాయి.

భారీగా పెరిగిన వరి, వేరుశనగ సాగు..

గత రబీలో కల్వకుర్తి మండలంలో వరి సాగు కేవలం ఐదు వందల ఎకరాలే. ఇప్పుడు దాదాపు 6వేల ఎకరాలకు, వేరుశనగ సాగు 12వేల ఎకరాలకు చేరింది. కాల్వలకు ఇరువైపులా, చెరువుల కింద సూదిమొనంతా ఖాళీ స్థలం లేకుండా సాగు చేశారు. ఇనాళ్లు పనులు లేకుండా, కూలీ పనుల కోసం వెంపర్లాడిన రైతులు క్షణం తీరిక లేకుండా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై పోయారు. గత సంవత్సర జీవన విధానానికి, ఇప్పటి జీవన విధానానికి భారీ వ్యత్యాసాలు వచ్చాయి. తెల్లారింది లేవంగానే వ్యవసాయ పొలాలకు పరుగులు పెడుతున్నారు.

9 గంటలకే ఇండ్లకు తాళాలు..

29వ ప్యాకేజీలో టెయిల్‌ఎండ్ ప్రాంతమైన జంగారెడ్డిపల్లిలో కేవలం 200ఇండ్లు ఉన్నాయి. జంగారెడ్డిపల్లి వరకు కృష్ణా జలాలు రావడంతో పల్లె జీవనం మారిపోయింది. ఉదయం 9కే ఇండ్లకు తాళాలు వేసి పొలంబాట పడుతున్నారు.

ఏడేండ్ల తర్వాత వరి నాటిన..



ఏడేండ్ల తర్వాత వరి నాటారు. కాల్వలకు కృష్ణా నీళ్లు వచ్చాయి. చెరువులు నిండాయి. బోర్లు ఊటపట్టాయి. నాకున్న నాలుగు ఎకరాల్లో 2 ఎకరాలలో వరి నాటాను. ఇన్ని రోజులు బియ్యం కొనుకున్నే వాళ్లం. కొంత రేషన్ బియ్యం వచ్చేవి. ఇప్పుడు కేసీఆర్ సారు దయ వల్ల మాకు నీళ్లు వచ్చాయి. ఇప్పుడు మా బతుకులకు భరోసా కల్పించారు. నా ఆయస్సు పోసుకుని సీఎం సారు చల్లగుండాలి.

– మాదోలు రాంరెడ్డి, రైతు, తిమ్మరాశిపల్లి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..



గత ప్రభుత్వాలు ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టును ఎన్నికల హామీగా ఉపయోగించుకున్నాయి. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కల్వకుర్తి ప్రాంత చివరి ఆయకట్టు జంగారెడ్డిపల్లి వరకు కృష్ణా జలాలు అందించింది. కల్వకుర్తి ఎత్తిపోతల 29వ ప్యాకేజీలో భాగంగా 90 కిలోమీటర్ అక్విడెక్ట్ నుంచి 160 కిలోమీటర్ జంగారెడ్డి పల్లి వరకు ఇప్పటికి 52 చెరువులను నింపాం. మరిన్ని చెరువులను నింపుతూనే ఉన్నాం. మా ప్రాంత రైతులు పక్షాన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు.

– కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ





జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో సర్పంచ్‌ను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, టీడీపీ నాయకులను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

గులాబీ పార్టీలోకి భారీగా వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. బుధవారం కూడా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు పెద్ద ఎత్తున టీఆర్‌ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండలానికి చెందిన ఎంపీటీసీ ఆరెంపుల దానియేల్‌తోపాటు 60 కుటుంబాలకు చెందిన 180మంది మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో సర్పంచ్ నీరజతోపాటు మరో 50 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గంగారం తన అనుచరులతో టీఆర్‌ఎస్‌లో చేరారు. మాదాపూర్‌కు చెందిన కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులు 300మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలానికి చెందిన 170 మంది నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో 310 మంది ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మాజీ ఎంపీపీ కోళ్ల పద్మమ్మ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు.



సూర్యాపేట జిల్లా కోటపహాడ్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మేడిగడ్డ ద్వారా గోదావరి జలాలు

మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: గోదావరిపై నిర్మిస్తున్న మేడిగడ్డ ప్రాజెక్టు జూన్ నాటికి పూర్తయి వ్యవసాయ పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతాయని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్‌లో రూ.1.09 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సబ్‌స్టేషన్, సూర్యాపేట మండలం పిల్లలమర్రిలో రూ.10.17 కోట్లతో 192 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, జిల్లా కేంద్రంలో మహాప్రస్థానానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. కోటపహాడ్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని సోమవారం సాయంత్రం స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఒక్కరోజు వ్యవధిలోనే రూ.15 లక్షలు మంజూరు చేయించి బుధవారం బావికి శంకుస్థాపన చేశారు. శుక్రవారం నాటికి ఈ పనులు పూర్తయి నీటి సమస్య తీరనుండటంతో కోటపహాడ్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జిల్లాల వారీగా టీఆర్టీ నిర్వహించాలని సుప్రీంలో పిటిషన్

ఆసిఫాబాద్,నమస్తే తెలంగాణ: టీఆర్టీని కొత్త జిల్లాల వారీగా నిర్వహించాలని కోరుతూ కుమ్రం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పాత జిల్లాల ప్రతిపాదికన టీఆర్టీ నిర్వహించాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, వీరంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరిలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నరుగుల సురేష్, వైరగడే వినోద్, సంగారెడ్డి జిల్లాకు చెందిన శివరామస్వామి, మల్లేశ్,సూర్యనారాయణ, అక్కం రమేశ్, కమల, అబ్దుల్ సాలం ఉన్నారు. సుప్రీంకోర్టులో కేసు నంబర్ 3512/2018 టీఆర్టీగా నమోదైంది.

మార్చి 2న పెళ్లికొడుకుగా

భద్రాద్రి రామయ్య

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 2న భద్రాద్రి రామయ్యను పెళ్లికొడుకుగా ముస్తాబు చేసేందుకు దేవస్థానం వైదిక కమిటీ ముహూర్తం ఖరారు చేసింది. అదే రోజు స్వామివారికి వసంతోత్సవం, డోలోత్సవం, తలంబ్రాలు కలుపు వేడుక నిర్వహించనున్నారు. ఈ ఏడాది శ్రీసీతారాముల కల్యాణం మార్చి 26న, శ్రీరామ పట్టాభిషేకం మార్చి 27న జరగనున్నాయి.

కర్నూల్ వాసిని టీఆర్టీకి అనుమతించండి

టీఎస్‌పీఎస్సీకి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)కు కర్నూల్ జిల్లాకు చెందిన వ్యక్తిని అనుమతించాలంటూ టీఎస్‌పీఎస్సీని ఉమ్మడి హైకోర్టు బుధవారం ఆదేశించింది. టీఆర్టీకి తన దరఖాస్తును అంగీకరించకపోవడాన్ని సవాల్ చేస్తూ కర్నూల్ జిల్లా రెమటకు చెందిన రంగస్వామి హైకోర్టును ఆశ్రయించారు. టెన్త్‌వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యనభ్యసించినందున తనను తెలంగాణకు చెందిన వ్యక్తిగానే పరిగణించి దరఖాస్తు స్వీకరించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు. రంగస్వామి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం... నాలుగోతరగతి నుంచి పదోతరగతి వరకు వరుసగా నాలుగేండ్లు మహబూబ్‌నగర్ జిల్లాలో చదివినందున స్థానికుడిగానే గుర్తిస్తూ దరఖాస్తు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది.

మహిళ సజీవ దహనం

కిరోసిన్ పోసి తగుల బెట్టిన వైనం

తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరినందుకు ఘాతుకం



దుర్గం సేవంత (ఫైల్)

బెజ్జూర్: అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని కోరిన ఓ మహిళ ఒంటిపై కిరోసిన్ పోసి సజీవ దహనం చేశారు. ఈ ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు కథనం ప్రకారం.. మర్తిడి గ్రామ వాసి దుర్గం సేవంత వద్ద అదే గ్రామానికి చెందిన కామెర సాలు బాయి ఏడాది క్రితం రూ.47 వేలు అప్పుతీసుకున్నది. తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరితే సాలుబాయి దాటవేస్తూ వచ్చింది. డబ్బుల కోసం ఒత్తిడి తెస్తుందన్న ఉద్దేశంతో సాలుబాయి, తన కుమారుడు సాయి, అదే గ్రామానికి చెందిన బషారత్ ఖాన్‌తో కలిసి మంగళవారం రాత్రి సేవంత ఇంటికి వెళ్లారు. ఆమె నిద్రిస్తున్న సమయంలో కిరోసిన్ పోసి నిప్పు పెట్టారు. ఆమె కేకలు వేయడంతో బంధువులు లేచారు. తీవ్రంగా గాయపడిన సేవంతను సిర్పూర్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. కుమారుడు దుర్గం దాసు ఫిర్యాదు మేరకు బషారత్‌ఖాన్, కామెర సాలు బాయి, కామెర సాయిలుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివ ప్రసాద్ తెలిపారు. జనవరి 25న అర్ధరాత్రి కూడా గుర్తు తెలియని వ్యక్తులు సేవంత ఇంటికి నిప్పంటించారు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సేవంత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారం తిరుగక ముందే సేవంత సజీవ దహనం కావడం కలకలం రేపింది.

బస్సులో రూ.8.70లక్షల గుట్కాల స్వాధీనం

కూసుమంచి, నమస్తే తెలంగాణ: ఆర్టీసీ బస్సులో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.8.70 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూసుమంచి సీఐ వసంత్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన కిరాణ వ్యాపారి చెన్నారపు వాసు కొంతకాలంగా గుట్కా, అంబర్ ప్యాకెట్లను గుట్టుగా విక్రయిస్తున్నాడు. మంగళవారం వాసు, ఆయన షాపులో పని చేసే గుమాస్తా ప్రసాద్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఓ వ్యాపారి వద్ద నుంచి సుమారు రూ.8.70లక్షల విలువ చేసే గుట్కా, అంబర్ ప్యాకెట్లను కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో ఖమ్మం తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తనిఖీలు చేపట్టి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వాసు, ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య ఘటన

వివరాలు సమర్పించండి

- నల్లగొండ ఎస్పీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య ఘటన, దర్యాప్తు వివరాలను సమర్పించాలని నల్లగొండ ఎస్పీని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి అన్ని వివరాలను మూడువారాల్లో నివేదిక రూపంలో అందజేయాలని స్పష్టంచేసింది. తన భర్త హత్య కేసు దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐకి అప్పగించాలని లక్ష్మి హైకోర్టులో వ్యాజ్యం దాఖలుచేయగా బుధవారం జస్టిస్ ఏవీ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. లక్ష్మి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిందితుల కాల్‌డేటాను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదించారు. కాల్‌డేటాను పోలీసులు సేకరించారని, వివరాలు బయటికి వస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని నివేదించారు. పూర్తివివరాలు సమర్పించేందుకు మూడువారాల సమయం కావాలన్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు పూర్తివివరాలను సమర్పించేందుకు మూడువారాల గడువు ఇచ్చేందుకు హైకోర్టు అనుమతించింది.

సెన్సెక్స్	నిఫ్టీ
35,965	11,028
↘ 69	↘ 22

ముడి చమురు (బ్రెంట్) ↘ 68.77 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,390
22 క్యారెట్లు	30,240
వెండి (కిలో)	39,170

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.93	67.17
బహ్రెయిన్ దినార్	156.88	179.79
కువైట్ దినార్	175.76	218.80
సౌదీ రియాల్	15.40	18.26
యూఏఈ దిర్హామ్	15.77	18.43

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	74.00
రిటైల్ లైవ్	96.00
డ్రెస్డ్	139.00
స్కిన్‌లెస్	158.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	360-00
రంగారెడ్డి	360-00
మెదక్	360-00
కరీంనగర్	362-00
వరంగల్	362-00
రిటైల్ ప్రైస్	4-20

జైట్లీకి ప్రధాన సవాళ్లివే

వృద్ధిరేటు



నాలుగేండ్ల కనిష్ఠానికి నీరసించిన జీడీపీని తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం 7.1 శాతంగా నమోదైన వృద్ధిరేటు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.75 శాతానికే పరిమితం అవుతుందన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలో వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ 7-7.5 శాతంగా ఉండాలన్న లక్ష్యం నెరవేరడం ఈ బడ్జెట్‌పైనే ఆధారపడి ఉన్నది.

ద్రవ్యలోటు



ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యసాధన కష్టతరంగా మారడం.. ఈసారి బడ్జెట్‌లో వృద్ధిరేటు పురోగతికి ప్రోత్సాహకాలను పరిమితం చేస్తున్నది. ఖజానాపై భారం పడేలా రాయితీలు, పన్ను కోతలు చేస్తే ఆర్థిక క్రమశిక్షణకు భంగం వాటిల్లినట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో అటు ద్రవ్యలోటును, ఇటు ఆయా రంగాల అభివృద్ధి నిధులను బ్యాలెన్స్ చేయడం జైట్లీకి సవాలేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

చమురు ధరలు



దేశీయ ఇంధన అవసరాలు 80 శాతం విదేశీ దిగుమతులపైనే ఆధారపడ్డ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు కూడా జైట్లీకి ఈ బడ్జెట్‌లో సవాల్ విసురుతున్నాయి. గతేడాది జూన్ నుంచి గ్లోబల్ మార్కెట్లలో క్రూడాయిల్ ధరలు 40 శాతానికిపైగా పెరిగాయి. దీంతో దేశీయ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు భగ్గుమంటున్నాయి. ఇవి జీడీపీని ప్రభావితం చేస్తుండగా, పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలన్న డిమాండ్లు జైట్లీని గట్టిగా తాకుతున్నాయి.

జీఎస్టీ వసూళ్లు



భారతీయ పన్నుల వ్యవస్థను, ముఖ్యంగా పరోక్ష పన్నుల ముఖచిత్రాన్నే వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మార్చేసింది. దీనివల్ల దేశ జీడీపీ మందగించిందన్న విమర్శలు వ్యక్తమవగా, సామాన్యులపై మరింత భారం పడిందన్న అపవాదునూ మోదీ సర్కారు మూటగట్టుకున్నది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయమూ తగ్గిపోయింది. జీఎస్టీ వసూళ్లు అంతంతమాత్రంగా ఉన్న వేళ మరిన్ని వస్తువులు, సేవలపై పన్నును తగ్గించాలన్న డిమాండ్ నిజంగా జైట్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.


పన్ను కోతలు



ఆయా శాఖలకు దక్కే నిధులకన్నా.. పన్ను కోతలపైనే బడ్జెట్‌లో ఎక్కువ అంచనాలు వచ్చాయి. ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెంపు, కార్పొరేట్ పన్ను తగ్గింపులపై పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాల ఆశలను నెరవేర్చడమూ జైట్లీకి ఓ సవాల్‌గానే తయారైంది. వేతన జీవులైతే బడ్జెట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సామాన్యుడి బడ్జెటేనా!

● ద్రవ్యలోటు లక్ష్యాలకే ప్రాధాన్యమా? ● డైలమాలో మోదీ ప్రభుత్వం



సార్వత్రిక బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దిన అనంతరం బుధవారం న్యూఢిల్లీలో మీడియా ముందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ, ఆ శాఖ సహాయ మంత్రులు రాధాకృష్ణన్, శివ్‌ప్రతాప్ శుక్లా, సిబ్బంది



సార్వత్రిక బడ్జెట్ 2018-19కు మరికొద్ది ఘడియల్లో తెర లేవబోతున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌కు నివేదించనున్న ఈ బడ్జెట్.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి, ముఖ్యంగా బీజేపీకి పెను సవాళ్లను విసురుతున్నది. గత నాలుగు బడ్జెట్లతో పోలిస్తే జైట్లీకి ఇదే అత్యంత కఠినమైన బడ్జెట్‌గా ఆర్థిక నిపుణులు పరిగణిస్తున్నారు. దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత జైట్లీ ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే. అలాగే వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోదీ సర్కారు ప్రవేశపెట్టనున్న చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ఇదే కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ బడ్జెట్‌పై దేశంలోని వివిధ వర్గాలు, ప్రత్యేకించి గ్రామీణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకోవడమే ఈ ఉత్కంఠకు కారణం. ప్రస్తుతం ఆపదలో ఉన్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు, కొత్త ఉద్యోగాలను సృష్టించి దేశంలోని కోట్లాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే చర్యలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేస్తారా? లేక ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలకే అంటిపెట్టుకుని ఉంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఎన్ని ఇబ్బందులున్నా కేంద్రం మాత్రం తన ద్రవ్య లోటు లక్ష్యాల నుంచి దృష్టి మరల్చకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మధ్యతరగతి ఓటర్లతో పాటు పట్టణ ప్రాంతాల్లోని కార్మికులు, చిన్న వ్యాపారులపై మోదీ, ఆయన పార్టీ (బీజేపీ) ఎక్కువగా ఆధారపడినట్లు కనిపిస్తున్నప్పటికీ ప్రధానిగా మోదీ ఎదగడంలో గ్రామీణ ఓటర్లు కూడా అంతే సమానమైన పాత్రను పోషించారన్నది జగమెరిగిన సత్యం. పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు ఎనిమిది రాష్ర్టాల శాసనసభలకు త్వరలో ఎన్నికలు జరుగనుండటంతో ఈసారి కేంద్ర బడ్జెట్‌పై ఎన్నికల రాజకీయాలే ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయని సుస్పష్టమవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ పునాదులు బలహీనపడ్డాయని గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో రుజువు కావడం, బీజేపీ పాలనలో ఉన్న మూడు పెద్ద రాష్ర్టాలు సహా వ్యవసాయం ఎక్కువగా జరిగే మరికొన్ని రాష్ర్టాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈసారి సార్వత్రిక బడ్జెట్‌లో అన్ని రంగాల కంటే గ్రామీణ రంగం నుంచే ఎక్కువ పోటీ ఎదురు కానున్నది. దేశంలోని 130 కోట్ల జనాభాలో గ్రామీణులే దాదాపు 70 శాతం మేరకు ఉన్నందున ఈ బడ్జెట్‌లో జైట్లీ గ్రామసీమలకు పెద్దపీట వేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి పల్లె జనుల సంక్షేమం కోసం కనీసం కొన్నయినా కొత్త పథకాలను ప్రకటించడంతో పాటు ప్రస్తుతం అమలులో ఉన్న ఎంఎన్‌ఆర్‌ఈజీఏ (ఉపాధి హామీ), రూరల్ హౌసింగ్, పంటల బీమా లాంటి పథకాలకు, సాగునీటి ప్రాజెక్టులకు మరిన్ని నిధులు కేటాయించవచ్చు. మరోవైపు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) అమలు వలన ఎదురైన ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోయిన సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ బడ్జెట్‌లో పన్నుల నుంచి, ముఖ్యంగా ఆదాయ పన్ను భారం నుంచి కొంత మేరకైనా ఉపశమనం లభిస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. బీజేపీ ఓటు బ్యాంకులో సామన్య, మధ్య తరగతి ప్రజలు చాలా కీలకపాత్ర పోషిస్తున్నందున బడ్జెట్‌లో మోదీ సర్కారు వీరిని కూడా విస్మరించలేదు. అలాగే గత కొన్నేండ్ల నుంచి స్తబ్ధుగా ఉన్న ప్రైవేటు పెట్టుబడులకు ఊతమివ్వాలంటే కార్పొరేట్ రంగానికి ఈ బడ్జెట్‌లో కేంద్రం కొంతమేరకైనా ఊరట కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రజలను సంతృప్తిపరిచేందుకు నగదు లభ్యతను పెంచినట్లయితే అది ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోయడంతో పాటు ద్రవ్యలోటు లక్ష్యాలను చేరుకోవడంలో కేంద్రానికి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. అయినప్పటికీ ఈసారి బడ్జెట్‌లో ఎన్నికలకు సంబంధించిన లెక్కలకే ఎక్కువ ప్రాధాన్యత లభించడం ఖాయంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి మరింత బీమా రక్షణ కల్పించడంతో పాటు కోల్డ్ సోరేజీ వసతులను విస్తరించేందుకు, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు మోదీ సర్కారు ఈ బడ్జెట్‌ను ఉపయోగించుకోవచ్చు. అలాగే రహదారుల నిర్మాణం లాంటి మౌలిక వసతుల ప్రాజెక్టులతో పాటు రైల్వేల ఆధునీకరణకు ఎక్కువ నిధులను వెచ్చించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు ఈ బడ్జెట్‌లో జైట్లీ తగిన చర్యలు చేపట్టే అవకాశం ఉన్నది. అయితే ఆసియా ఖండంలో మరెక్కడా లేనంతగా దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యలోటుకు ఒకవైపు కళ్లెం వేస్తూనే మరో వైపు ఈ బడ్జెట్‌లో దేశ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే చర్యలు చేపట్టి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి నిజంగా 'కత్తి మీద సాము' లాంటి విషయమే.

మదుపరుల ఆశలు నెరవేరుతాయా?

ఈసారి బడ్జెట్‌లో ద్రవ్యలోటు ఒకవైపైతే.. మిగతా అన్ని అంశాలు మరోవైపు. ఎవరికి ఏ మేలు కలుగాలన్నా.. అది ద్రవ్యలోటునే ప్రభావితం చేయనున్నది మరి. ముఖ్యంగా ఈ బడ్జెట్ 2018-19.. మోదీ సర్కారుపై మదుపరుల విశ్వాసానికే పరీక్షగా పరిణమించింది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసానికి కొలమానమైన ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు కేంద్రం మొగ్గుచూపుతుందా?.. లేదంటే పన్నుల కోతలు, ప్రోత్సాహకాల ద్వారా మదుపరుల ఆశలను నెరవేరుస్తుందా? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. మొదట్నుంచి నరేంద్ర మోదీకి మదుపరులు పెద్ద ఎత్తున మద్దతునిస్తున్న విషయం తెలిసిందే. చూద్దాం.. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలున్న క్రమంలో వస్తున్న ఈ చివరి పూర్తికాల బడ్జెట్ మదుపరుల నమ్మకాన్ని నిలబెడుతుందా? లేదా? అన్నది.

ఐదు నెలల కనిష్ఠానికి కీలక రంగాలు

■ డిసెంబర్‌లో వృద్ధి 4 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ, జనవరి 31: కీలక రంగాలు ఐదు నెలల కనిష్ఠానికి జారుకున్నాయి. బొగ్గు, ఇంధనం రంగాల్లో నెలకొన్న నిస్తేజం కారణంగా డిసెంబర్ నెలకుగాను ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి 4 శాతానికి పరిమితమైంది. జూలై 2017 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 5.6 శాతంగా నమోదైంది. గడిచిన నెల విషయానికి వస్తే బొగ్గు 0.1 శాతానికి పరిమితంకాగా, ఇంధన రంగం 2.1 శాతంగా, స్టీల్ రంగంలో 2.6 శాతం వృద్ధిని కనబరుచగా, విద్యుత్ 3.3 శాతం చొప్పున పెరిగాయి. వీటితోపాటు రిఫైనరీ ఉత్పత్తులు, సహజ వాయువు, ఎరువులు, సిమెంట్ రంగాలు కూడా మెరుగైన పనితీరు కనబరిచాయి.

2015-16లో వృద్ధి 8.2 శాతం

2015-16 ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధిరేటును 8.2 శాతానికి సవరిస్తున్నట్లు కేంద్ర గణాంకాల శాఖ బుధవారం వెల్లడించింది. గతంలో 8 శాతంగా ఉంటుందని అంచనావేసింది. 2016-17లో నమోదైన వృద్ధిరేటు 7.1 శాతంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇలా జీడీపీ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం మార్చడం ఇది రెండోసారి.

జీఎస్టీ రిటర్నులు సులభతరం చేయాలి:సీఐఐ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వస్తువుల,సేవల పన్నుకి (జీఎస్టీ) సంబంధించిన రిటర్న్‌ల దాఖలు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జీఎస్టీఆర్ రిటర్న్-1 దాఖలుకు ఫిబ్రవరి10వ తేదీ వరకు ఉన్న గడువును మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది. రిటర్నుల దాఖలు ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా పన్ను చెల్లించేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని సీఐఐ కేంద్రానికి సూచించింది.

సదరన్ ట్రావెల్స్ హాలిడే బజార్



హైదరాబాద్, జనవరి 31: పర్యాటక సేవలందిస్తున్న ప్రముఖ సంస్థ సదరన్ ట్రావెల్స్.. రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో హాలిడే బజార్‌ను నిర్వహిస్తున్నది. ఈ శని, ఆదివారాల్లో జరుగబోయే ఈ కార్యక్రమం వివరాలను ఓ ప్రకటనలో తెలిపింది. దేశ, విదేశీ యాత్రల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ హాలీడే బజార్ హైదరాబాద్ (గోల్కొండ హోటల్, మాసబ్ ట్యాంక్), వరంగల్ (సుప్రభ హోటల్, హన్మకొండ), కరీంనగర్ (హోటల్ ప్రతిమా రీజెన్సీ, ముకరాంపుర), ఖమ్మం (బడ్జెట్ హోటల్, గాంధీ చౌక్)లో జరుగుతుందని సంస్థ వివరించింది. పర్యాటకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ టూర్ల ప్యాకేజీలను తెలుసుకోవచ్చన్నది. మునుపెన్నడూ లేని విధంగా ఈ హాలిడే బజార్‌లో డిస్కౌంట్లను అందిస్తున్నట్లు పేర్కొన్నది.

ఐసీఐసీఐ బ్యాంకుకు ఎన్‌పీఏల సెగ

■ క్యూ3లో 27 శాతం తగ్గిన లాభం



న్యూఢిల్లీ, జనవరి 31: దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన ఐసీఐసీఐ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,894.15 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.2,611 కోట్లతో పోలిస్తే 27 శాతం మందగించింది. మొండి బకాయిలు అంతకంతకు పెరుగడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో ఆదాయం రూ.27,876 కోట్ల నుంచి రూ.28,501 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఏకీకృత విషయానికి వస్తే బ్యాంక్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 32.4 శాతం క్షీణించి రూ.1,650 కోట్లకు జారుకున్నది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 6 శాతం పెరిగి రూ.5,705 కోట్లకు చేరుకున్నది. నికర వడ్డీ లాభం (నిమ్) 3.53 శాతం నుంచి 3.14 శాతానికి తగ్గినట్లు వెల్లడించిన బ్యాంక్.. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 7.82 శాతానికి పెరుగగా, నికర ఎన్‌పీఏ 4.20 శాతంగా నమోదైంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.3,569.56 కోట్ల మేర నిధులను వెచ్చించాల్సి వచ్చిందని తెలిపింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో కేటాయించిన రూ.2,712.70 కోట్లతో పాటు ట్రెజరీ ఆదాయం 92 శాతం తగ్గడం వల్లనే లాభాల్లో గండిపడటానికి ప్రధాన కారణమని ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈవో చందాకొచ్చర్ తెలిపారు. స్థూల నిరర్థక ఆస్తుల విలువ తొమ్మిది త్రైమాసికాల కనిష్ఠ స్థాయి రూ.4,380 కోట్లకు తగ్గినట్లు ఆమె పేర్కొన్నారు. గడిచిన త్రైమాసికంలో తాజాగా రూ.700 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరుకున్నాయన్నారు. ఆర్బీఐ మార్గదర్శకాలకు లోబడి రూ.10 వేల కోట్ల విలువైన 18 ఖాతాలను దివాల చట్టం కింద చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.353.45 వద్ద స్థిరపడింది.

రీక్యాప్ బాండ్లపై రేట్లను నిర్ణయించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయంలో భాగంగా జారీ చేస్తున్న రూ.80,000 కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్ల కోసం కేంద్రం కూపన్ రేట్లను నిర్ణయించింది. 2028 నుంచి 2033 వరకు ఆరు కాలవ్యవధులకుగాను ఈ రేట్లను ప్రకటించగా, కనిష్ఠ రేటు 7.35 శాతం, గరిష్ఠ రేటు 7.68 శాతంగా ఉన్నది. ఇటీవలే విడుదలైన ఓ ప్రభుత్వ అధికారిక ప్రకటన ఈ మేరకు స్పష్టం చేసింది. కాగా, నిర్దేశిత పెట్టుబడులు, వృద్ధి అవసరాలకుగాను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఈ రీక్యాపిటలైజేషన్ బాండ్ల ద్వారా కేంద్రం నిధులను సమకూరుస్తున్నది. ఈ సెక్యూరిటీ బాండ్లు ట్రేడింగ్‌కు చెల్లవని కూడా ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) సమస్యతో సతమతమవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకుల కోసం గతేడాది రూ.2.11 లక్షల కోట్ల మూలధన సాయాన్ని మోదీ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.

36 వేల దిగువకు సెన్సెక్స్

బడ్జెట్ సమీపిస్తున్నకొద్దీ అమ్మకాల ఒత్తిడిలోకి మదుపరులు

ముంబై, జనవరి 31: కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతున్నకొద్దీ మదుపరులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. మొన్నటిదాకా వరుస లాభాల్లో కదలాడిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. గత రెండు రోజులుగా నష్టాలకే పరిమితమయ్యాయి. అంతకుముందు రికార్డుస్థాయిల్లో కదలాడిన సూచీలు ఇప్పుడు నేలచూపులు చూస్తుండగా, బుధవారం సెన్సెక్స్ 36 వేల మార్కును చేజార్చుకున్నది. నిఫ్టీ సైతం ఒకానొక దశలో 11 వేల దిగువకు పడిపోయింది. మదుపరులు లాభాల స్వీకరణకే మొగ్గు చూపడంతో సెన్సెక్స్ 68.71 పాయింట్లు కోల్పోయి 35,965.02 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 21.95 పాయింట్లు నష్టపోయి 11,027.70 వద్ద నిలిచింది. ఇక ఇంట్రా-డేలోనైతే సెన్సెక్స్ 35,818.41 పాయింట్లను తాకగా, నిఫ్టీ 10,979.30 పాయింట్లకు చేరింది. కాగా, హెల్త్‌కేర్, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, టెక్నాలజీ, ఇన్‌ఫ్రా, పీఎస్‌యూ షేర్లు నష్టాలపాలయ్యాయి. డాక్టర్ రెడ్డీస్ షేర్ విలువ అత్యధికంగా 3.75 శాతం క్షీణించింది. అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లలో కీలకమైన జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలూ పతనమవగా, ఐరోపా మార్కెట్లలో మాత్రం ప్రధాన సూచీలైన ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్‌లు లాభాల్లో ముగిశాయి.

మార్కెట్ లీడర్ రిలయన్సే

మార్కెట్ విలువలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) మళ్లీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నది. బుధవారం ట్రేడింగ్‌లో షేర్ విలువ 1.25 శాతం పుంజుకున్నది. దీంతో రూ.6,08,804.91 కోట్లతో బీఎస్‌ఈ టాప్-10 సంస్థల్లోనే అగ్రగామిగా నిలిచింది. సోమవారం దేశీయ ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్.. ఆర్‌ఐఎల్‌ను వెనుకకునెట్టిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం టీసీఎస్ షేర్ విలువ 1.33 శాతం పడిపోగా, దాని మార్కెట్ విలువ రూ.5,95,678.44 కోట్ల వద్దకు దిగజారి రెండో స్థానానికి పరిమితమైంది.



ఎంఎన్‌పీ చార్జీలను భారీగా తగ్గించిన ట్రాయ్

న్యూఢిల్లీ, జనవరి 31: మొబైల్ నంబర్ పోర్టబుల్(ఎంఎన్‌పీ) చార్జీలను 79 శాతం వరకు తగ్గించినట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ ప్రకటించింది. ఈ తాజా నిర్ణయంతో బుధవారం నుంచి అమలులోకి వచ్చేలా ఎంఎన్‌పీ చార్జీలు రూ.19 నుంచి రూ.4కి తగ్గనున్నాయి. ఒక నెట్‌వర్క్ నుంచి మరో నెట్‌వర్క్‌కు బదిలీ అయ్యేటప్పుడు వినియోగదారుడిపై రూ.4 కంటే అధికంగా చార్జీ విధించరాదని టెలికం సంస్థలకు ట్రాయ్ ఆదేశించింది. పోర్ట్ లావాదేవీలు అధికంగా ఉండటంతో వినియోగదారుడిపై పడుతున్న భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రాయ్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

రాంకీ ఇంజనీర్స్ వెయ్యికోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 31: రాంకీ గ్రూపునకు చెందిన వ్యర్థాల నిర్వహణ సంస్థయైన రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. వచ్చే రెండేండ్లకాలంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో గౌథమ్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. అంతర్గత వనరుల ద్వారా సేకరించనున్న ఈ నిధులను దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి వినియోగించనున్నట్లు ఆయన ప్రకటించారు. 2020 నాటికి కంపెనీ టర్నోవర్ రెండింతలు పెరిగి రూ.3,500 కోట్లకు చేరుకునేదానిపై ఆయన గట్టినమ్మకాన్ని వ్యక్తంచేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,550 కోట్లుగా నమోదైంది. ఈ ఆదాయంలో అంతర్జాతీయంగా వ్యాపారం నిర్వహించడం ద్వారా రూ.1,100 కోట్లు రావచ్చునని ఆయన అంచనావేస్తున్నారు. ప్రస్తుతం ఇది రూ.600 కోట్లుగా ఉన్నది.

2019 మార్చి నాటికి హైదరాబాద్ విద్యుత్ ప్లాంట్ సిద్ధం

హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ వద్ద సంస్థ ఏర్పాటు చేస్తున్న చెత్తతో తయారు చేస్తున్న 20 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ 2019 మార్చి నాటికి అందుబాటులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం సంస్థ రూ.330 కోట్ల మేర పెట్టుబడిగా పెడుతున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లభిస్తున్న చెత్తతో 100 మెగావాట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, దశలవారీగా ఈ కెపాసిటీని పెంచే అవకాశం ఉన్నదన్నారు. ఇదే క్రమంలో వచ్చే మూడేండ్లకాలంలో 100 మెగావాట్లకు పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

ఇంటర్ వరకు ఆర్‌ఎంఎస్‌ఏ.. కేజీబీవీలు

■ ఒకే గొడుగు కిందకు ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏ, టీచర్‌ట్రైనింగ్..

■ ప్రతిపాదనలను సిద్ధం కేంద్రం..త్వరలో తుది నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఏ), కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్ వరకు విస్తరించాలని కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. సర్వశిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ), ఆర్‌ఎంఎస్‌ఏ, టీచర్ ట్రైనింగ్ వంటి అన్నిరకాల విద్యాపథకాలను కూడా ఒకే గొడుకు కిందకు తీసుకురావాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) భావిస్తున్నది. వీటన్నంటినీ విలీనం చేసి ఒకే సొసైటీ పరిధిలోకి తీసుకురానున్నారు.

నిధుల వినియోగంలో రాష్ర్టాలకు స్వేచ్ఛ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాభివృద్ధి పథకాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా అమలవుతున్నాయి. వీటి నిధులను ఖర్చుచేయడంలో క్షేత్రస్థాయిలో అనేక సాంకేతికసమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాపథకాల నిర్వహణకు సొసైటీని ఏర్పాటుచేసి, వచ్చే నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛనిచ్చే అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ ప్రతిపాదనలకు అన్ని రాష్ర్టాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు జీ కిషన్ అభిప్రాయపడ్డారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో అదనంగా 1,035 మరుగుదొడ్ల నిర్మాణాలకు కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. దేశవ్యాప్తంగా 1-8 వరకు అమలవుతున్న రెండుజతల ఉచిత యూనిఫాంల పంపిణీ పథకంపైనా కేంద్రం దృష్టి సారించింది. ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచిత యూనిఫాంలు అందజేయాలనే ప్రతిపాదనతోపాటు, ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.600 ఇవ్వాలనే ప్రతిపాదన కూడా ఉన్నదని అధికారులు తెలిపారు. స్కూల్ గ్రాంట్స్‌కు పెంపు, ఉచితంగా బూట్లు పంపిణీ చేసే అంశంపైనా కేంద్రం ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. అయితే దీనిపై కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని వారు చెప్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ సర్కార్ నజర్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఈసారైనా కరుణ చూపుతుందా అని తెలంగాణ ప్రభుత్వం ఎదురుచూస్తున్నది. కేంద్రం నుంచి వివిధ పథకాల కింద రావాల్సిన బకాయిలు, 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రంలో అమలవుతున్న బృహత్తర అభివృద్ధి పథకాలకు కేంద్రం నుంచి నిధులను సాధించడానికిప్రభుత్వం అన్నివిధాలుగా ప్రయత్నాలు చేసింది. కేంద్రం నుంచి ప్రస్తుతం నుంచి పన్నుల వాటాగా నెలకు సుమారు రూ. 1300 కోట్లు వస్తున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరానికి రూ. 14 వేల కోట్లు సమకూరాయి. 2017-18లో ఈ రాబడి రూ.17వేల కోట్ల వరకు ఉండవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసింది. కానీ, నూతనంగా అమల్లోకి వచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ), పన్ను వసూలు తగ్గడం వంటి ప్రతికూల పరిణామాలతో ఆశించిన మేరకు వాటా రావడం లేదు.

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో న్యాయం జరిగేనా?

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో నిధుల విడుదల ఈసారి పెరుగుతుందా? సంక్షేమ పథకాలకు, నీటి ప్రాజెక్టులకు సాయం అందిస్తుందా? ఎయిమ్స్ ఏర్పాటుకు నిధులను మంజూరు చేస్తుందా? అనే విషయాలపై ఉత్కంఠ నెలకొంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణకు కేంద్రం నుంచి కనీస మద్దతు లభించడం లేదని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ జితేందర్ రెడ్డి ఇప్పటికే అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 41రకాల పథకాలను అమలు చేస్తున్నది. వీటిలో కూడా కొన్నింటిని కుదించి మొత్తం రాష్ర్టాలపైనే భారం వేస్తుందా అన్న అనుమానాలున్నాయి. రాష్ట్రంలో సబ్సిడీ బియ్యం పథకం కింద రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మైనార్టీల సంక్షేమానికి, వారి విద్యావ్యాప్తికి తగిన ఆర్థిక సాయం చేయాలని, సబ్సిడీ బియ్యం, గోధుమల కోటాను పెంచాలని రాష్ట్రం చేసిన విజ్ఞప్తులకు స్పందన లేదు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధులను మంజూరు చేయాలని కోరినా ఫలితం లేదు. బుధవారం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లోనైనా కేంద్రం రాష్ర్టానికి ఎంతవరకు తోడ్పాటునిస్తుంది అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

భారత ప్రభుత్వము
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

బహిరంగ ప్రకటన

(NH చట్టం, 1956లోని సెక్షన్ 3–G క్రింద, NH–202 (పాత) 163 (క్రొత్త)లోని యాదగిరి–వరంగల్ సెక్షన్ కి.మీ. 76.800 నుండి కి.మీ. 105.150 వరకు నాలుగు లేన్ల కొరకు)

నం.B/2336/2017 తేది: 22-01-2018

రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, జనగాం డివిజన్ మరియు జిల్లాలోని కి.మీ. 76.800 నుండి కి.మీ. 105.150 వరకు భారత రాజపత్రం విశేష పత్రం భాగం–II, సెక్షన్ 3 ఉప సబ్ సెక్షన్ (ii) తేది: 9 జనవరి 2018లో ప్రచురించిన నోటిఫికేషన్ S.O. 119(E) ప్రకారం జాతీయ రహదారుల చట్టం, 1956 లోని సెక్షన్ 3–D (1) క్రింద ఎట్టి తాకట్టు ఋణభారాలు లేకుండా షెడ్యూలులో తెలిపిన భూములు కట్టడాలు, చెట్లు మొదలగు వాటితో భారతదేశ కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించినవి. సదరు భూమిలో ప్రయోజనం గల వ్యక్తులు అందరూ సమర్థప్రాధికారి (భూసేకరణ) మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, జనగాం డివిజన్, జనగాం వారి సమక్షంలో తమ భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు మరియు డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంట్ ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా కాలమ్ నం. 5లో దిగువ తెలిపిన తేదీ సమయాల్లో హాజరు కావలసిందిగా మరియు సదరు భూములలో వారి సంబంధిత ప్రయోజనం స్వభావం తెలుపవలసిందిగా కోరడమైనది.

క్రమ సంఖ్య	జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ తేది మరియు సమయం	విచారణ ప్రదేశం
1	2	3	4	5	6
1	జనగాం	రఘునాథపల్లి జనగాం మరియు లింగాలఘన్‌పూర్	రఘునాథపల్లి, కోమల్ల, అశ్వరావుపల్లి, నిడిగొండ, యశ్వంతాపూర్, పెంబర్తి, జనగాం, నెల్లుట్ల	తేది: 15-02-2018 సమయం: ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం.	రెవిన్యూ డివిజనల్ ఆఫీస్, జనగాం

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని నేషనల్ హైవే నం. 202 (పాత) 163 (క్రొత్త)లోని కి.మీ. 76.800 నుండి కి.మీ. 105.150 వరకు (యాదగిరి–వరంగల్ సెక్షన్) భూమి స్ట్రిప్

క్ర. సం.	సర్వే నం.	రకం	స్వభావం	3-D నోటిఫికేషన్‌లో ప్రచురించిన విధంగా చ.మీ.లలో విస్తీర్ణం	యజమాని మరియు ప్రయోజనం గల వ్యక్తి పేరు	పట్టాదారు (P) లేదా అనుభవదారు (E) లేదా (P & E)	చ.మీ.లలో భూమి యొక్క ఇండివిడ్యువల్ విస్తీర్ణం	కట్టడం రకం బావులు చెట్లు వగైరా
1	2	3	4	5	6	7	8	9
జిల్లా: జనగాం					మండలం: రఘునాథపల్లి			గ్రామం: నిడికొండ
